www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కంగనకు చెంపదెబ్బ



చండీగఢ్ విమానాశ్రయంలో ఎంపీపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్ 2

రైతుల ఉద్యమంపై వ్యాఖ్యల నేపథ్యంలోనే!

కానిస్టేబుల్ సస్పెన్షన్, ఎఫ్ఐఆర్ దాఖలు

శుక్రవారం | 7-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 69 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 4.45 తదుపరి విదియ; నక్షత్రం: మృగశిర రా. 7.43 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: తె.4.06-5.42; దుర్ముహూర్తం: ఉ.9.19-9.11, మ.12.40-1.32; అమృతఘడియలు: ఉ.11.07-12.40; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.44 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కొత్త టీంపై కసరత్తు

కేబినెట్‌లో 50 మందికిపైగా చాన్స్.. నడ్డా నివాసంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల భేటీ

పలువురు పాత మంత్రులకు ఉద్వాసన

నిర్మలా సీతారామన్‌కు అనుమానమే

మిత్రపక్షాలకు ఆర్థిక, హోం, రక్షణ, విదేశాంగ, వాణిజ్య మినహా ఇతర శాఖల కేటాయింపు!

మహిళా కోటాలో డీకే అరుణ, పురందేశ్వరి

పరిశీలనలో కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల

ఎల్లుండి ప్రధానిగా మోదీ ప్రమాణం

పలువురు మంత్రులు కూడా..

బంగ్లాదేశ్, శ్రీలంక దేశాధినేతలకు ఆహ్వానం


హాజరుకానున్న చంద్రబాబు, నితీశ్ తదితరులు

నేడు ఎన్డీయే ఎంపీల సమావేశం

ఢిల్లీలో బాబు.. కొనసాగుతున్న మంతనాలు

రాష్ట్రపతిని కలిసిన కేంద్ర ఎన్నికల కమిషనర్లు

ఎన్నికైన ఎంపీల జాబితా అందజేత



కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ

చంద్రబాబు గ్రీన్ సిగ్నల్.. ఢిల్లీకి

రాష్ట్రపతిని కలిశాక నేటి రాత్రికి అమరావతికి తిరిగి రాక

మళ్లీ 9న హస్తినకు

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడో సారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణం చేయనున్నారు. ఆయనతోపాటు పలువురు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా మోదీ.. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాలను ఆహ్వానించారు. వారు అందుకు అంగీకరించారు. ఎన్డీయే అగ్రనేతలు చంద్రబాబునాయుడు, నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ శిందే తదితరులు కూడా మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కానున్నారు. కాగా, మోదీ మంత్రివర్గంలో పలువురు పాత మంత్రులను పక్కనపెట్టే అవకాశాలు ఉన్నాయని, కొనసాగించే మంత్రుల శాఖలను కూడా మార్చవచ్చని సమాచారం. గత కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించిన నిర్మలా సీతారామన్ సొంత రాష్ట్రం తమిళనాడులో బీజేపీ ఒక్క సీటు కూడా

మిగతా 2వ పేజీలో...

బీజేపీ అధ్యక్షుడిగా శివరాజ్?

నడ్డా స్థానంలో మధ్యప్రదేశ్ మాజీ సీఎంకు పదవి

పార్టీలో సీనియర్ అయినందునే

తక్షణమే ఢిల్లీకి రావాలంటూ పార్టీ నుంచి వర్తమానం

శివరాజ్‌ను నాతో తీసుకెళ్తా.. ప్రచారంలో మోదీ వ్యాఖ్య

ఒడిసా సీఎంగా ధర్మేంద్ర ప్రధాన్?

అగ్నిపథ్‌ను సమీక్షించాలి

జేడీయూ తొలి డిమాండ్

'వన్ నేషన్.. వన్ పోల్'కు ఓకే

దేశవ్యాప్త కులగణన..

బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలి

యూసీసీపై భాగస్వాములతో చర్చించాలి: కేసీ త్యాగి

సమీక్షకు చిరాగ్ మద్దతు 2



కాంగ్రెస్‌తో టచ్‌లో.. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

పార్టీ మారేందుకు ముఖ్య నేతలతో మంతనాలు

సీఎం రేవంత్, వేం నరేందర్‌తో సంప్రదింపులు

గ్రేటర్ హైదరాబాద్ పరిధి శాసనసభ్యులే అధికం

టీడీపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారే

ఈ నెలాఖరులోగానే ఎక్కువమంది ఫిరాయింపు

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వం మొదలుకానుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసన సభ్యులు కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు మంతనాలు ప్రారంభించారు. వచ్చే ఐదేళ్ల పాటు సౌకర్యంగా ఉండే ఆలోచనతో కొందరు పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికార పార్టీ ముఖ్యులతో అంతర్గత సంప్రదింపులు, చర్చలు సాగిస్తున్నారు. అటునుంచి అనుమతి లభించినదే తడవుగా జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలా 10 మందికి పైగా గులాబీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో చర్చల్లో ఉన్నారు. అంతా బాగుంటే ఈ నెలలోనే భారీగా మార్పులు ఉండొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ఇలాంటివారిని ఉద్దేశించే సీఎం రేవంత్ బుధవారం నర్మగర్భ వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నేతలు, ఎమ్మెల్యేల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని, కమలం పార్టీకి ఓట్లు మళ్లేలా చేయడంతో ఏడు ఎంపీ

మిగతా 13వ పేజీలో...



మారిన చంద్రబాబును చూస్తారు

1 అధికారుల పాలన కాదు.. ప్రజాపాలన

1 పాలనలో రాజకీయ కోణం ఆవిష్కరిస్తా

1 ఐదేళ్లుగా ప్రజలు, కార్యకర్తలకు వేధింపులు

1 అన్యాయం జరిగిన వారికి న్యాయం చేస్తా

1 టీడీపీ ఎంపీల సమావేశంలో చంద్రబాబు

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ సారి అధికారుల పాలన కాదని, ప్రజాపాలన ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. 'మారిన చంద్రబాబును చూస్తారు' అని పార్టీ ఎంపీలతో వ్యాఖ్యానించారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ ఎంపీలతో జరిగిన సమావేశంలో ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'నేను ఎక్కువగా అధికారుల మాట వింటానని.. బ్యూరోక్రాట్ల పాలన నడుస్తుంటుందని

మిగతా 12వ పేజీలో...

వైసీపీ ఐపీఎస్‌లకు భంగపాటు 12

బాబు దర్శనమే దొరకని పీఎస్ఆర్, సంజయ్.. గేటు దాటనీయని సిబ్బంది

తప్పుడు కేసులు పెట్టిన సంజయ్ కారును వెనక్కి పంపిన పోలీసులు

బాబును అరెస్టు చేసిన కొల్లి విలవిల

వెనక్కి వెళ్లాలనుకునే డిప్యుటేషన్ అధికారులకు చెక్

ఐ అండ్ పీఆర్ కమిషనర్‌పై నిఘా

సెలవుపై జవహర్!

అలా వెళ్లాలని ముందుగానే సంకేతాలు

ఏపీ సీఎస్ తీరుపై సీనియర్ల విస్మయం

40 మంది సలహాదారులకు ఉద్వాసన



కల్యాణ్‌బాబు.. హ్యాట్సాఫ్

గెలిచాక తొలిసారి చిరంజీవి ఇంటికి పవన్

అపూర్వ స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు

తల్లి, అన్నావదినలకు జనసేనాని పాదాభివందనం.. కేక్ కోసి సంబరాలు 12



భారీ స్టాక్ మార్కెట్ స్కామ్

ఎన్నికల ఫలితాల రోజు రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈ పతనం వెనక మోదీ, షా కుట్ర

సెబీ దర్యాప్తు జరుగుతున్న కంపెనీ న్యూస్ చానల్‌కే ఇంటర్వ్యూలు

అదానీ కుంభకోణం కంటే అతి పెద్దది

పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలి: రాహుల్

అన్నీ నిరాధార ఆరోపణలే: గోయెల్

మోదీ, అమిత్‌షా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని ఎందుకు సలహా ఇచ్చారు? వారి వ్యక్తిగత స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ సంహలివ్వడమేనా? 2 - రాహుల్ గాంధీ

బీఆర్ఎస్ కథ ముగిసింది

కాంగ్రెస్‌పై నమ్మకం లేదు

రాష్ట్రానికి అండగా ఉన్నందుకే బీజేపీకి పట్టం: కిషన్‌రెడ్డి 3

కోడ్ ముగిసింది

ప్రభుత్వ పాలనకు తొలగిన అడ్డంకి

త్వరలోనే భారీ ఎత్తున అధికారుల బదిలీలు

పాలనలో కాంగ్రెస్ ముద్రకు రేవంత్ కసరత్తు

సీఎం చెబితే కానీ ఫైళ్లు కదలని పరిస్థితి 13

ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ మార్పులు

ప్రజా సంబంధాల విభాగంలోనూ ప్రక్షాళన

వేగంగా సంక్షేమ పథకాల అమలుకు చర్యలు

ఆర్థిక శాఖ బాధ్యతలు వికాస్‌రాజ్‌కు?

చంద్రబాబుకు రేవంత్ ఫోన్.. అభినందనలు



సీఎంను కలిసిన గోసంరక్షణ సమితి సభ్యులు

రూ.వేల కోట్ల సర్కారీ భూములు హాంఫట్!

రంగారెడ్డి కలెక్టరేట్లో ధరణి ఆపరేటర్ల మాయాజాలం

గండిపేట, బాలాపూర్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ మండలాల్లో ప్రభుత్వ భూములకు పాసుబుక్‌లు జారీ

గత సర్కార్ నేతలు, రియల్టర్ల దన్ను

దొడ్డిదారిన 67 దరఖాస్తులకు ఓకే

5 ఎకరాల పాస్‌బుక్‌కు రూ.కోటి!

ధరణి ఆపరేటర్లతో పాటు మరొకరి అరెస్ట్.. పరారీలో ఐదుగురు

కలెక్టర్ల సంతకాల ఫోర్జరీ 13

వాట్సాప్ గ్రూపు నుంచి తొలగించారని.. 14

ఇద్దరు యువకుల హత్య

మాట్లాడేందుకు పిల్లాలి పిలిచి కత్తులతో పొడిచి చంపారు

రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఘోరం

నిందితుడు స్థానిక బీజేపీ నాయకుడు

డ్రగ్స్‌కు బానిసై మెడ, చెయ్యి కోసుకొని..

రోడ్డుపై రక్తాన్ని చిందిస్తూ హైదరాబాద్‌లో బాలుడి వికృతానందం

సోషల్ మీడియాలో వీడియో పోస్ట్

నెటిజన్ల షాక్.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వానికి సూచన 14

కంగనకు చెంపదెబ్బ

- చండీగఢ్ విమానాశ్రయంలో ఘటన
- ఎంపీపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్



న్యూఢిల్లీ, జూన్ 6: చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఒక మహిళా కానిస్టేబుల్ తనను కొట్టారని బాలీవుడ్ నటి, బీజేపీ తరఫున తాజా ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఎన్నికైన ఎంపీ కంగనా రనౌత్ ఆరోపించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఢిల్లీకి వెళ్లటం కోసం తాను చండీగఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, భద్రతాపరమైన తనిఖీల అనంతరం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ తనతో వాగ్వాదానికి దిగి చెంపదెబ్బ కొట్టారని కంగన తెలిపారు. ఈ మేరకు జరిగిన ఘటన గురించి ఆమె ఎక్స్‌లో వెల్లడించారు. ఎందుకు కొట్టావని అడిగితే తాను రైతుల పోరాటాన్ని సమర్థిస్తానని కుల్వీందర్ చెప్పారన్నారు. తాను బాగానే ఉన్నానని, అయితే, పంజాబ్‌లో పెరుగుతున్న హింసాకాండ, ఉగ్రవాదం ఆందోళన కలిగిస్తోందని కంగన పేర్కొన్నారు. కాగా, రైతుల ఉద్యమంపై కంగన చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహంతోనే కుల్వీందర్ ఆమెపై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కంగన ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కుల్వీందర్ కౌర్‌ను అధికారులు విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కుల్వీందర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐఎస్ఎఫ్‌ను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో 65.79% పోలింగ్

పోస్టల్ బ్యాలెట్ మినహా పోలింగ్ శాతం వెల్లడి

తుది గణాంకాలు త్వరలోనే విడుదల: ఈసీ



న్యూఢిల్లీ, జూన్ 6: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయింది. 18వ సార్వత్రిక ఎన్నికల్లో 64.2 కోట్ల మంది భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మినహా ఈవీఎంల్లో 65.79 శాతం మేర పోలింగ్ జరిగినట్లు గురువారం సీఈసీ రాజీవ్ కుమార్ వివరించారు. దేశ చరిత్రలోనే భారీ స్థాయిలో పోలింగ్ జరిగిందని, పోస్టల్ ఓట్ల గణాంకాలను కలుపుకుంటే పోలింగ్ శాతం ఇంకా పెరుగుతుందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 96.88 కోట్ల మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా, 64.2 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలో నమోదయిన పూర్తి సమాచారం అందిన తర్వాత తుది గణాంకాలను వెల్లడిస్తామన్నారు. కాగా, 2019 సాధారణ ఎన్నికల్లో 91.20 కోట్ల ఓటర్లకు గానూ 61.5 కోట్ల మంది ఓటు వేశారు.

లోకం తీరు



గట్టెక్కించిన పోస్టల్ బ్యాలెట్

- ఉద్యోగుల ఓట్లతో షిండే సేన, బీజేపీలకు దక్కిన సీట్లు

న్యూఢిల్లీ, జూన్ 6: పోస్టల్ బ్యాలెట్ రూపంలో శివసేన (షిండే), బీజేపీలకు అదృష్టం వరించింది. ఈవీఎంల్లో తగిన మెజార్టీ రాకున్నా పోస్టల్ బ్యాలెట్ ద్వారా లభించిన ఓట్లతో చివరి నిమిషంలో విజయం సాధించాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో మహారాష్ట్రలోని వాయువ్య ముంబయి నియోజకవర్గం నుంచి శివసేన (షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ గెలుపొందారు. ఒడిశాలోని జాజ్‌పూర్ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన రబీంద్ర నారాయణ బెహరా కూడా ఇదే రీతిలో విజయం సాధించారు. 2019 వరకు తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కింపును పూర్తి చేసిన తరువాతనే ఈవీఎంల ఓట్లు లెక్కించే వారు. ఈ విధానాన్ని మార్పు చేస్తూ 2019 మార్చి 18న ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్‌ను ఎప్పుడైనా లెక్కపెట్ట వచ్చని తెలిపింది. ఈ రెండు నియోజకవర్గాల్లో చివర్లో పోస్టల్ బ్యాలెట్లను కలపడంతో వాటి సాయంతో ఈ అభ్యర్థులు గట్టెక్కారు.

అగ్నిపథ్‌ను సమీక్షించాలి

- దేశవ్యాప్త కులగణన.. బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలి
- ఉమ్మడి పౌరస్మృతిపై భాగస్వాములతో చర్చించాలి: కేసీ త్యాగి
- అగ్నిపథ్ సమీక్షకు గొంతు కలిపిన చిరాగ్ పాసవాన్



న్యూఢిల్లీ, జూన్ 6: కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న బీజేపీకి అగ్నిపథ్ అంశం తలనొప్పిగా మారేలా ఉంది. సొంతంగా మెజార్టీ దక్కకపోవడంతో టీడీపీ, బిహార్‌లోని జేడీయూ మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ సిద్ధమైంది. ఇలాంటి కీలక తరుణంలో జేడీయూ తన తొలి డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఆ పార్టీ సీనియర్ నేత కేసీ త్యాగి అగ్నిపథ్ పథకాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తామని గురువారం ప్రకటించారు. అగ్నిపథ్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అది ఎన్నికల సమయంలో స్పష్టంగా కనిపించిందని త్యాగి చెప్పారు. అగ్నిపథ్‌ను తాము వ్యతిరేకించడం లేదు కానీ.. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే బీజేపీ చెబుతున్న 'వన్ నేషన్.. వన్ పోల్' విధానానికి తమ పార్టీ అనుకూలమేనని ఆయన చెప్పారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)పై మాత్రం భాగస్వాములందరినీ సంప్రదించి వారి అభిప్రాయాలను తీసుకుని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని, బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని త్యాగి కోరారు. అగ్నిపథ్‌ను సమీక్షించాలని లోక్ జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాసవాన్ కూడా కోరారు.

ఇండియా కూటమిలోనే ఉంటాం: ఉద్ధవ్ శివసేన

న్యూఢిల్లీ, జూన్ 6: ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన త్వరలో ఎన్డీయే కూటమిలో చేరేందుకు సిద్ధమవుతోందని వస్తున్న వదంతులపై ఆ పార్టీ ఖండించింది. తాము ఇండియా కూటమిలోనే కొనసాగనున్నామని స్పష్టం చేసింది. శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యురాలు, ఎంపీ ప్రియాంకా చతుర్వేదీ గురువారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. బీజేపీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రాబోతోందని ఫలితాలకు ముందు ఊదరగొట్టిన కొందరు విలేకరులు.. వారి అంచనాలు తలకిందులయ్యేసరికి ఇప్పుడు ఇలాంటి వదంతులు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. తాము ఇండియా కూటమిలోనే ఉండనున్నామని ఆమె స్పష్టం చేశారు.

అపోలో చైర్మన్ ప్రతాప్ రెడ్డి కారుకు ప్రమాదం


చెన్నై, జూన్ 6: (ఆంధ్రజ్యోతి): అపోలో గ్రూప్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం జరిగింది. సరుకుల లోడ్‌తో వెళుతున్న వ్యాన్ ప్రతాప్ రెడ్డి కారును ఢీకొట్టింది. అయితే, ఈ ప్రమాదానికి కారణమైన వ్యాను డ్రైవర్, క్లీనర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బుధవారం రాత్రి థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రి నుంచి ప్రతాప్ రెడ్డి కారులో ఇంటికి వెళ్తుండగా అన్నాసాలై ప్రాంతంలో వేగంగా వచ్చిన వ్యాన్.. కారును ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనపై ప్రతాప్ సి రెడ్డి భద్రతా విభాగం మేనేజర్ సంతోష్ నాయర్ థౌజండ్‌లైట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితులకు పరిహారం పేరుతో నిందితులకు శిక్ష తగ్గించకూడదు: సుప్రీం

న్యూఢిల్లీ, జూన్ 6: బాధితునికి పరిహారం ఇచ్చామన్న పేరుతో నిందితునికి శిక్ష తగ్గించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా చేస్తే న్యాయ పరిపాలనకు ఘోర విపత్తులో చిక్కుకున్నట్టేనని వ్యాఖ్యానించింది. నేరం కారణంగా నష్టపోయిన వారిని, గాయపడ్డవారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే పరిహారం ఇస్తుంటారని, అయితే దీన్ని కారణంగా చూపించి చట్టం ప్రకారం నిందితునికి విధించే శిక్షను తగ్గించకూడదని తెలిపింది. ఈ విధానాన్ని అమలు చేస్తే డబ్బున్న క్రిమినల్స్ నేరం నుంచి తప్పించుకుంటారని అభిప్రాయపడింది. న్యాయాన్ని కొనుక్కున్నట్టవుతుందని పేర్కొంది. అలాంటప్పుడు క్రిమినల్ న్యాయ విచారణ ప్రక్రియకే నష్టం కలుగుతుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గుజరాత్‌లో ఇద్దరు ముద్దాయిలకు ట్రయల్ కోర్టు అయిదేళ్ల శిక్ష విధించగా హైకోర్టు దాన్ని నాలుగేళ్లకు తగ్గించింది. బాధితునికి రూ.2.50 లక్షల వంతున చెల్లిస్తే ఆ శిక్షను కూడా అనుభవించాల్సిన పనిలేదని తెలిపింది. దీన్ని సవాలు చేస్తూ రాజేంద్ర భగవాన్‌జీ ఉమ్రానియా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం.. క్రిమినల్ కేసుల్లో కోర్టులకు తగిన సూచనలు చేసింది.

కొత్త టీంపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)



గెలుచుకోలేకపోవడం, ఎన్నికల్లో పోటీ చేయడానికే ఆమె ముందుకు రాకపోవటంతో ఈసారి ఆమెను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. అలాగే గత క్యాబినెట్‌లో మంత్రులుగా ఉన్న స్మృతీ ఇరానీ, రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, అజయ్‌మిశ్రా తేనీ, మహేంద్రనాథ్ పాండే, కౌశల్‌కిశోర్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, అర్జున్ ముండా, కైలాశ్ చౌదరి, ఆర్కే సింగ్, సంజీవ్ బల్యాన్ సహా 15 మంది ఎన్నికల్లో ఓడిపోవడంతో మోదీ పూర్తిగా కొత్త టీమ్‌ను ఎంచుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కీలకమైన ఆర్థిక, హోం, రక్షణ, విదేశాంగ, వాణిజ్య శాఖలు మినహా మిగతా మంత్రిత్వ శాఖలను మిత్రపక్షాలకు కేటాయించేందుకు మోదీ సుముఖంగా ఉన్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ ముఖ్య నేతలు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో గురువారం సమావేశమై మంత్రివర్గ కూర్పుపై చర్చించారు. ఈ సమావేశంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీఎల్ సంతోష్, సురేశ్ సోని, దత్తాత్రేయ హొసబలే, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్న పలువురు ఎంపీలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.

50కిపైగా మంత్రులు

మోదీ మంత్రివర్గంలో 50కిపైగా మంత్రులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. 24-26 మంది క్యాబినెట్ మంత్రులు, దాదాపు 30మంది సహాయ మంత్రులు ఉండవచ్చని సమాచారం. బీజేపీ నుంచి 10-15 మందికి క్యాబినెట్‌లో అవకాశం కల్పించవచ్చని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. క్యాబినెట్ కూర్పుపై తెలుగుదేశం, బీజేపీ మధ్య ఇప్పటికే చర్చలు జరిగాయని విశ్వసనీయ సమాచారం. శుక్రవారం జరిగే ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరుకావటం కోసం చంద్రబాబునాయుడు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. కేంద్రస్థాయి నేతలతో ఆయన గురువారం రాత్రి కూడా మంతనాలు కొనసాగించినట్లు తెలిసింది. ఎన్డీఏ ఇతర భాగస్వామ్యపక్షాల్లో జేడీయూకి రెండు, ఎల్‌జేపీ, ఆర్ఎల్డీ, శివసేన, ఎన్సీపీ (అజిత్‌పవార్)లకు ఒక్కొక్కటి చొప్పున మంత్రిపదవులు కేటాయించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

బీజేపీ నుంచి ఎవరెవరికి..

కేంద్ర మంత్రివర్గంలో బీజేపీ నుంచి అమిత్ షా, పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీ, జయశంకర్, శివరాజ్‌సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఓం బిర్లా, గజేంద్ర సింగ్ షెఖావత్, సంబిత్‌పాత్ర, జయ పాండా, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులు ఉండే అవకాశాలున్నాయి. మహిళా మంత్రుల్లో అపరాజితా సారంగి, బాన్సురి స్వరాజ్, దగ్గుబాటి పురందేశ్వరి, డీకే అరుణ పేర్లు పరిగణనలో ఉన్నాయి. తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డితోపాటు బీసీ నేతల్లో ఈటల రాజేందర్ లేదా బండి సంజయ్ పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఎన్డీఏ ఎంపీల సమావేశం తర్వాత మంత్రివర్గంలోని పేర్ల జాబితాపై కసరత్తు ఒక కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి.

రాష్ట్రపతికి ఎంపీల జాబితా

18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన ఎంపీల పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎన్నికల సంఘం (ఈసీ) అందించింది. గురువారం రాష్ట్రపతిని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు కలిశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 73 ప్రకారం ఈసీ జారీ చేసిన నోటిఫికేషన్ కాపీని, లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల పేర్లతో కూడిన జాబితాను అందజేశారు.

మోదీజీ.. ఇప్పుడైనా ఏపీకి 'హోదా' ఇస్తారా?: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జూన్ 6: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల క్రితం హామీ ఇచ్చారని, ఇప్పుడైనా ఆ హామీని నెరవేరుస్తారా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బిహార్‌కు సంబంధించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. మోదీని ఉద్దేశిస్తూ నాలుగు ప్రశ్నలు సంధించారు. ఆ వీడియోను గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. '2014 ఏప్రిల్ 30న ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో మోదీ హామీ ఇచ్చారు. పదేళ్లయినా ఆ హామీ నెరవేర్చలేదు. ఇప్పుడైనా ఏపీకి ప్రధాని మోదీ ప్రత్యేక హోదా ఇస్తారా' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయి. ప్రైవేటీకరణ చేయడం ఆపేస్తారా మోదీజీ?' అని ప్రశ్నించారు. 2014లోనే బిహార్‌కు కూడా ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని, ఇప్పటికీ దానిపై నోరు మెదపడం లేదన్నారు. బిహార్‌లో మాదిరిగా దేశమంతా కులగణన చేయిస్తామని హామీ ఇస్తారా? అని మోదీని ప్రశ్నించారు. 'మోదీ 3.0' ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రధాని పదే పదే చెబుతున్నారని, వాస్తవంగా ఈసారి ఏర్పడేది 'మోదీ 1/3 ప్రభుత్వం' అని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

యూపీ ప్రజలకు ప్రియాంక ధన్యవాదాలు

ఇండియా కూటమికి అద్భుతమైన ఫలితాలను అందించిన యూపీ ప్రజలకు కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ధన్యవాదాలు తెలిపారు. యూపీ వాసులు దేశ ప్రజలకు దృఢమైన సందేశం ఇచ్చారని, రాజ్యాంగ రక్షణకు వారు చూపిన తెగువ అద్భుతమైనదని గురువారం ఎక్స్ వేదికగా కొనియాడారు. ప్రజాస్వామ్యంలో దేశ సమస్యలు తప్ప ఇంకేవీ ప్రధానమైనవి కాదనే విషయాన్ని వారు చాటి చెప్పారని అభినందించారు. అలాగే కూటమి అద్భుత ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన సమాజ్‌వాదీ, కాంగ్రెస్ కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ అధ్యక్షుడిగా శివరాజ్ చౌహాన్?

నడ్డా స్థానంలో మధ్యప్రదేశ్ మాజీ సీఎంకు పదవి.. ఢిల్లీకి రావాలంటూ పిలుపు

- 6సార్లు ఎంపీగా ఎన్నిక..16ఏళ్లు సీఎం
- పార్టీలో సీనియర్, అనుభవం నేపథ్యంలోనే ఎంపిక!
- శివరాజ్‌ను నాతో తీసుకెళ్తా.. ప్రచారంలో మోదీ వ్యాఖ్య
- ఒడిశా సీఎంగా ధర్మేంద్ర ప్రధాన్!?
- రేసులో సంబిత్ పాత్ర, జ్యుయల్ ఓరమ్ కూడా



న్యూఢిల్లీ, జూన్ 6: రాజకీయ జీవితం దాదాపు ముగిసిందనుకున్న దశలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (65)కు అత్యంత కీలక బాధ్యత దక్కనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానంలో చౌహాన్‌ను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు తక్షణమే ఢిల్లీకి రావాలంటూ ఆయనకు కబురుపెట్టారు. అభిమానులు ముద్దుగా మామ అని పిలుచుకునే శివరాజ్ రికార్డు స్థాయిలో పదహారున్నరేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అత్యధిక కాలం సీఎంగా ఉన్న బీజేపీ సీఎం కూడా ఈయనే. గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శివరాజ్ సారథ్యంలోనే పార్టీ అద్వితీయ విజయం సాధించినప్పటికీ.. సీఎం బాధ్యతలు ఇవ్వలేదు. ఆయన కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన మోహన్‌యాదవ్‌ను సీఎం చేసింది అధిష్ఠానం. ఎమ్మెల్యేగానే మిగిలిపోయిన శివరాజ్.. ఓ దశలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "చావనైనా చస్తాను కానీ.. ఢిల్లీకి వెళ్లి పదవి ఇమ్మని కోరను. కొన్నిసార్లు మనం వీరతిలకం కోరుకుంటే.. వనవాసం దక్కుతుంది" అంటూ తన నిరసనను వెలిబుచ్చారు. తాజా లోక్‌సభ ఎన్నికల సందర్భంగానూ మొదట శివరాజ్‌ను ఎంపీగా పోటీకి నిలపాలని భావించలేదు. మార్చి2న విడుదల చేసిన చివరి జాబితాలో విదిశ టికెట్ ఇచ్చారు. 8.20 లక్షలపైగా భారీ మెజార్టీతో గెలుపొందారు.

ఇంతకుమించి సీనియర్లు లేనందునే!

ఎన్నికల ప్రచారం సందర్భంగానే చౌహాన్‌ను ఢిల్లీకి తీసుకెళ్తానని ప్రధాని మోదీ ప్రకటించారు. ఆయన అనుభవాన్ని వివరిస్తూ.. దానిని పార్టీ కోసం వినియోగించుకుటామన్న సంకేతం ఇచ్చారు. ఆరుసార్లు ఎంపీ, ఐదుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన శివరాజ్.. బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ఉపాధ్యక్షుడిగా, కేంద్ర ఎన్నికల కమిటీ, పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. ప్రస్తుతం బీజేపీలో ఈ స్థాయి అనుభవం ఉన్న నాయకుడు ఎవరూ లేరు. దీంతోనే ఆయనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నారనే ఊహాగానాలు వస్తున్నాయి. ప్రధాని మోదీ కంటే దాదాపు 15 ఏళ్ల ముందే ఎంపీ అయిన చౌహాన్‌కు కేంద్ర మంత్రి పదవి చాలా చిన్నదనే వాదన కూడా వినిపిస్తోంది. జాతీయ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టేందుకే ఆయనను ఢిల్లీకి పిలిచారని చెబుతున్నారు.

ఒడిశా సీఎం ఎవరో?

ఒడిశా సీఎంగా కేంద్ర ఉక్కు శాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (55) పేరు బలంగా వినిపిస్తోంది. వాజ్‌పేయీ హయాంలో 2004-09 మధ్య కేంద్ర మంత్రిగా పనిచేసిన దేవేంద్ర ప్రధాన్ కుమారుడు ఈయన. ఏబీవీపీలో చిన్న వయసు నుంచే పనిచేశారు. 2004లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్, బిహార్ నుంచి రెండుసార్లు రాజ్యసభకు వెళ్లారు. 2017లో మొదటిసారి కేంద్ర మంత్రి అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పెట్రోలియం శాఖలను చూశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒడిశా ఎన్నికల మ్యానిఫెస్టో రూపకల్పనలో ప్రధాన్ పాత్రను కొనియాడారు. ధర్మేంద్రకు కీలక బాధ్యత ఇస్తామంటూ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రకటించారు. మోదీ, అమిత్ షాకు ప్రధాన్ చాలా సన్నిహితులు. నవీన్ పట్నాయక్ ప్రభుత్వంలో మాజీ ఐఏఎస్ పాండ్యన్ పెత్తనం, పూరీ జగన్నాథ్ ఆలయం రత్న భాండాగారం తాళాలు మాయమయ్యాయనే కీలక అంశాలను లేవనెత్తి.. బీజేడీ ఓటమిలో ప్రధాన పాత్ర పోషించారు. కాగా, ఒడిశా సీఎం రేసులో సీనియర్ నేతలు సంబిత్ పాత్ర, జ్యుయల్ ఓరమ్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

46% మంది నేరచరితులే

- కొత్త లోక్‌సభ ఎంపీలలో 251 మందిపై క్రిమినల్ కేసులు
- హత్య, హత్యాయత్నం, రేప్, కిడ్నాప్, విద్వేష ప్రసంగం అభియోగాలు
- దోషులుగా తేలిన 27 మంది
- వెల్లడించిన ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తగా కొలువు దీరనున్న 18వ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది ఎంపీలలో 251 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. మొత్తం లోక్‌సభ ఎంపీలలో వీరు 46 శాతంగా ఉన్నారు. గత లోక్‌సభలో క్రిమినల్ కేసులున్న ఎంపీల సంఖ్య 233 కాగా ఈసారి మరింత పెరిగింది. 2004లో 125 మంది, 2009లో 162 మంది, 2014లో 185 మంది క్రిమినల్ కేసులున్న వారు లోక్‌సభకు ఎన్నికయ్యారు. అత్యున్నత చట్టసభకు ఎన్నికవుతున్న క్రిమినల్ నేతల సంఖ్య పెరుగుతోందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2009తో పోలిస్తే ఈసారి వీరి సంఖ్య 55 శాతం పెరగడం గమనార్హం. అలాగే నూతన ఎంపీలలో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. ఈ వివరాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ గురువారం వెల్లడించింది. తాజా ఎన్నికల్లో గెలిచిన ఎంపీల అఫిడవిట్లను ఏడీఆర్ విశ్లేషించింది. దీని ప్రకారం, 27 మంది ఎంపీలు వివిధ కేసుల్లో దోషులుగా తేలారు. నలుగురు ఎంపీలపై హత్య, 27 మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 15 మంది ఎంపీలు మహిళలపై దాడులకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరిపై అత్యాచారం కేసులున్నాయి. నలుగురిపై కిడ్నాపింగ్, 43 మందిపై విద్వేష ప్రసంగాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఈసారి ఎన్నికల్లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థికి లభించిన విజయావకాశాలు 15.3 శాతం కాగా, క్లీన్ ఇమేజీ అభ్యర్థికి 4.4 శాతమే అవకాశాలు దక్కినట్లు వెల్లడైంది. పార్టీల వారీగా చూస్తే, బీజేపీ-94, కాంగ్రెస్-49, ఎస్పీ-21, తృణమూల్ కాంగ్రెస్-13, డీఎంకే-13, టీడీపీ-8 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయి. తీవ్రమైన క్రిమినల్ కేసుల విషయానికి వస్తే బీజేపీ-60, కాంగ్రెస్-32, ఎస్పీ-17, తృణమూల్-7, డీఎంకే-6, టీడీపీ-5, శివసేన-4 మందిపై అభియోగాలు నమోదయ్యాయి.

సంపన్నుల సభ

504 మంది కోటీశ్వరులు ఈసారి ఎంపీలుగా ఎన్నికయ్యారు. మొత్తం లోక్‌సభలో వీరు 93 శాతం. లోక్‌సభ ఎన్నికలలో ఎంపీలుగా గెలిచే సంపన్నుల సంఖ్య ప్రతిసారీ పెరుగుతోంది. 2009లో 315 మంది, 2014లో 443 మంది, 2019 ఎన్నికలలో 475 మంది కోటీశ్వరులు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈసారి ఈ సంఖ్య మరింత పెరిగింది. వీరిలో బీజేపీ-227, కాంగ్రెస్-92, డీఎంకే-21, తృణమూల్-27, ఎస్పీ-34, జేడీయూ-12, టీడీపీ-16 మంది ఎంపీలున్నారు. కాగా, సంపన్న అభ్యర్థులకు ఇటీవలి ఎన్నికలలో విజయావకాశాలు 19.6% కాగా, రూ.కోటి కన్నా తక్కువ ఆస్తులు ఉన్న అభ్యర్థులకు కేవలం 0.7% మాత్రమే ఉండటం గమనార్హం. రూ.10 కోట్లకు పైగా ఆస్తులున్న ఎంపీలు 227 మంది (42%) ఉన్నారు. ఎంపీల సగటు ఆస్తుల విలువ రూ.46.34 కోట్లుగా ఉంది. గుంటూరు నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ) రూ.5,705 కోట్ల ఆస్తులతో ప్రథమ స్థానంలో, చేవెళ్ల నుంచి గెలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) రూ.4,568 కోట్లతో రెండో స్థానంలో, హరియాణాలోని కురుక్షేత్ర నుంచి గెలిచిన నవీన్ జిందాల్ (బీజేపీ) రూ.1,241 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. విద్యార్హతల విషయానికొస్తే.. ఎంపీలలో 420 మంది డిగ్రీ, ఆపై విద్యాభ్యాసం చేసిన వారున్నారు. 105 మంది ఎంపీలు ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.ఒక ఎంపీకి కేవలం చదవడం, రాయడం మాత్రమే వచ్చు. వయస్సుల వారీగా చూస్తే, ఎంపీలలో 58 మంది 25-40 ఏళ్ల, 280 మంది 41-60 ఏళ్ల, 204 మంది 61-80 ఏళ్ల మధ్య వయస్సు వాళ్లున్నారు. 82 ఏళ్ల అత్యధిక వయస్సు ఉన్న ఎంపీ ఒకరున్నారు. మొత్తంగా ఎంపీల సగటు వయస్సు 56 ఏళ్లు. గత లోక్‌సభలో ఇది 59 ఏళ్లు కాగా ఈసారి మూడేళ్లు తగ్గింది.

తగ్గిన మహిళా ప్రాతినిధ్యం

మొత్తం ఎంపీలలో 74 మంది మహిళలున్నారు. గత లోక్‌సభలో మహిళా ఎంపీలు 77 మంది కాగా ఈసారి వారి సంఖ్య తగ్గింది. మరోవైపు, గత లోక్‌సభలో ఎంపీలుగా ఉన్న వారిలో 214 మంది తిరిగి ఎన్నికయ్యారు. 280 మంది తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. గత లోక్‌సభలో 36 పార్టీల నుంచి ప్రాతినిధ్యం ఉండగా, ఈసారి 41 పార్టీలకు ప్రాతినిధ్యం లభించింది.

భారీ స్టాక్ మార్కెట్ స్కామ్

ఫలితాల రోజు 30 లక్షల కోట్ల సంపద ఆవిరి.. ఈ పతనం వెనక మోదీ, షా కుట్ర

- 5 కోట్ల మదుపరులకు భారీ నష్టం
- పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలి: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, వారి కోసం పనిచేసే ఎగ్జిట్‌పోల్స్ సంస్థలు కలిసి దేశంలోనే భారీ స్టాక్ మార్కెట్ కుంభకోణానికి పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజున స్టాక్‌మార్కెట్ పతనమవ్వడంతో 5 కోట్ల మంది మదుపరులు భారీగా నష్టపోయారని, రూ.30 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైందని చెప్పారు. ఈ కుట్రపై మోదీ, అమిత్‌షా, ఎగ్జిట్‌పోల్ సంస్థలు, విదేశీ ఇన్వెస్టర్లపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాథేతో కలిసి మాట్లాడారు. ఒక క్రమపద్ధతిలో ఈ కుంభకోణం జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. సెక్యూరిటీ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) దర్యాప్తు జరుగుతున్న ఓ కంపెనీ(అదానీని ఉద్దేశించి)కి చెందిన న్యూస్‌చానల్‌కు మోదీ, అమిత్‌షా ఇంటర్వ్యూలిస్తూ.. జూన్ 4లోపు షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలని, ఆ తర్వాత షేర్ల రేట్లను అందుకోలేరన్నట్లుగా మదుపరులకు సలహాలిచ్చారన్నారు. "మే 13న అమిత్ ఆ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జూన్ 4లోపు షేర్లు కొనాలన్నారు. అదే నెల 19న మోదీ ఇంటర్వ్యూ ఇస్తూ అదే మాట చెప్పారు. జూన్ 4న స్టాక్ మార్కెట్ రికార్డులు బద్దలవుతాయన్నారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. జూన్ 3న స్టాక్ మార్కెట్ సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. ఎన్నికల ఫలితాల రోజు(జూన్ 4న) స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది" అని రాహుల్ గుర్తుచేశారు. స్టాక్ మార్కెట్ల గురించి గతంలో ఏ ప్రధాని కూడా మాట్లాడలేదని, మోదీ, షా మదుపరులకు ఎందుకు పిలుపునిచ్చారని నిలదీశారు. స్టాక్స్‌పై సలహాలివ్వడమే వారి పనా? అని ప్రశ్నించారు. వారిద్దరూ ఇంటర్వ్యూ ఇచ్చిన న్యూస్ చానల్‌కు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. స్టాక్ మార్కెట్ పతనానికి, అదానీ కుంభకోణానికి ముడిపడి ఉందా? అని విలేకరులు ప్రశ్నించగా.. "స్టాక్ మార్కెట్ కుంభకోణం అదానీ స్కామ్ కంటే చాలా పెద్దది" అని రాహుల్ సమాధానమిచ్చారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్

ఆరోపణలను కొట్టిపారేసిన బీజేపీ

రాహుల్‌గాంధీ ఆరోపణలపై బీజేపీ నేత పీయూష్‌గోయల్ తీవ్రంగా స్పందించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీవి నిరాధారమైన ఆరోపణలు అని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని జీర్ణించుకోలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశలో అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఆరోపణలు అని ఆయన పేర్కొన్నారు.

రేపు సీడబ్ల్యూసీ సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 6: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) శనివారం సమావేశం కానుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత జరిగే ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చిస్తారని సమాచారం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 స్థానాలు సాధించి రెండో అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థానాన్ని దక్కించుకోనుంది. ఈ హోదా దక్కాలంటే లోక్‌సభలోని మొత్తం సీట్లలో కనీసం 10% సాధించాలి. కానీ 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అన్ని సీట్లు రాలేదు.

హరీశ్‌పై రేవంత్ ఆరోపణలు నిరాధారం

» డమ్మీ అభ్యర్థులను నిలబెట్టింది కాంగ్రెస్సే

» బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు బీజేపీకి ఓట్లు బదిలీ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమని బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో బీజేపీకి ఆధిక్యత వచ్చిందంటే రేవంతే అక్కడ బీజేపీకి ఓట్లు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో 30 వేలకుపైగా మెజారిటీ తెచ్చుకున్న సీఎం ఈ ఎన్నికల్లో 22 వేలకు పడిపోయారన్నారు. గత మెజార్టీ వచ్చి ఉంటే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచే వారని, బీజేపీకి ఆయనే ఓట్లు బదిలీ చేసి అక్కడ డీకే అరుణను గెలిపించారని వారు ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల కోసం కాంగ్రెస్ పలు పార్లమెంటు స్థానాల్లో తమ పార్టీ ద్వారా డమ్మీ అభ్యర్థులను నిలిపారన్నారు. వాస్తవానికి ఓట్లు బదిలీ చేసింది సీఎం, మంత్రులు, విప్‌లేనని ఇప్పుడు బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. కాగా, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచిన నవీన్ కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ నేతలు అభినందించారు. గురువారం తెలంగాణ భవన్‌లో పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఆయన్ను సత్కరించారు.

గ్రూప్-1లో వికలాంగుల రిజర్వేషన్ వివరాలు ఇవ్వండి

గ్రూప్-1 నియామకాల్లో వికలాంగుల కేటగిరీ రిజర్వేషన్ వివరాలు ఇవ్వాలని హైకోర్టు టీఎస్‌పీఎస్సీకి సూచించింది. వికలాంగుల కేటగిరీలో సమాంతర రిజర్వేషన్ అమలు చేయడం లేదని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని నోటిఫికేషన్‌లలో సమాంతర రిజర్వేషన్ అమలు అమలు చేస్తున్నామని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఆ రిజర్వేషన్ల వివరాలు అందజేస్తామని తెలిపింది. తదుపరి విచారణ 10వతేదీకి వాయిదా పడింది.

ఖర్గేతో ఎంపీ మల్లు రవి భేటీ

న్యూఢిల్లీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ ఎంపీగా ఎన్నికైన మల్లు రవి గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ టికెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేసి, ఆయన ఆశీస్సులు కోరారు. అనంతరం మల్లు రవి కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లి.. ఆయనను కలిశారు.

బీఆర్ఎస్ కథ ముగిసింది

» కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది

» రాష్ట్రానికి అండగా ఉన్నందుకే బీజేపీకి పట్టం

» ఆంధ్రప్రదేశ్ తీర్పు హర్షణీయం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్/శంషాబాద్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ కథ ముగిసిందని, కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కిషన్ రెడ్డి తెలిపారు. అందుకే ప్రజలు ప్రత్యామ్నాయంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని అన్నారు. గురువారం ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నో అరాచకాలకు పాల్పడిందని, ఫలితంగా ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 14 చోట్ల మూడో స్థానానికి పరిమితమైందని, ఎనిమిది చోట్ల డిపాజిట్లు కోల్పోయిందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత, పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సొంత జిల్లా మెదక్‌లోనూ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలిచారని చెప్పారు. గజ్వేల్, సిద్దిపేట, మెదక్‌లో బీఆర్ఎస్ రూ.వందల కోట్లు పంచిపెట్టినా ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని అన్నారు. పదేళ్లలో రూ.పది లక్షల కోట్లతో తెలంగాణలో అభివృద్ధి చేశామని.. అందువల్లే ప్రజలు ఎనిమిది సీట్లలో బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. మరో ఆరు చోట్ల రెండో స్థానంలో నిలిచామని, బలమైన ప్రత్యామ్నాయంగా మారామని చెప్పారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని, అందుకే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు తగ్గాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తో పాటు ఆయన ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. పసుపు బోర్డు విషయంలో ఎన్నో విమర్శలు చేసినా.. ప్రజలు అర్వింద్‌ను గెలిపించారని చెప్పారు. ఏపీలో ప్రజల తీర్పు హర్షణీయమని అన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కిషన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



చిన జీయర్‌స్వామి నుంచి తీర్థాన్ని స్వీకరిస్తున్న ఈటల రాజేందర్

గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి 14 శాతం ఓట్లు వస్తే, లోక్‌సభ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% వాటా ఇవ్వాలి: లక్ష్మణ్

తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పించాలని, ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఓట్లూ మాకే పడ్డాయి: కొండా

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పాటు పలు చోట్ల కాంగ్రెస్ ఓట్లు కూడా తమకు పడ్డాయని చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడారు. ఒకవేళ బీఆర్ఎస్ ఓట్లు మాత్రమే తమకు పడి ఉంటే, తాండూరు, వికారాబాద్ వంటి ప్రాంతాల్లో తమకు మెజారిటీ వచ్చేది కాదన్నారు. రాష్ట్రంలో కల్తీ విత్తనాలతో రైతులు సతమతమవుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. విద్యుత్తు కోతలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణం రైతుల సమస్యలపై సమీక్షించాలని కోరారు.

చినజీయర్ ఆశీస్సులు తీసుకున్న ఈటల

మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్ ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఈటల పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి.. ఈటలకు శాలువా కప్పి మంగళ శాసనములు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మృత్యు పిడుగులు

» వేర్వేరు చోట్ల పిడుగులు పడి 8 మంది దుర్మరణం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వర్షం పడుతుంటే శివార్లో ఉండటమే వారికి ప్రాణాంతకమైంది. వర్షానికి తడవకుండా ఉండేందుకు చెట్టుకిందకు వెళితే ఒకరు.. తడుస్తూనే పొలంలోనే విత్తనాలు విత్తుతూ మరొకరు.. పశువులను కాస్తూ మరొకరు ఇలా ఒకేరోజు పిడుగుపాట్లకు రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. రెండు మూగ జీవాలూ మృత్యువాతపడ్డాయి. గురువారం రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో పలుచోట్ల వర్షాలు పడ్డాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఈదురు గాలులకు ఇళ్లపైకప్పులు ఎగిరిపోయాయి. పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. హైదరాబాద్‌లో సాయంత్రం 3గంటల తర్వాత పలుచోట్ల వర్షం పడింది. రోడ్లపై వరద చేరడం, ఫలితంగా ట్రాఫిక్‌జాంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో 7సెం.మీ, ఇదే జిల్లా పెద్దకొత్తపల్లిలో 6.9 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 5సెం.మీ, మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో 4.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన మోడపెల్లి ప్రవీణ్(25) పొలం నుంచి ఫోన్లో మాటుతూ ఇంటికి వెళుతుండగా పిడుగుపడి మృతిచెందాడు. ఇదే జిల్లాలోని తానూర్ మండలం ఎల్వత్ గ్రామానికి చెందిన మాగిర్వాడ్ శ్రీ (12) శివార్లో మేకలు కాస్తుండగా, నిజామాబాద్ జిల్లాలోని రెంజల్ మండలం దండిగుట్టకు చెందిన బానోత్ పీర్యా నాయక్(65) గేదెలు కాస్తుండగా పిడుగు పడటంతో మృతిచెందారు. మెదక్ జిల్లాలో పిడుగుపడి ముగ్గురు మృతిచెందారు. హవేళీఘణ్‌పూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన శెట్టబోయిన సిద్దయ్య (48), ఓరగంటి నందు (23) పూరిగుడెసె నిర్మాణానికి పొరక తీసుకొచ్చేందుకు అడవికి వెళ్లగా పిడుగు పడటంతో మృతిచెందారు. ఇదే జిల్లా కౌడిపల్లి మండలం పీర్ల తండాకు చెందిన ధలావత్ గేమ్యా నాయక్ (53) గొర్లు, ఎడ్లను మేపుతుండగా పిడుగు పడి చనిపోయాడు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పిచేర్యాగడికి చెందిన గోపాల్ (38) పొలం వద్ద ఉండగా పిడుగు పడి మృతిచెందాడు. నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్‌కు శివార్లోని పొలంలో పత్తిగింజలు నాటుతుండగా పిడుగు పడటంతో కొమ్మరెక్క జంగమ్మ (45) మృతిచెందగా, ఆమె భర్త కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ శివార్లో పిడుగు పడటంతో ఓ ఎద్దు మృతిచెందింది. మరో ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తూర్పుచౌలపల్లిలో పిడుగుపడటంతో ఓ పాడి ఆవు మృతిచెందింది. కాగా నల్లగొండ జిల్లా పానగల్ సమీపంలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలోకి వరదనీరు వచ్చిచేరింది. కాగా కొన్నాళ్లగా కురుస్తున్న వర్షాలతో మూసీకి జలకళ వచ్చింది. నల్లగొండలోని మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు కాగా ఇప్పటికే 635 అడుగులకు చేరుకుంది.



నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలోకి చేరిన నీరు

మా జాడ కోసం పోలీసులే
ఏసును అడవికి పంపారు

» అతని మరణానికి వారిదే బాధ్యత

» లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

వాజేడు, జూన్ 6: తమ జాడ కనుగొనేందుకు ఇల్లెందుల ఏసు అనే వ్యక్తిని పోలీసులే అడవిలోకి పంపగా మందుపాతర తొక్కి అతడు మరణించాడని మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఏసు మరణానికి పోలీసులే బాధ్యులని, బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొంటూ మావోయిస్టు పార్టీ గురువారం ఓ లేఖ విడుదల చేసింది. ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లెందుల ఏసు(55) కట్టెల కోసం ఇటీవల కొంగాల అడవుల్లోకి వెళ్లి మందుపాతరకు బలయ్యాడు. మందుపాతర పేలడంతో ఏసు వెంట ఉన్న అతని కుమారుడు గాయపడ్డాడు. ఈ ఘటనపై వాజేడు, వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత గురువారం లేఖ విడుదల చేశారు. బూబీట్రాప్ తొక్కడంతో ఏసు ప్రాణాలు కోల్పోయాడని, అతని మృతికి తాము చింతిస్తున్నామని పేర్కొన్నారు. కగార్ పేరుతో మావోయిస్టు పార్టీపై దాడులు జరుగుతున్నాయని, కొందరికి డబ్బు ఆశచూపి వేటగాళ్ల మాదిరిగా అడవిలోకి పంపి తమ సమాచారం తెలుసుకుని తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో ఆత్మరక్షణ కోసం ఎత్తైన కొండల్లో అనేక ట్రాప్‌లు ఏర్పాటు చేశామని, ఈ విషయాన్ని పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తెలియజేశామని పేర్కొన్నారు. ఏసు మృతికి బాధ్యత వహించకపోగా మావోయిస్టులపై నింద వేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల అనుసరిస్తున్న ఈ విధానాన్ని ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

పల్లెల్లో రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

» అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో పలు అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులు వినియోగించి గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాలని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు మరింత పాడయ్యే అవకాశం ఉన్నందున దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని సూచించారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన, కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఇప్పటికే పాడైన రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై అంచనాలు తయారు చేయాలని చెప్పారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు.

బీజేపీ దగ్గర కేసీఆర్ సుపారీ: యెన్నం

బీజేపీ దగ్గర సుపారీ తీసుకున్న కేసీఆర్ తన కుటుంబం కోసం లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలను మోసం చేశారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అందుకే మహహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. గురువారం గాంధీభవన్‌లో శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎంకు సొంత జిల్లా అంటూ ఉండదని, రాష్ట్రం అంతా సీఎందే అని పేర్కొన్నారు. కేసీఆర్ మద్దతుతో బీజేపీకి ఓటింగ్ పెరిగిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ బీఆర్ఎస్ ఓట్లను బీజేపీకి బదిలీ చేయడం వల్లనే ఆ పార్టీ 8 సీట్లలో గెలిచిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. డిసెంబరు 9న తెలంగాణ తల్లి జన్మదినం జరుపుకుంటే తప్పేంటని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్నించారు. సోనియా నిర్ణయం పట్టుదల వల్లనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని తెలిపారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను నిరంజన్ ఖండించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


దిశ మార్చిన యూపీ

దేశాన్ని ఏలాలనుకొనే పార్టీ లక్నోమీదుగా ఢిల్లీ చేరాలని రాజకీయాల్లో అంటూంటారు. 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర్‌ప్రదేశ్‌ను గెలవనిపక్షంలో కేంద్రంలో అధికారం దక్కదని దీని అర్థం. ఈ ఎన్నికల్లో భారతీయజనతాపార్టీ యూపీలో చతికిలబడిన కారణంగానే లోక్‌సభలో ఇప్పుడు తనకాళ్ళమీద తాను నిలబడలేనిస్థితికి వచ్చింది. సొంతబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశాన్ని బీజేపీకి దక్కకుండా చేయడంలో యూపీ కీలకపాత్ర పోషించింది. ఎన్డీయే కూటమిని తీన్‌సౌ పార్ వరకూ కూడా పాకనివ్వకుండా మోకాలడ్డింది. ఈ రాష్ట్రం నుంచి ఇండియా కూటమి 43స్థానాలు సాధిస్తే, 37సీట్లు సమాజ్‌వాదీపార్టీవి, ఆరు కాంగ్రెస్‌వి. ఎన్డీయేకు దక్కిన ముప్పై ఆరులో ముప్పై మూడు బీజేపీవి. హిందూత్వ కంచుకోటకు పడిన ఈ చిల్లు యోగి రాజకీయ భవిష్యత్తును ప్రమాదంలో పడవేసింది, మోదీకి మూడోసారి రాజ్యాధికారం దక్కినా, బాబు, నితీశ్‌ల భరోసాలేనిదే అడుగుముందుకు వేయలేని స్థితిని కల్పించింది.

పదేళ్ళక్రితం డెబ్బయ్‌ఒక్కస్థానాలు, ఐదేళ్ళక్రితం 62స్థానాలు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు 33సీట్లకు పరిమితం కావడం బలమైన ఎదురుగాలికి నిదర్శనం. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సహా అనేకమంది బీజేపీ మహారథులు ఓడిపోయారు, వారణాసినుంచి నరేంద్రమోదీ విజయం సైతం పలుచబడింది. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం, మోదీ స్వయంగా ప్రాణప్రతిష్ఠ చేయడం, ఆ ప్రత్యక్షప్రసారాలూ సూర్యతిలకాలూ దేశప్రజల మనసులను తమవైపు మళ్ళిస్తాయని బీజేపీ గట్టిగా నమ్మింది. ప్రతీ ఇంటికీ అక్షింతలు చేరాయి, ప్రతీపల్లెనూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆ చిత్రాలు తాకాయి. దేశవ్యాప్త ప్రభావం ఉన్నదా లేదా అన్నది అటుంచితే, అయోధ్య కొలువుదీరి ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోవడం అనూహ్యం. ఎన్నికలముందువరకూ బీజేపీ నాయకులు ఎంతోవిశ్వాసంగా కనిపించినప్పటికీ, వివిధ దశల్లో పోలింగ్ నిస్తేజంగా సాగడం, తదనుగుణంగా ప్రధాని మాట మారడం తెలిసినవే. రెండేళ్ళనాటి అసెంబ్లీ ఎన్నికల్లోనే అఖిలేశ్ యాదవ్ పునరుత్థానం ఆరంభమైంది. చిన్నచితకా ఓబీసీపార్టీలనూ, దళిత ఆదివాసీలను తనవైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేశాడు. గత ఏడాది ఒక ఉప ఎన్నిక సందర్భంలో ఆయన ప్రయోగించిన పీడీఏ (పిఛ్డా–దళిత్–అల్పసంఖ్యాక్) అస్త్రం క్రమంగా బలపడి, అబ్‌కీబార్ పీడీఏ సర్కార్ నినాదం ఇప్పుడు విశేషంగా ప్రభావం చూపిందని ఫలితాలు చెబుతున్నాయి. నినాదంతో సరిపెట్టకుండా టిక్కెట్ల పంపకంలోనూ ఆయన ఆ నీతినీ, సూత్రాన్ని పాటించాడు. అన్‌రిజర్వుడు స్థానాలైన మీరట్, ఫైజాబాద్‌లలో దళితులను నిలబెట్టడం సాహసమే కాదు, వ్యూహాత్మకంగానూ అధిక ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా దళితులకు సానుకూల సంకేతాలు పంపడానికి, ఇప్పటికే బాగా బలహీనపడిన బహుజన్ సమాజ్‌పార్టీ నుంచి ఓటర్లను లాక్కోవడానికి ఈ చర్య ఉపకరించింది. పొత్తులు సర్దుబాట్లలో భీం ఆర్మీ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ కు చోటు దక్కకపోయినా నగీనానుంచి ఆయన ఘనవిజయం సాధించడం అక్కడి దళితరాజకీయాల్లోనూ, కుల సమీకరణాల్లోనూ వస్తున్న మార్పునకు నిదర్శనం. ఇక, ఫైజాబాద్‌లో ఎస్పీ అభ్యర్థి యాభైవేల ఓట్లతో ఘన విజయం సాధించడంతో పాటు, అయోధ్య డివిజన్‌లో అమేథీ సహా ఐదు పార్లమెంటు సీట్లలోనూ బీజేపీ ఓడిపోయింది. రామమందిరంతో పాటు, కొన్ని కులకూటములతో బీజేపీ విజయతీరాలకు చేరడానికి ప్రయత్నించినప్పటికీ, అఖిలేశ్ పీడీఏ ఎక్కువ ఫలితాలు సాధించింది. సరిగ్గా ఎన్నికల ముందు చౌదరీ చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చి, జయంత్ చౌదరిని బీజేపీ తనవైపు లాక్కున్నప్పటికీ అఖిలేశ్ నిలబడగలిగారు.

'దో లడ్కో కీ జోడీ' అంటూ మోదీ పలుమార్లు అవహేళనగా మాట్లాడినా, అఖిలేశ్–రాహుల్ కలసికట్టుగా సాగుతూ దైనందిన సమస్యలు మాత్రమే లేవనెత్తుతూ యూపీ ఓటర్లను బాగానే ప్రభావితం చేయగలిగారు. ఉద్యోగం, ఉపాధి, అవినీతి, అభివృద్ధి వంటివి ప్రస్తావిస్తూ, బుల్‌డోజర్ రాజకీయాల స్థానంలో బువ్వపెట్టే కార్యక్రమాలు కావాలని చెప్పగలిగారు. ములాయం మరణం తరువాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి, 18వ లోక్‌సభలో మూడవ అతిపెద్ద పక్షంగా సమాజ్‌వాదీపార్టీని అఖిలేశ్ నిలబెట్టగలిగారు, మోదీ హవా దిశనూ మార్చగలిగారు.

మోదీ చెప్పిన గాంధీ చరిత్రలో నిజమెంత?



రాజకీయాలకు గతం బలికావటం అన్నిచోట్లా ఉంది. పరస్పర ఆరోపణలే ప్రధాన రాజకీయ అస్త్రాలుగా మారిన పరిస్థితుల్లో దానికి జరిగే హాని అంతా ఇంతా అని చెప్పలేం. నాలుగు ఓట్లు, నాలుగు సీట్లు అదనంగా రావటానికి గతం గురించి ఏదైనా మాట్లాడవచ్చనే ధోరణి విషమిస్తోంది. ప్రధాని మోదీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా గాంధీ సినిమా గురించి మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనం. రిచర్డ్ ఆటన్‌బ్రో దర్శకత్వంలో 1982లో ఆ సినిమా విడుదలైంది. ఆ సినిమాతోనే గాంధీ అంటే ప్రపంచానికి తెలిసిందనీ అంతకు ముందు ఆయనకు రావాల్సిన గుర్తింపు రాలేదనీ మోదీ వ్యాఖ్యానించారు. సినిమా మాధ్యమం చాలా శక్తిమంతమైంది. అందులో ఎవరికీ సందేహం లేదు. చరిత్రను కీలక మలుపుతిప్పిన మహామహుల గురించి గొప్పగా సినిమాలు తీస్తే వాటి ప్రభావం ప్రజలపై ఎంతోకొంత ఉంటుంది. దీనిపైనా ఎవరికీ సందేహం లేదు. ఆటన్‌బ్రో తీసిన గాంధీ సినిమాకు ఎనిమిది ఆస్కార్ అవార్డులు వచ్చాయి. పాశ్చాత్య దేశాల్లో 1980ల నాటి తరానికి గాంధీ గొప్పతనాన్ని చెప్పటానికి ఆ సినిమాను తీశారు. అప్పటికి ఇంగ్లిషులో గాంధీపై అంత సమగ్రమైన సినిమా రాలేదు. దాన్ని చూసిన వారిలో కొందరైనా గాంధీ గురించి మరింత తెలుసుకోటానికి ప్రయత్నించి ఉండొచ్చు. ఆయన ఆదర్శాలను ఆచరించటానికి కొంత కృషి చేసీ ఉండొచ్చు. వీటినే మోదీ చెబితే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. ఆటన్‌బ్రో సినిమాతోనే ప్రపంచానికి గాంధీ గురించి తెలిసిందని చెప్పటం మాత్రం చరిత్ర పరిశీలనకు నిలబడదు.

మోదీ వ్యాఖ్యల లోతుపాతుల్లోకి వెళ్లేముందు గాంధీ గురించి ఏమన్నారో ఆయన మాటల్లోనే చూద్దాం. "మహాత్మా గాంధీ మహోన్నత వ్యక్తి.. ఆయనకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చే బాధ్యత మనకు లేదా? ఆయన గురించి ఎవరికీ తెలియదు! ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి!.. గాంధీ సినిమా వచ్చినప్పుడు మాత్రమే గాంధీ ఎవరా? అని మొదటిసారి ప్రపంచం ఆసక్తిగా చూసింది. గాంధీని ప్రపంచానికి పరిచయం చేయటం మన కర్తవ్యం. కానీ దాన్ని చేయలేకపోయాం. ఈ ప్రపంచానికి మార్టిన్‌లూథర్ కింగ్, నెల్సన్ మండేలా.. అంటే ఎవరో తెలుసు. కానీ గాంధీ వారికంటే ఎందులోనూ తక్కువ కాదు... ప్రపంచమంతా తిరిగిన తర్వాతే దీని గురించి నేను చెబుతున్నాను. గాంధీ ద్వారానే భారత దేశానికి గుర్తింపు వచ్చి ఉండాలి"... కానీ అది రాలేదనీ చెప్పటమే మోదీ ఉద్దేశం. 75 సంవత్సరాల్లో ఆ పని మనం చేయలేదనటంలో పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శ కూడా ఉంది.

మోదీ అన్నట్లుగానే గాంధీ గురించి ప్రపంచానికి ఏమీ తెలియదా? అన్న ప్రశ్న వేసుకుంటే వచ్చే జవాబు మనల్ని నిర్ఘాంతపరుస్తుంది. నిజానికి మోదీ ప్రస్తావించిన అమెరికా పౌరహక్కుల ఉద్యమనేత మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలోని జాత్యంహకార ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దాల పాటు పోరాటం చేసిన నెల్సన్ మండేలాలకు మహాత్మా గాంధీయే స్ఫూర్తి. గాంధీ సినిమాకంటే చాలా ముందుగానే రాజకీయ పోరాటాలను వారిద్దరూ నడిపారు. అవిశ్రాంతంగా హక్కుల ఉద్యమాన్ని నడిపిన మార్టిన్ లూథర్‌కింగ్ 40 ఏళ్లు నిండకుండానే 1968లో హత్యకు గురయ్యారు. అనేక ఆందోళనల్లో పాల్గొన్న మండేలా 1982 నాటికి జైల్లోనే మగ్గుతున్నారు. సహాయ నిరాకరణ, శాసన ఉల్లంఘన, సమాన హక్కుల ఉద్యమాలను వారిద్దరూ గాంధీ మార్గాన్నే ఎంచుకున్నారు. బలమైన సైనిక, పోలీసు వ్యవస్థలతో పటిష్ఠ ప్రభుత్వాలు ఉన్నచోట ఉద్యమాలు హింసామార్గం తొక్కితే అణచివేతలు, అధికార హత్యాకాండలే చివరికి పైచేయి సాధిస్తాయన్న అవగాహన వారిద్దరికీ ఉంది. అందుకే గాంధీ అహింసామార్గాన్ని ఎత్తుగడగానూ, ఆందోళన మార్గంగానూ స్వీకరించారు.

బ్రిటిషు వలసపాలన నుంచి భారతదేశం విముక్తి కావటం 20వ శతాబ్దంలో జరిగిన కీలక ఘటనల్లో ఒకటి. చాలావరకూ అది శాంతియుతంగా జరిగింది. సాయుధ పోరాటాలు, హింసా ప్రయోగాలు అక్కడక్కడా ఉన్నా ప్రధాన రాజకీయ ఉద్యమం స్వాతంత్ర్యం కోసం హింసామార్గాన్ని స్వీకరించలేదు. గాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915లో భారత్‌కు వచ్చేనాటికి ప్రపంచంలో బ్రిటిషు సామ్రాజ్యానికి తిరుగులేదు. సైనికశక్తిలోనూ అగ్రగామే. మొదటి ప్రపంచ యుద్ధంలో చాలా నష్టపోయినా భారత్‌పై బ్రిటన్ పట్టు సడలలేదు. అహింస ప్రధానమైన వైష్ణవ, జైన సంప్రదాయాల ప్రభావంతో పాటు ఎన్నో వైవిధ్యాలు, అసమానతలు, బహుళ సంస్కృతులతో కూడిన భారత సమాజాన్ని నిశితంగా పరిశీలించటం వల్ల యూరోపులోని హింసామార్గం ఇక్కడ సరిపడదని గాంధీ భావించారు. హింసతో సాధించిన దాన్ని హింసతోనే నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని గాఢంగా నమ్మారు. చివరికి హింసా యంత్రాంగంపై (పోలీసు, సైన్యం) ఆధారపడే ప్రభుత్వ వ్యవస్థలను కాదనే వరకూ వెళ్లారు. హింసను.. మనుషుల పట్లే కాదు.. జంతు ప్రపంచానికీ, ప్రకృతికీ తలపెట్టకూడదనే ఉద్దేశంతో స్వయం సమృద్ధ గ్రామీణ జీవితాన్ని స్వీకరించాలని ప్రబోధించారు. దీన్ని కాంగ్రెస్ పార్టీయే స్వీకరించలేదు. అభివృద్ధిలో పాశ్చాత్య దేశాలను అనుకరించటమే కాంగ్రెస్ పార్టీకి ప్రధాన అజెండాగా ఉండేది. దాని సాఫల్య వైఫల్యాల గురించి చెప్పుకొంటే అదొక పెద్ద చరిత్రే అవుతుంది. బహుళత్వ భారత సమాజానికి సరిపోతాయన్న అవగాహనతో సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, సత్యాగ్రహం, హర్తాళ్, ఆమరణ నిరాహారదీక్షల్లాంటి ఆందోళనలను గాంధీ ఎంచుకున్నారు. వీటితోనే బ్రిటిషు పాలకులు దిగివచ్చారనే అభిప్రాయం 1950ల నాటికి బాగా బలపడినా 1920ల నుంచే వీటిపై పాశ్చాత్యదేశాల్లో ఆసక్తి పెరిగింది.

ప్రపంచ నాగరికతపై 'ద స్టోరీ ఆఫ్ సివిలైజేషన్' పేరుతో 11 వాల్యూముల ఉద్గ్రంథాన్ని ప్రచురించిన విల్‌డ్యురంట్ 'ద కేస్ ఫర్ ఇండియా' అన్న పుస్తకాన్ని 1930లోనే రాశారు. నాగరికతపై డ్యురంట్ సూత్రీకరణలతో ఎంతైనా విభేదించొచ్చు. కానీ ఆయన రచనా శైలి మనల్ని పరుగులెత్తిస్తుంది. అందుకే ఆయన రాసిన 'ద స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' పుస్తకం లక్షోపలక్షల్లో అమ్ముడుపోయింది. డ్యురంట్ భారత్‌కు వచ్చి గాంధీని కలిసి చర్చలు జరిపారు. 'ద కేస్ ఫర్ ఇండియా'లో ఒక అధ్యాయం మొత్తం గాంధీపైనే ఉంది. గాంధీ ఆందోళనా పద్ధతుల నుంచి ప్రేరణ పొంది అహింసా సిద్ధాంతంపై 1935లోనే 'ద పవర్ ఆఫ్ నాన్‌వయలన్స్' పుస్తకాన్ని అమెరికా న్యాయవాది రిచర్డ్ గ్రెగ్ రాశారు. 1950, 60ల్లో అమెరికాలో జరిగిన ఆందోళనలకు ప్రేరణను ఆ పుస్తకమే అందించింది. నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డబ్ల్యూ.ఇ.బి.డ్యూబ్వా కూడా గాంధీ రచనలను ప్రచురించారు. డ్యూబ్వా సిద్ధాంతాల ప్రభావం ఒకప్పుడు అమెరికాలో బాగా ఉండేది. అమెరికా చరిత్రలో పౌరహక్కుల ఉద్యమం చాలా కీలకమైంది. అక్కడి సమాజాన్ని మానవీకరించిన పోరాటమది. అందులో పాల్గొన్న వారిలో చాలా మంది గాంధీ నుంచి ప్రేరణ పొందారు. ఇక ఆఫ్రికాలోని వలసపాలన వ్యతిరేక పోరాటాల్లో కూడా గాంధీ సిద్ధాంతాలను మార్గదర్శకంగా స్వీకరించినవారు చాలా మంది ఉన్నారు. 1945లో మాంచెస్టర్‌లో జరిగిన అయిదో అఖిల ఆఫ్రికా కాంగ్రెస్ సమావేశం గాంధీ ఆందోళనా పద్ధతులను స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. జర్మనీలో గ్రీన్‌పీస్ పార్టీ ఏర్పాటుకు కూడా గాంధీ సిద్ధాంతాలే చాలా వరకూ ప్రేరణ. ప్రపంచ వ్యాప్తంగా 60, 70ల్లో జరిగిన శాంతిస్థాపన పోరాటాల్లో పాల్గొన్న పలువురికి స్ఫూర్తిని ఇచ్చింది గాంధేయ వాదమే. పర్యావరణ ఉద్యమాల్లో పాల్గొన్న చాలా మంది ఇదే దారిలో నడిచారు. ఇన్ని రకాల ఆందోళనల నేపథ్యంలో ఆటన్‌బ్రో గాంధీ సినిమా తీశారు. 20వ శతాబ్ద చరిత్రను స్థూలంగా చదివినా గాంధీ సినిమా కంటే ముందు ప్రపంచానికి గాంధీ గురించి తెలిసింది చాలా ఎక్కువన్నది అర్థం అవుతుంది. ప్రముఖ చరిత్రకారుడు డేవిడ్ హార్డీమన్.. 'గాంధీ ఇన్ హీజ్ టైమ్ అండ్ అవర్స్' అన్న పుస్తకంలో ప్రపంచ వ్యాప్తంగా గాంధీ ప్రభావం గురించి విపులంగా వివరించారు. 1924లోనే రోమైన్ రోలండ్.. గాంధీ జీవితాన్ని, సిద్ధాంతాలను స్పృశిస్తూ రాసిన పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. అప్పటికే రోలండ్ నోబెల్ బహుమతిని పొందారు.

ఎవరెవరో గాంధీ గురించి రాయటం మాట అటుంచి గాంధీ సొంత రచనలే చాలా ఎక్కువ. వ్యాసాలు, పుస్తకాలు, జాబులు–జవాబులు వరకూ గాంధీ పుంఖానుపుంఖంగా రాశారు. స్వయంగా పత్రికలు నడిపారు. తన సిద్ధాంతాలపైన విమర్శలనూ విస్తృతంగా అందులో ప్రచురించారు. క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటూ విస్తృతంగా రచనలు చేసినవారు అరుదుగా ఉంటారు. గాంధీ దీనికి భిన్నం. మరణించే నాటికే ఆయన రచనలు చాలా ప్రాచుర్యం పొందాయి. దండి ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ప్రసారమాధ్యమాలను ఆకర్షించటానికి గాంధీ రచించిన ప్రణాళిక అప్పట్లోనే సంచలనం. దానికి లభించిన ప్రచారం అనూహ్యం. ఆ తర్వాతే ప్రఖ్యాత టైం మ్యాగజీన్ 1930 సంవత్సరానికి గాంధీని 'మ్యాన్ ఆఫ్ ద ఇయర్'గా ప్రకటించింది.

గాంధీ హిందూ మతాన్ని వ్యతిరేకించలేదు. కుల వ్యవస్థను ఈసడించుకోలేదు. పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలను ఉన్నతమైనవిగా భావించలేదు. మతపరమైన పరిభాషను వదల్లేదు. భగవద్గీతను కాంతి దీపంగా పరిగణించటం మానలేదు. మైనారిటీల కోసం గొంతెత్తటం ఆపలేదు. వర్గపోరాటాలను అక్కున చేర్చుకోలేదు. స్త్రీపురుష సంబంధాలపై అందరికీ ఆమోదమయ్యే ప్రతిపాదనలు చేయలేదు. భిన్న సిద్ధాంతాల నుంచి చూస్తే ఇవన్నీ పరిమితులుగానే కనపడతాయి. కానీ సావర్కర్ ప్రబోధించిన హిందూత్వను సమర్థించలేదు. హిందూ ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. ముస్లింలను శత్రువులుగా చూడటానికి నిరాకరించారు. ముస్లింపాలకులను సంస్కృతీ విధ్వంసకులుగా వర్ణించలేదు. హిందూ మతంలోని చెడును బహిరంగంగానే వ్యతిరేకించారు. తీవ్ర హిందూత్వ రాజకీయాలతో ప్రభావితమైనవారు చాలా కాలం గాంధీని ద్వేషించారు. ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, సిద్ధాంతాల్లో గాంధీ ప్రభావాన్ని చూడటానికీ సుముఖత చూపించలేదు. గాంధీ గురించి 1980లకు ముందు ప్రపంచానికి తెలియదనటానికి ఇదీ ఒక కారణం కావొచ్చు! అపరిమిత అభివృద్ధి పేరుతో ప్రకృతిని వికృతపరుస్తూ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నంత కాలం.. కోర్కెలకు కళ్లెం వేయటాన్ని సర్వోత్కృష్ట విలువగా భావించిన గాంధీ మన భావావరణంలో ఏదో విధంగా మసలుతూనే ఉంటారు!

తీవ్ర హిందూత్వ రాజకీయాలతో ప్రభావితమైనవారు చాలా కాలం గాంధీని ద్వేషించారు. ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, సిద్ధాంతాల్లో గాంధీ ప్రభావాన్ని చూడటానికీ సుముఖత చూపించలేదు. గాంధీ గురించి 1980లకు ముందు ప్రపంచానికి తెలియదనటానికి ఇదీ ఒక కారణం కావొచ్చు! అపరిమిత అభివృద్ధి పేరుతో ప్రకృతిని వికృతపరుస్తూ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నంత కాలం.. కోర్కెలకు కళ్లెం వేయటాన్ని సర్వోత్కృష్ట విలువగా భావించిన గాంధీ మన భావావరణంలో ఏదో విధంగా మసలుతూనే ఉంటారు!



■ రాహుల్ కుమార్
(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

భద్ర భవిష్యత్తుకు పర్యావరణ భోగట్టా

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ వారి ప్రత్యేక డేటాసెట్ సిరీస్‌లోని 9వ eBook 'State of India's Environment 2024 : In Figures'. దేశ పర్యావరణ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించేందుకు పర్యావరణ సంబంధిత సమాచారం లేదా ఆధార సామగ్రికి ప్రథమ ప్రాధాన్యమిచ్చిన వార్షిక నివేదిక ఇది. పర్యావరణ వ్యవస్థల నిర్దిష్ట పరిస్థితిని సంఖ్యల ద్వారా తెలియజేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన పర్యావరణ భోగట్టా. సమస్యలను నిశితంగా, సమగ్రంగా అర్థం చేసుకునేందుకు ఉపకరించే సమాచారమిది. సమస్య పరిష్కారానికి దోహదం చేసే కార్యాచరణకు ప్రేరణనిస్తుంది. పర్యావరణ విపత్తులను నివారించడంలో సదరు కార్యచరణ చాలా కీలకమైనది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

నేను నివసిస్తున్న న్యూఢిల్లీ నగరంలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిపోయిన సందర్భంలో నేను ఇది రాస్తున్నాను. 'కంచు వృషభముల అగ్ని శ్వాసం (శ్రీశ్రీ 'గ్రీష్మం')'ను న్యూఢిల్లీ వాసులు చవిచూస్తున్నారు. ఇదిలా వుంటే నీటి సంక్షోభం కూడా ముంచుకొస్తున్నట్టు అధికార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ చండ్రగాడ్పులలోనే శ్రమించక తప్పని కూలీ, మాలీ, కార్మికుల తిప్పలు మాటల్లో చెప్పగలమా? వారు ఆ వేడిని భరించక తప్పదు. ఆ శ్రమ జీవుల అవస్థలు అర్థం చేసుకోవాలంటే మారుతోన్న వాతావరణం నుంచి ఉత్పన్నమవుతున్న సంక్షోభాలను అర్థం చేసుకోవాలి. ఈ eBookలోని సమాచారం దీన్నే స్పష్టం చేసింది. భూమి అంతకంతకూ వేడెక్కి పోతోందనడానికి స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. భూతాపం మాత్రమే కాదు వాతావరణ వైపరీత్యాలు పేదల, నిరుపేదల వెన్ను విరుస్తున్నాయి. భారత్‌లోని 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 69 వాతావరణ కేంద్రాలలో 23, గత 122 సంవత్సరాలలో ఎన్నడూ లేని రీతిలో గరిష్ఠ వర్షపాతాన్ని రికార్డు చేశాయి.

సరే, భారత ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ప్రజాస్వామ్య సంరంభం ఏ వెలుగులనివ్వగలదో మనకు త్వరలోనే అవగతమవుతుంది. కొత్త –(పాత) ప్రభుత్వ ఎజెండా ఎలా ఉండాలని ఈ పర్యావరణ భోగట్టా మనకు సూచిస్తున్నది? కొత్త ప్రభుత్వ ప్రాథమ్యాలు ఏమైనప్పటికీ ఇది వాతావరణ మార్పు తీవ్రమవుతున్న కాలం అనే వాస్తవాన్ని అర్థం చేసుకుని తీరాలి. ఈ నివేదిక స్పష్టం చేస్తున్న మొదటి పాఠమిది. శీతోష్ణస్థితులు ఆయా ఋతువులకు అనుగుణంగా ఉండడం లేదు. చండ్ర గాడ్పులు, చలిగాడ్పులు, కుండపోత వర్షాలు కాలం కాని కాలంలో మన అనుభవానికి వస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి లబ్ధి చాల మందికి ముఖ్యంగా పేదలకు దక్కకుండా చేస్తున్నాయి. వాతావరణ చిక్కుల నుంచి ఉపశమనానికి దోహదం చేసే అభివృద్ధి వ్యూహాల రూపకల్పన అనివార్యమవుతోంది.



నగరాలలో నీటి కొరత, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాథమ్యాలుగా ఉండాలి. వాటితో పాటు ప్రజా రవాణా వ్యవస్థను పతనస్థితి నుంచి ఉద్ధరించడానికీ అగ్ర ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలని 'State of India's Environment 2024 : In Figures' స్పష్టం చేసింది.

నిలకడలేని వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి లభించగల సమస్త సహాయమూ రైతులకు అంది తీరవలసిన అవసరముంది. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. ఈ సహాయంలో అత్యంత ముఖ్యమైనది పంటల బీమా పథకం. రైతులకు ఈ పథకం అవసరం ఎంతైనా ఉన్నది. అయితే అది సరైన రీతిలో అమలవుతుందా? సమాధానం స్పష్టమే. ఆ పథకంలో తగు మార్పులు చేసి పటిష్ఠంగా అమలుపరచాల్సిన అవసరమున్నది. పంట నష్టాలకు కారణమవుతున్న స్థానిక వాతావరణ పరిస్థితులను సైతం పరిగణనలోకి తీసుకుని పంటల బీమా పథకాన్ని రూపకల్పన చేయాలి.

ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే కాకుండా కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు సైతం మనం మన విద్యుదుత్పాదన పద్ధతులను మార్చుకోవల్సిన అవసరమున్నది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని చేస్తున్నాయో మరి చెప్పవలసిన అవసరం లేదు. విద్యుదుత్పాదనకు అధునాతన పద్ధతులను పాటిస్తే భూ తాపం పెరుగుదలకు కారణమవుతున్న హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని తగ్గించడం సాధ్యమవుతుంది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఉక్కపోత నుంచి ఉపశమనానికి మనకు మరింత విద్యుత్ అవసరమవుతుంది కదా. మరి విద్యుదుత్పాదనకు బొగ్గు లాంటి కాలుష్య కారక ఇంధన వనరును ఉపయోగించడం మనకూ, మన ధరిత్రికి మరింత విపత్తును కొని తెచ్చుకోవడమే అవుతుంది. భారత ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించింది. అందుకే అది పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. వేల కోట్ల రూపాయలు అందుకు మదుపు చేస్తోంది. మన విద్యుత్ వినియోగం రెట్టింపు అయినప్పటికీ బొగ్గుపై ఆధారపడకుండా ఉండేందుకే ఆ అధునాతన పద్ధతులను అనుసరిస్తోంది. అయితే థర్మల్ విద్యుత్తే ఇప్పటికీ మన విద్యుత్ అవసరాలలో అధిక భాగాన్ని తీరుస్తుందని ఈ వార్షిక నివేదిక స్పష్టం చేసింది. విద్యుత్ వాహనాల విక్రయాలు అత్యధికంగా ఉంటున్న మాట నిజమే అయినా ఈ వార్షిక నివేదికలోని గణాంకాలను పరిశీలిస్తే ద్విచక్ర, త్రిచక్ర వాహనాల శ్రేణిలోనే విద్యుత్ వాహనాల విక్రయాలు అధికంగా ఉంటున్నాయి. విద్యుత్ వాహనాలు డీజిల్ వాహనాలను ముఖ్యంగా ప్రైవేట్ కార్లు లేదా బస్సులను స్థానభ్రంశం చేయలేదు. ఫలితంగా వాయు కాలుష్యాన్ని నిరోధించేందుకు రవాణా పద్ధతులను పునరావిష్కరించుకోవలిసిన అగత్యమేర్పడింది. ప్రజా రవాణా సంస్థలు నష్టాల్లో కూరుకుపోతున్నాయని ఈ నివేదిక పేర్కొంది. ప్రజా రవాణా రంగాన్ని పర్యావరణ హితకరంగా ఉండేలా తీర్చిదిద్దడానికి మనం కొత్త వ్యూహాలను రూపొందించుకోవలిసిన అవసరమున్నది.

నగరాలలో నీటి కొరత, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాథమ్యాలుగా ఉండాలి. వాటితో పాటు ప్రజా రవాణా వ్యవస్థను పతనస్థితి నుంచి ఉద్ధరించడానికి కూడా అగ్ర ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఈ వార్షిక నివేదిక పేర్కొంది. వాతావరణ మార్పుతో ఉత్పన్నమవుతోన్న సంక్షోభాలను నివారించడం మన ప్రణాళికల లక్ష్యంగా ఉండాలి. నిపుణ పరిష్కారాలు అభివృద్ధికి దోహదం చేస్తాయి. జీవనాధారాలకు తోడ్పడుతాయి. అందరికీ శ్రేయస్సును సమకూరుస్తాయి. మరీ ముఖ్యంగా వాతావరణ మార్పు సమస్యలను అధిగమించేందుకు ఆలంబన అవుతాయి. ఈ పర్యావరణ భోగట్టా మనలను ఈ సమస్యలపై దృష్టి కేంద్రీకరించేలా చేస్తుంది. అంతకంటే ముఖ్యంగా తక్షణమే కార్యాచరణకు దిగవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. వినూత్న ఆలోచనలతో శీఘ్రగతిన, పెద్ద ఎత్తున కార్యోన్ముఖులం కావాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఇకనైనా కాళేశ్వరం భ్రమల్లోంచి బయటపడదాం!

ప్రతిరోజు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ గురించి, అందులో జరిగిన అవకతవకల గురించి పత్రికలలో వార్తలు వస్తూనే ఉన్నాయి. 2016లో ఈ ప్రాజెక్టు మొదలైనప్పటి నుండి మేము తరచుగా ఈ ప్రాజెక్టు అతి పెద్ద భారంగా ఎలా పరిణమించబోతోందో వ్యాసాలు రాస్తూ ప్రభుత్వాన్ని, ప్రజలను హెచ్చరిస్తూనే ఉన్నాం. దురదృష్టవశాత్తు 2016లో మేము ఏమి చెప్పామో సరిగ్గా అదే ప్రస్తుతం జరిగింది.

ఈ ప్రాజెక్టు వల్ల ఇప్పటివరకు రాష్ట్రానికి సమకూరిన లబ్ధి లేశ మాత్రమే. మరోవైపు ప్రాజెక్టు కారణంగా రాష్ట్రంలోని ఆర్థిక వనరులు క్రమంగా హరించుకుపోతున్నాయి. సాలీనా ఈ ప్రాజెక్టుపై చెల్లించాల్సిన మొత్తం సుమారు రూ.13,000కోట్లు. బహుశా దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక ప్రాజెక్టు మీద రుణాల చెల్లింపు కోసం ఇంత పెద్ద మొత్తాన్ని ఖర్చు పెడుతున్నట్టు లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిరోజు సుమారు రూ.36కోట్లు ఈ ప్రాజెక్టుపై రుణాల చెల్లింపు కోసం కేటాయించవలసి ఉంటుంది. ఇందులో నీటిని ఎత్తిపోయడానికి జరిగే ఖర్చు జత చేయలేదు. ప్రాజెక్టుల నిర్వహణ, విద్యుత్ చెల్లింపులు కలుపుకుంటే సాలీనా దాదాపు రూ.10,000 కోట్లు ఖర్చు పెట్టాలి.

ఈ కథ ఇక్కడితో అయిపోలేదు. ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమైన మూడు బ్యారేజీలు — సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ — ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రాజెక్టు కుప్పకూలుతోంది. కేవలం ఆ ప్రాజెక్టులను యథాతథంగా ఉంచడం కోసం పెట్టవలసిన ఖర్చు వందల కోట్ల రూపాయలకు చేరవచ్చు. ఏ రాష్ట్రంలోనూ ఒక ప్రాజెక్టును నిలబెట్టుకోవడం కోసం బహుశా ఇంత ఖర్చు పెట్టి ఉండరు.

ఇప్పటికి సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం మీద 35 వేల ఎకరాలకు మించి నీరు ఇవ్వలేదనేది వాస్తవం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి, వరద కాలువ నుంచి నీరు వస్తోంది కనుక ఇబ్బంది లేకుండా ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి అయినప్పటికీ కూడా బహుశా ఎకరం నీరు ఇవ్వాలంటే ఒక సీజన్‌లో ప్రభుత్వం రూ.60,000 నుండి రూ.1,10,000 ఖర్చు పెట్టవలసి ఉంటుంది. అలా కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్న ఒక ప్రాజెక్టును తెలంగాణలో కొత్త ప్రభుత్వం వారసత్వంగా పొందింది.

నాలుగు అంశాలకు సంబంధించి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక మంచి ఉదాహరణగా మన ముందు నిలబడుతుంది. ఎటువంటి ఖర్చుకు వెనకాడకుండా వ్యవసాయానికి నీరు అందించడం అనే ఒక కాలం చెల్లిన భావనకు ప్రాధాన్యం ఇవ్వడం; అమలుకు ఆమోదయోగ్యం కాని పారదర్శకత, బాధ్యత లోపించిన ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కంస్ట్రక్షన్ పద్ధతిలో ప్రాజెక్టు తీసుకోవడం; వాణిజ్య బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని భవిష్యత్తు తరాల అవసరాలను తాకట్టు పెట్టడం; ఇది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపించే ప్రభావాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం... ఇవన్నీ కలిపి ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నమైన ప్రాజెక్టుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిలబెట్టాయి. దీని ప్రతికూల ఫలితాలు మరికొన్ని దశాబ్దాల పాటు రాష్ట్రం మీద ఉండబోతున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుకున్నట్లుగా పూర్తి అయినా కూడా ఎకరానికి రూ.60,000 ఖర్చుపెట్టి ఇచ్చే నీరు ఖరీదుతో కూడుకున్నదే. ప్రభుత్వం రైతులతో చర్చించి వారు ఆరుతడి పంటలు వేసేలా ప్రోత్సహించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల కోసం, వ్యవసాయం కోసం, గ్రామీణ అభివృద్ధి కోసం చేపట్టింది. ప్రభుత్వం చాలా ఖరీదైన నీటిపారుదల సరఫరాకు ప్రయత్నించే బదులు రైతులతో చర్చలు జరపాలి.



2016లో ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రారంభించడానికి ముందే అందుబాటులో ఉన్న డీపీఆర్ ఆధారంగా ప్రాజెక్టు విషయంలో పునరాలోచన చేయాలని ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి సమర్పించాం. మా రిపోర్టులో ఈ ప్రాజెక్టు ప్రతిపాదిత నమూనా భారీ వ్యయంతో కూడుకున్నదని, నిర్వహణ వ్యయం ఎకరానికి 60 వేల రూపాయల వరకు ఉంటుందని, కొన్ని భారీ కట్టడాలు వరద ఉధృతిని తట్టుకొని నిలబడలేకపోవచ్చని స్పష్టంగా పేర్కొన్నాము. ఈ ప్రాజెక్టును సమగ్రంగా పునః పరిశీలించాలని, అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశాం. అయితే ప్రభుత్వం ఎవరి మాట వినడానికి, చర్చించడానికి కానీ సిద్ధంగా లేదు.

ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు చాలా గందరగోళ స్థితిలో ఉంది. మేడిగడ్డ ప్రాజెక్టు పగుళ్లు రావడమే కాదు, మునిగిపోతోంది. సుందిళ్ల, అన్నారం పరిస్థితి ఇంకా అర్థం కావడం లేదు. ఈ మూడు బ్యారేజీల్లోనూ నీరు నిలువ చేయడం సాధ్యం కాదు కనుక పంపింగ్‌కు అవకాశమే లేదు.

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) రాష్ట్రానికి ఒక నివేదిక సమర్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ నివేదిక ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేపట్టింది. అయితే ఈ మరమ్మత్తులు అన్నీ కూడా కేవలం ప్రాజెక్టును కాపాడడానికి కానీ పునరుద్ధరించడానికి కాదు. వీటికి మరింత నష్టం కలగకుండా ఉండడం కోసం ఈ మరమ్మత్తులు చేస్తున్నారు. ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదికలు సమర్పించిన మీదట మాత్రమే ఈ మూడు బ్యారేజీలకు మరమ్మత్తులు చేయడం సాధ్యం అవుతుంది.

దీని అర్థం ఏమిటంటే ప్రస్తుత సీజన్లో నీటిని పంపిణీ చేయడం కుదరదు. వచ్చే సంవత్సరం కూడా మరమ్మతులు పూర్తి అవుతాయా అంటే అనుమానమే. ఈ కారణంగా ఎల్లంపల్లికి కూడా ఇక్కడి నుంచి నీరు అందదు. ఫలితంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు అందడం ఉన్న ప్రక్రియ ప్రస్తుతం ఆగిపోయినట్లే.

తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి మరమ్మత్తులు చేయదలచిన ముందుగా కొన్ని విషయాలపై స్పష్టత తెచ్చుకోవాలి. 1) అతి భారీ ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్టుపై ఇంకా ఎంత మొత్తం వెచ్చించడానికి ప్రభుత్వ సిద్ధంగా ఉంది? 2) ఎన్‌డిఎస్‌ఏ చెప్పిన మరమ్మత్తులు చేసినా కానీ ఈ ప్రాజెక్టులు నీటి ప్రవాహాన్ని తట్టుకొని సుదీర్ఘకాలం నిలబడే అవకాశం ఉందా? 3) అవసరమైన మేరకు నిధులు సమకూర్చి, కింద మీద పడి ప్రాజెక్టు రిపేరు చేసినా ఒక ఎకరానికి నీరు పారడానికి అయ్యే ఖర్చు నీరు పారినందువల్ల ఒక ఎకరంపై వచ్చే ఆదాయంలో సమతుల్యత సాధ్యమవుతుందా? 4) ప్రభుత్వం ముందు ఉన్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? 5) ప్రజలపై అదనపు భారం మోపకుండా నిధులు సమీకరించుకునే అవకాశం ఏమన్నా ఉందా?

స్పష్టంగా చెప్పుకోవాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి నాన్ పెర్ఫార్మింగ్ అసెట్ (ఎన్‌పీఏ)గా మారిపోయింది. అందువల్ల ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి రుణాలను రీషెడ్యూల్ చేయించుకోవాలి. అలాగే రుణాల చెల్లింపు సమయాన్ని కూడా మరింత పెంచుకునేలా చూడాలి. కేంద్ర ప్రభుత్వాన్ని ఇందుకు ఒప్పించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను సరిగ్గా డాక్యుమెంట్ చేసి కేంద్ర ఆర్థిక సంస్థలకు ప్రభుత్వానికి సమర్పించాలి. ఇందులో ఎటువంటి ఆలస్యం జరిగినా దానివల్ల నష్టమే కానీ లాభం ఉండదు.


ఈ మొత్తం తప్పిదంలో కేంద్రం పాత్ర కూడా పెద్దదే. ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వడం, ఈ ప్రాజెక్టు చాలా బాగున్నాయని బహిరంగంగా ప్రకటించడం, ఆర్థిక సంస్థలు వాస్తవాలు పరిశీలించుకోకుండా రుణాలు ఇవ్వడం కూడా చాలా సవరించుకోలేని పెద్ద తప్పులే.

మరమ్మత్తులు చేసినా కాళేశ్వరం ప్రాజెక్టు నిలబడుతుందా, మన ముందున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి రాష్ట్రంపై అదనపు భారం పడకుండా ప్రాజెక్టు కోసం రుణాలు తీసుకురాగలమా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మటే రాష్ట్రం ఒక నిర్ణయం తీసుకోవాలి. వీటికి కచ్చితమైన సమాధానాలు వచ్చిన తర్వాత వాటి ఆధారంగా ముందుకు వెళ్లడానికి అవసరమైన ప్రక్రియను అనుభవం, నమ్మకం ఉన్న ఒక అంతర్జాతీయ సంస్థకు అప్పగించాలి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావడానికి బహుశా ఆరు నెలల సమయం పడుతుంది. అంటే వచ్చే సీజన్ మొదలవుతుంది. ఈ లోగా ప్రభుత్వం నీటి, వ్యవసాయ విధానాలకు రూపకల్పన చేయాలి. ఇదే సమయంలో నదుల అనుసంధానంలో భాగంగా గోదావరిలో ఇచ్చంపల్లి నుండి, కృష్ణా నదిలో ఇంద్రావతి నుండి నీటి మళ్ళింపుపై చర్చలు జరుగుతున్నందున రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడానికి వీలుగా వ్యూహాలు అనుసరించాలి. అదే సమయంలో మేడిగడ్డ ప్రాజెక్టు కుప్పకూలడం నుండి రాష్ట్రం నేర్చుకోవలసిన పాఠాలు చాలానే ఉన్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఎంత గొప్పగా చెప్పినప్పటికీ తెలంగాణ ప్రజలు ఇప్పటికైనా భ్రమల నుంచి బయటపడి వాస్తవాలను గమనించాలి. ఈ ప్రాజెక్టు ద్వారా 19 లక్షల ఎకరాలకు నీరు పారించడం దాదాపు అసాధ్యం. ప్రాజెక్ట్ అనుకున్నట్లుగా పూర్తి అయినా కూడా ఎకరానికి రూ.60,000 ఖర్చుపెట్టి ఇచ్చే నీరు ఖరీదుతో కూడుకున్నదే. ప్రభుత్వం రైతులతో చర్చించి వారు ఆరుతడి పంటలు వేసేలా ప్రోత్సహించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల కోసం, వ్యవసాయం కోసం, గ్రామీణ అభివృద్ధి కోసం చేపట్టింది. ప్రభుత్వం చాలా ఖరీదైన నీటిపారుదల సరఫరాకు ప్రయత్నించే బదులు రైతులతో చర్చలు జరపాలి. O&M ఖర్చులలో సగం ప్రభుత్వం అందజేస్తే, రైతులు నీటిని అడగకుండా ఒప్పందం కుదుర్చుకుని ప్రత్యామ్నాయ పంటలు పండిస్తారు. తెలంగాణ రైతులు ప్రజానీకం వాస్తవాలను గుర్తించి వ్యవసాయం మరింత ప్రోత్సాహకరంగా ఉండే విధానాలను ఆర్థిక వనరులు వృథా కాని పద్ధతులను అవలంబించేలా ప్రభుత్వంపై వత్తిడి తేవలసిన అవసరం ఉంది.

• డాక్టర్ బిక్షం గుజ్జ
• డాక్టర్ శివకుమార్ కనికే

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితులు అన్నె కవిత దంపతులు

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

- నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ
- నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు
- రాళ్లతో ప్రయాణికుల దాడి.. ప్రతిదాడులు చేసిన దుండగులు
- బాధితురాలిది విజయవాడ.. కాజీపేట రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు

వివరాలు 6లో..

గిట్లెట్లయ్యే?

గెలుపు ధీమాలో ఉన్న బీజేపీకి ఓరుగల్లు ఓటర్ల ఝలక్

- చరిత్రను పునరావృతం చేయాలనుకున్న కమలనాథుల ఆశలపై నీళ్లు
- లోక్‌సభ ఎన్నికలో ఓటమిపై కేడర్ అంతర్మథనం
- బలమైన నాయకత్వం లేక పోల్‌మేనేజ్‌మెంట్‌లో వెనుకబాటు
- 'అసెంబ్లీ'లో కాంగ్రెస్‌కు ఓట్లేసినట్లే తమకూ వేస్తారనే అతివిశ్వాసం
- ప్రచారంలో వరంగల్‌పై దృష్టిపెట్టని రాష్ట్ర స్థాయి నేతలు
- ఓడినా భారీగా ఓట్లు పొందామంటూ సర్దిచెప్పుకుంటున్న నాయకులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కమలనాథుల ఆశలపై ఓరుగల్లు ఓటర్లు నీళ్లు చల్లారు. 1984 నాటి చరిత్రను పునరావృతం చేస్తామన్న ధీమాలో ఉన్న బీజేపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. మోదీ చరిష్మాతో వరంగల్ ఎంపీ స్థానంలో పాగా వేయాలనే పక్కా వ్యూహంతో బరిలో దిగినా 'గిట్లెట్లయ్యే..' అంటూ బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు. అయితే వ్యూహప్రతివ్యూహాలు ఎలా ఉన్నా సవాళ్లను అధిగమించటంలో బీజేపీ విఫలమైందన్న చర్చ జరుగుతుండగా.. ప్రచారం విషయంలో రాష్ట్ర నాయకత్వం వరంగల్‌పై అంతగా దృష్టిపెట్టలేదని, అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేక ప్రత్యర్థులకు దీటుగా పోల్‌మేనేజ్‌మెంట్ చేయలేకపోయారని, శ్రేణులు కూడా చేతులెత్తేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా 40ఏళ్ల నాడు వరంగల్‌లో బీజేపీ జెండా ఎగరిందని, మళ్లీ ఇప్పుడు ఎగరవేయబోతున్నామని ప్రచారంలో చెప్పుకొచ్చిన బీజేపీ నేతలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు మింగుడుపడటంత లేదు. ఎక్కడెక్కడ తమకు ఓటు బ్యాంకు పెరిగింది.. ఎక్కడెక్కడ తాము నష్టపోయామని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటూ ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటున్నారు.

చరిత్ర తిరగరాయడంలో భంగపాటు..

వరంగల్‌లో బీజేపీకి ఓ చరిత్ర ఉంది. 1984 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా రెండే ఎంపీ స్థానాల్లో విజయం సాధించగా.. అందులో ఒకటి వరంగల్. వరంగల్ (పాత హనుమకొండ) లోక్‌సభ స్థానం నుంచి నాడు చందుపట్ల జంగారెడ్డి ఎంపీగా విజయం సాధించారు. 1989లో మరోసారి జంగారెడ్డి పోటీ చేసినా విజయం సాధించలేదు. అప్పటి నుంచి బీజేపీ వరంగల్ స్థానంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేదు. అయితే కేంద్రంలోని నరేంద్రమోదీ చరిష్మాతో తెలంగాణలో బీజేపీకి ఓ ఊపు వచ్చింది. దీంతో ఈ ఊపులో వరంగల్‌లో కూడా గెలిచి 1984 చరిత్రను పునరావృతం చేయాలని భావించిన బీజేపీ.. బలమైన నేత కోసం వెతికింది. ఈ క్రమంలోనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని బరిలో దించింది. దీంతో బీజేపీకి క్రేజ్ పెరిగింది. యువత, మహిళలు, రైతులతో పాటు పట్టణ ఓటర్లు ఈసారి తాము మోదీకే ఓటేస్తామంటూ బహిరంగంగానే చెప్పే స్థాయికి బీజేపీ చేరింది. దీంతో వరంగల్‌లో బీజేపీ గెలుస్తుందనే చర్చ జరిగింది. కానీ అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలవడం.. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఓటమిపాలై రెండో స్థానంలో నిలవడం చర్చనీయాంశంగా మారింది. చరిత్రను తిరగరాస్తామన్న ధీమా వ్యక్తం చేసిన కేడర్‌ను ఈ ఓటమి కుంగతీసింది.

పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఫెయిల్..

వరంగల్ ఎంపీ స్థానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. పోలింగ్ బూత్‌ల నుంచి కేడర్‌కు, సమావేశాలకు కావాల్సిన ఫండింగ్ కూడా పార్టీ నుంచే అందినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోల్‌మేనేజ్‌మెంట్‌లో మాత్రం పార్టీ చేతులెత్తేసిందనే చర్చ నడుస్తోంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం ఉన్న బీజేపీ అభ్యర్థికి పోల్‌మేనేజ్‌మెంట్‌పై పూర్తి అవగాహన ఉంది. అయితే ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ ఓటర్లకు కూడా నజరానాలను చేరవేశారని, ఇందుకోసం భారీగానే ఖర్చు చేశారన్న ప్రచారం జరుగుతోంది. కానీ పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో మాత్రం బీజేపీ మీనమేషాలు లెక్కించిందని, ప్రత్యర్థి పార్టీలకు దీటుగా ఓటర్లకు బీజేపీ నుంచి నజరానాలు అందలేదనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థులు పంపిణీ చేసిన దాంట్లో 50శాతమే ఇచ్చినప్పటికి అవి కూడా 30శాతం ఓటర్లకే చేరాయని, బలమైన అభ్యర్థిగా పేరుండటంతో ఓటర్లు కూడా అదే స్థాయిలో నజరానాలు ఆశించినట్లుగా ప్రచారం జరిగింది. కానీ ఇందులో కమలనాథులు చేతులెత్తేయటంతో కేడర్‌తో పాటు ఓటర్లు అసంతృప్తికి గురైనట్టు చర్చ జరుగుతోంది. దీంతో అప్పటి వరకు బీజేపీకే ఓటేయాలని నిర్ణయించుకున్న ఓటర్లు కూడా చాలా వరకు మనస్సు మార్చుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ వైపు చూశారని తెలుస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఇళ్ల నుంచి బయటకు రాకున్నా గెలిచారని, అదే తరహాలో తమకు మోదీ చరిష్మా కలిసొస్తుందని, నజరానాలతో పని లేకుండా ఓటర్లు తమను ఆశీర్వదిస్తారన్న అతి విశ్వాసం కూడా బీజేపీ ఓటమికి ఓ కారణంగా చెబుతున్నారు.

దృష్టి పెట్టని పెద్ద లీడర్లు..

బీజేపీ ఓటమికి మరో ప్రధాన కారణం నాయకత్వ లేమిగా చెప్పుకొంటున్నారు. బీజేపీపై ప్రజల్లో సానుభూతి వచ్చినప్పటికీ, దానిని ఓటు రూపంలో మార్చుకోవడంలో బీజేపీ విఫలమైందని, అన్ని చోట్ల నాయకత్వం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి 2,182 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కానీ పార్లమెంట్‌కు వచ్చే సరికి మోదీ చరిష్మా కారణంగా ఇక్కడ యువత బీజేపీ వైపు మొగ్గు చూపారని, అనూహ్యంగా బీజేపీకి 28,452ఓట్లు పోలయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అదే ఇక్కడ బలమైన నాయకత్వం ఉండి ఉంటే ఇంకా భారీగా ఓట్లు పడే అవకాశం ఉండేదనే చర్చ జరుగుతోంది. అలాగే స్టేషన్‌ఘనపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4,984 ఓట్లు మాత్రమే రాగా.. లోక్‌సభ ఎన్నికలో 40,332 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కూడా పాలకుర్తి పరిస్థితే ఉందని, ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేకపోవటంతోనే బీజేపీ మూడో స్థానానికి పరిమితమైందన్న చర్చ జరుగుతోంది. ఇక బలమైన నాయకత్వం ఉండటం కారణంగా వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీకి భారీగా ఓట్లు పోలయ్యాయని, ఫలితంగా భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేటలో పార్టీ రెండోస్థానంలో నిలిచిందని, కానీ పార్టీలో నేతల మధ్య ఆధిపత్య పోరుతో నష్టం జరిగిందనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఓ వైపు రాష్ట్ర నాయకత్వం పంపించిన ఇన్‌చార్జ్‌ల పెత్తనంతో చాలా మంది కీలక నేతలు అంటీముట్టనట్టు వ్యవహరించారనే ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు వరంగల్ సీటుపై బీజేపీ దృష్టిపెట్టినా ప్రచారానికి కీలక నేతలు దూరంగా ఉండటం కూడా బీజేపీకి నష్టం చేకూర్చిందనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో మోదీ సభ సక్సెస్ కావడం శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని, ఆ సభ ప్రభావం పట్టణ ప్రాంతాల్లోనే చూపిందని, అందుకే పట్టణప్రాంతాల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ లాంటి నేతలు ప్రచారానికి రాకపోవటం కూడా మైనస్ అయ్యిందని, ఇతర రాష్ట్రాల సీఎంలు, ముఖ్య నేతలు ప్రచారానికి వచ్చినా పెద్దగా ఒనగూరిందేమీ లేదని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు.

ఓట్లు పెరిగాయనే సంతృప్తిలో కమలం..

గెలుస్తామన్న సీటు గెలవకపోయినా కనీసం చెప్పుకోదగ్గ స్థాయిలో ఓటు బ్యాంకు పెరిగిందనే సంతోషంతో కొందరు బీజేపీ నేతలు సర్దుకుపోతున్నారు. ఇప్పటికే వరంగల్‌లో ఓటమిపై అధిష్ఠానం ఆరా తీస్తుండటంతో ప్రధానంగా పోల్‌మేనేజ్‌మెంట్ కారణంగానే ఓడిపోయామని కీలక నేతలు సమాధానం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వరంగల్‌తూర్పులో మొదటి స్థానంలోకి రావటంతో పాటు భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట, వరంగల్‌పశ్చిమ నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో నిలిచామని బీజేపీ నేతలు అధినాయకత్వానికి వివరిస్తున్నారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయితే.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 3,60,955ఓట్లు పోలయ్యాయనని, అప్పటికి ఇప్పటికి 2,04,317 ఓట్లు పెరిగాయని బీజేపీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

గత అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పోలయిన ఓట్లు ఇలా..

నియోజకవర్గం	అసెంబ్లీ	లోక్‌సభ
స్టేషన్‌ఘనపూర్	4,984	40,332
పాలకుర్తి	2,982	28,452
పరకాల	38,735	44,841
వరంగల్ పశ్చిమ	30,826	60,611
వరంగల్ తూర్పు	52,105	74,581
వర్ధన్నపేట	12,275	57,427
భూపాలపల్లి	14,731	49,631
పోస్టల్	00	5,080
మొత్తం	1,56,638	3,60,955

ప్రజల తీర్పును గౌరవిస్తున్నా

- వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

రాంనగర్, జూన్ 6: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మారేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సుధీర్‌కుమార్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన తన గెలుపు కోసం పార్టీ శ్రేణులు, నేతలు ఎంతగానో శ్రమించినట్లు తెలిపారు. వారందరికీ ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పును శిరసావహిస్తున్న తాను.. బీఆర్ఎస్ ఇచ్చే కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల పక్షాన పోరాడుతానన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి డబ్బులు పంపిణీ చేసి గెలిచిందని ఆయన ఆరోపించారు. 64మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఎంపీ ఎన్నికల్లో కేవలం 8 సీట్లకే పరిమితమైందన్నారు. ముఖ్యమంత్రి ఇలాఖాలో సైతం బీజేపీ గెలిచిందంటే ఆయన పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సుధీర్‌కుమార్ సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మాజీ కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు పులి రజనీకాంత్, జోరిక రమేశ్, చింతల యాదగిరి, కుసుమ లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, నయీమ్, చంద్రమోహన్, సల్వాజి రవిందర్‌రావు, రజనీకుమార్, సారంగపాణి, చాగంటి రమేశ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

నల్లగొండలో కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ఫస్ట్‌ప్రయారిటీలో మల్లన్నకు 18,565ఓట్ల ఆధిక్యం
- ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్య కోటా ఓటు రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం
- నేటి సాయంత్రానికి తుదిఫలితం వచ్చే అవకాశం



వివరాలు వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నిక ఫలితం ఇంకా తేలలేదు. గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయినా కోటా ఓట్లు రాకపోవడంతో రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి గానీ విజేతపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. గురువారం మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లున్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఈ ఉపఎన్నికలో మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన

మిగతా 8వ పేజీలో..

మొత్తం ఓట్లు	4,63,839
పోలైన ఓట్లు	3,36,013
అభ్యర్థుల సంఖ్య	52
మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలు	
చెల్లని ఓట్లు	25,824
చెల్లిన ఓట్లు	3,10,189
కోటా ఓటు	1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824



400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు
- జేఎన్ఎస్ వేదికగా రెండు రోజుల పాటు క్రీడలు
- పాల్గొన్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- పంటలకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్, పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 6: ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గురువారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, ఇతర రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి గ్రూప్-1 పరీక్ష నిర్వహణ, వానకాలం సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, తాగునీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాటాడుతూ.. ఈనెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే గ్రూప్-1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. వానాకాలం సీజన్ వచ్చిందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నకిలీ విత్తనాలు ఎక్కడా విక్రయించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటిని విజయవంతంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజుల్లో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటిని సందర్శించి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని సీఎస్ పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, దీనిని క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. విత్తన విక్రయ కేంద్రాలను సందర్శించామన్నారు. జిల్లాలో 356 విక్రయకేంద్రాలు ఉన్నాయని, కేంద్రాలను తనిఖీ చేసేందుకు టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. విక్రయకేంద్రాలలోని రిజిస్టర్లను తనిఖీ చేసి నకిలీ విత్తన విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ నాగపద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై, వ్యవసాయశాఖ ఉప సంచాలకుడు రవీంద్రసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దోపిడీ దొంగల బీభత్సం

నష్కల్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

చిలుపూర్/కాజీపేట, జూన్ 6: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని నష్కల్ - పెండ్యాల రైల్వే ట్రాక్ వద్ద దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో రైలు ఆగిన తర్వాత నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికుల మెడల్లోంచి దొంగల ముఠా బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్లు, బ్యాగులు చోరీ చేశారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5తోపాటు ఎస్-11 స్లీపర్ కోచ్‌లలో ఈ చోరీలు జరిగినట్లు తెలుస్తోంది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్, బాధితురాలు అన్నె కవిత తెలిపిన వివరాలు ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన అన్నెపు కవిత.. తన భర్త సాయిరమేశ్, ఇద్దరు పిల్లలు, మామతో కలిసి షిరిడీ దర్శనానికి వెళ్లింది. తిరిగి విజయవాడకు వచ్చేందుకు సికింద్రాబాద్‌లో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. అయితే నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా నర్సాపూర్ రైలు నష్కల్ సమీపంలోకి రాగానే లోకోపైలెట్ వేగం తగ్గించాడు. అయితే దుండగులు ఇదే అదనుగా భావించి ఆ రైలులో కిటికీ పక్కన నిద్రిస్తున్న అనిత మెడలో ఉన్న బంగారు గొలుసును బయటనుంచి లాగారు. మధ్య బెర్త్‌లో నిద్రిస్తున్న కవిత మెడలో నుంచి ఎవరో చైన్‌లాగినట్లు అనిపించడంతో ఒక్కసారిగా అప్రమత్తమై లేచింది. అప్పటికే దుండగులు గొలుసు లాగేశాడు. అలాగే అమె మెడలో నుంచి మరో బంగారు తాళిని తెంపే క్రమంలో గట్టిగా పట్టుకుంది. కిటికీల్లో నుంచి చూడగా దుండగులు ఒకరి భుజంపై మరొకరు ఎక్కి. కిటికీల వద్ద ఉన్న ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీలు చేస్తున్నారు. దీంతో కవిత పెద్దగా కేకలు వేయడంతో నిద్రమత్తులో ఉన్న మిగతా ప్రయాణికులు అందరూ లేచారు. కవిత కేకలకు పారిపోతున్న దొంగలను చూసిన ప్రయాణికులు రైలు దిగి రాళ్లతో దాడి చేస్తూ దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగలు సైతం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న రాళ్లతో ప్రతిదాడులు చేశారు. వెంటనే ప్రయాణికులు తిరిగి రైలెక్కి. రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమమైన రైల్వే అధికారులు రైల్వే టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేశారు. ఆపై రైలు యథావిధిగా వెళ్లింది.

గురువారం ఉదయం రైల్వే జీఆర్పీ పోలీసులతో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, చిలుపూర్ ఎస్‌ఐ ముత్యం రాజేందర్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కాగా, కవిత తన కుటుంబంతో సహా విజయవాడకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. 12 గ్రాముల బంగారు చైన్‌తో పాటు ఇతర వస్తువులు చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాలపై పోలీసులను వివరణ అడగగా.. నష్కల్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల దృష్ట్యా రైలు మెల్లగా వస్తుండడంతో దుండగులు దోపిడీకి పాల్పడ్డారా..? అదే రైలులో వచ్చి రైలు ఆగగానే దోపిడీ చేశారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది ప్రయాణికుల బంగారం, ఇతర వస్తువులు చోరీ అయ్యాయో పూర్తి వివరాలు తెలియడం లేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు అంటున్నారు.

ఇదిలా వుండగా, అర్ధరాత్రి చీకటిలో జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సినీ పక్కీలో జరిగిన ఈ చోరీలను చూస్తున్న ఇతర ప్రయాణికులు అసలు ఏమి జరుగుతుందో అర్థంకాకుండా ఉండిపోయారు. తొలుత దోపిడీ దొంగలు అర్ధరాత్రి రైల్లోకి చొరబడి మహిళలను మారణాయుధాలతో బెదిరించి వారి మెడల్లోంచి 25 తులాల బంగారాన్ని దోచుకెళ్లినట్టు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఈ చోరీల్లో సుమారు 20 మంది ముఠా సభ్యులు పాల్గొన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.



నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో విచారణ చేపడుతున్న పోలీసులు

28న డాక్ అదాలత్

సుబేదారి, జూన్ 6: తపాలా శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజల నుంచి స్వీకరించేందుకు ఈ నెల 28న పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ వారు 46 డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల14 లోపు కె.శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ఆఫీస్ ఆఫ్ పోస్టు మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ 500001కు వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాల్‌పల్లి, జనగామ జిల్లాల ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. పోస్టల్ కవర్‌పై 46 డాక్ అదాలత్ అని రాసి పంపించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపటి నుంచి దూరవిద్య పీజీ ప్రాక్టికల్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ దూరవిద్య పీజీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫస్టియర్ పరీక్షల ప్రాక్టికల్ పరీక్షలు శనివారం (జూన్ 8)నుంచి ప్రారంభిస్తున్నట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న బోటనీ, 9న ఫిజిక్స్, 12న జువాలజీ, కెమిస్ట్రీ, 13న కెమిస్ట్రీ మరో పేపర్ ఉంటాయని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత డిపార్ట్‌మెంట్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

జేఎన్ఎస్‌లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది క్రీడాకారులు హాజరు



100 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 6: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి పది రాష్ట్రాల నుంచి 971మంది అథ్లెట్లు, 100మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ హనుమకొండ వాస్తవ్యుడు కావడం మనకు ఎంతో గర్వకారణమని కొనియాడారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజు 1000, 1500, 10వేల మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్, లాంగ్‌జంప్, 400, 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్, 300మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 150మీటర్ల పరుగు, 80, 50 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, హెప్టథ్లాన్, డెకాథ్లాన్, జావెలిన్‌త్రో, ట్రిపుల్‌జంప్, 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, 4ఇంటూ400రిలే విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15 నుంచి 17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

కాగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు జీవంజి దీప్తి, అగసర నందిని, సాయి సంగీతలు క్రీడా మైదానంలో సందడి చేశారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను చూసి మైదానంలో పలువురు చిన్నారులు, వర్ధమాన అథ్లెట్లు సెల్ఫీలను దిగుతూ అలరించారు. ఈ సందర్భంగా పారా ఒలంపియన్ జీవంజి దీప్తి, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్ నందినిలను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అసోసియేషన్ బాధ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీజోన్స్, చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్, అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, చంద్రమోహన్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు వాసుదేవ్, మనోజ్‌కుమార్, సోమేశ్వర్, జగన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి..

జీవంజి దీప్తి, అంతర్జాతీయస్థాయి పారా అథ్లెట్, కల్లెడ

జపాన్ దేశంలోని యూనివేసియేడ్ మెమోరియల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్ టీ20 చాంపియన్‌షిప్ 400మీటర్ల పరుగుపందెంలో 55.07 సెకన్లలో గమ్యాన్ని చేరి ప్రపంచ రికార్డు నెలకొల్పాను. అథ్లెటిక్స్‌లో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై స్వర్ణ, రజత పతకాలు సాధించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదు. నిరుపేద కుటుంబంలో జన్మించిన నాకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు భరోసాగా నిలవాలి.

ఒలింపిక్స్‌లో అర్హత సాధించడమే లక్ష్యం

సాయి సంగీత, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్ మహబూబ్‌నగర్

ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన జూనియర్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4ఇంటూ400రిలేలో స్వర్ణం సాధించాను. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే కఠోర సాధన చేయాలి. కోచ్‌ల ప్రత్యేక శిక్షణలో తర్ఫీదు పొందుతూ వారు చూపించిన విధంగా నడుచుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుకుంటూ అక్కడి కోచ్ వద్ద అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సంవత్సర కాలంగా కర్నాటక రాష్ట్రంలోని మంగుళూర్‌కు చెందిన కోచ్ అజిత్ కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటూ అక్కడే డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా.

అంతర్జాతీయ క్రీడాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

అగసర నందిని, ఏషియన్ గేమ్ మెడలిస్ట్ హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహంతోపాటు నివాస స్థలం కేటాయించాలి. ఇతర రాష్ట్రాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారులు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇటీవల చైనాలో జరిగిన హెప్టథ్లాన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాను. ఈ నెల 27నుంచి 31 వరకు హరియాణా రాష్ట్రంలోని పంచకుల లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల హెప్టథ్లాన్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి ఒలంపిక్స్ అర్హత సాధించేందుకు కసరత్తు చేస్తున్నా.

దర్గాలో ప్రార్థనలు.. అమ్మవారికి పూజలు

కాజీపేట దర్గా, భద్రకాళిని దర్శించుకున్న కడియం కావ్య



కాజీపేట దర్గాలో ప్రార్థన చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య తదితరులు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కావ్యకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

కాజీపేట టౌన్ / వరంగల్ కల్చరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కడియం కావ్య గురువారం కాజీపేట దర్గా, వరంగల్ భద్రకాళి ఆలయాలను సందర్శించారు. తన తండ్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాజీపేట దర్గాకు వచ్చిన ఆమెకు పీఠాధిపతి ఖుస్రుపాషా ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తాను వరంగల్ ప్రజలకు రుణపడి ఉంటానని, తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ముస్లింలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కోసం శ్రమిస్తానన్నారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కాజీపేట దర్గా విలసిల్లుతోందన్నారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ అబూబకర్, మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే పలువురు కుటుంబ సభ్యులతో కలిసి కావ్య భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానార్చకుడు భద్రకాళి శేషు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను కావ్యకు అందజేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన తోడ్పాటును అందించాలని వేడుకున్నానన్నారు.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

దరఖాస్తుల దాఖలు గడువు పెంపు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఆశోక్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైనిక్ స్కూల్/ఆకాడమీలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ (హెచ్‌ఈపీ), బీఎస్సీ (ఎంపీసీ) 40 చొప్పున సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్, కరీంనగర్ రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుల దాఖలకు చివరి తేదీని జూన్ 15 వరకు పొడిగించినట్టు తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి విద్యార్హత ఇంటర్, రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారని, ఫీజు రూ.100 అని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నింపి సంబంధిత పత్రాలు జత చేసి ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ (బి), ఆశోక్‌నగర్ పేరుమీదరూ. 100 డీడీ తీసి లేదా కింది ఏదేని నెంబర్‌కు యూపీఐ ద్వారా చెల్లించి స్క్రీన్ షాట్ జిరాక్స్, పూర్తి దరఖాస్తు కాపీని ప్రిన్సిపాల్ టీటీడబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్ ఆశోక్‌నగర్, మండలం ఖానాపురం, వరంగల్ జిల్లా పిన్ కోడ్ 506132కు పంపాలని కోరారు. లేదా సంబంధిత జిరాక్స్ పత్రాలు (ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ షార్ట్ మెమో, బోనోఫైడ్స్ క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్స్ సర్టిఫికెట్లు, 5 ఫోటోలు) తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9963584516, 9398068250, 8985469347 8978616155, 9553310104నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వెబ్‌సైట్ https://www.tgtwgurukulam.telangana.gov.in చూడాలని కోరారు.

కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్ ప్రకటన

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను రీషెడ్యూల్ చేస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పేపర్ జూన్ 11న, రెండో పేపర్ 13న, మూడో పేపర్ 15న, నాలుగో పేపర్ 19న, ఐదో పేపర్ 21న, ఆరో పేపర్ జూన్ 24న ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్ పోర్టల్‌లో చూడాలని సూచించారు.

మహిళ హత్య కేసులో పురోగతి

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

మడికొండ, జూన్ 6: మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట శివారులోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఇటీవల కాజీపేట దర్గా తండాకు చెందిన లావుడ్య కుమారి అనే వివాహిత బుధవారం దారుణ హత్యకు గురికాగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతురాలి భర్త లావుడ్యా కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యా స్థలంలో దొరికిన ప్రాథమిక ఆధారాల ద్వారా గురువారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం మహిళ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తొలి ప్రాధాన్యంలో తేలని ఫలితం

(5వ పేజీ తరువాయి)

48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కావ్యకు అభినందనల వెల్లువ

హనుమకొండ సిటీ, జూన్ 6: వరంగల్ ఎంపీగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యకు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అభినందనలు వెల్లువెత్తున్నాయి. గురువారం హనుమకొండ కనకదుర్గా కాలనీలోని శ్రీహరి నివాసంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఇరువురిని కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియచేశా రు. అభినందనలు తెలిపిన నేతల్లో మండల సమ్మయ్య, జనార్దన్‌గౌడ్, కిషన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, జయపాల్, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● భీమారం: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎంపీ గా గెలుపొందిన డాక్టర్ కడియం కావ్యను, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గురువారం 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మార్క రాజు, సింగాల చిట్టిబాబు, సంగాల చిన్ని, వీనస్, నరేశ్, రమేశ్, రాజు, దయాకర్, రాధాకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో డాక్టర్ కడియం కావ్య ఎంపీగా గెలుపొందడంతో గురువారం మడికొండకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, ఎంపీ కావ్యను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోగి క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కుర్ల మోహన్, జిల్లా అధ్యక్షులు నిగ్గుల వెంకటప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోగి లింగమూర్తి, కంచనపెల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, బోగి కేదారి, బోగి రామ్మూర్తి, పెనుకుల రవిందర్, మండల రఘు, ముష్కె సాంబయ్య, గోపనబోయిన రాజు పాల్గొన్నారు.



ఎంపీ కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ రజిత



పాలిటెక్నిక్ అధ్యాపకులకు వివరిస్తున్న నిట్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథన్

విద్యార్థుల్లో గ్రూప్ డిస్కర్షన్ నైపుణ్యాలను పెంపొందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో గ్రూప్ డిస్కర్షన్ నైపుణ్యాలను పెంపొందించాలని నిట్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథన్ అన్నారు. కేయూలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న 3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా గురువారం నిట్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథన్ రీసోర్స్ పర్సన్‌గా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిలదొక్కుకోవాలంటే గ్రూప్ డిస్కర్షన్ నైపుణ్యత ఎంతో అవసరమన్నారు. తరగతి గదిలో ఈ నైపుణ్య బోధన అవశ్యకతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలోపొఫెసర్ జ్యోతితో పాటు పాలిటెక్నిక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి బృందం రూపొందించిన ప్రభుత్వ పాఠశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేధించే దిశగా బడిబాట పయనించాలని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట బ్యానర్‌తో ఆవాసప్రాంతంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నెల 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

● ఐనవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, సంఘాల బాధ్యులు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం మండల వ్యాప్తంగా ప్రారంభించారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల బాధ్యులు, యువజనులు, పురప్రముఖులు విద్య ప్రాధాన్యతను తెలియజేస్తూ సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో ఐనవోలులో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహర్షుడు, మధుకర్, భీమాళ్ల సారయ్య, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మయ్య, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సమ్మక్క, రేణుక, దీపిక, పద్మ, ఉడుతగూడెంలో లింగరావు, అంగన్‌వాడీ టీచరు ప్రణీతరెడ్డి, కొండపర్తిలో హెచ్ఎం రఘునందన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మడికొండలో బడిబాట

మడికొండ: ప్రభుత్వ పాఠలల్లోనే విద్యార్థులకు గుణాత్మక విద్య లభిస్తుందని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వివరిస్తూ ఆయన ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పిల్లలకు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో మాట, ఆట, పాటలతో బోధన అందిస్తారన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మడ్డి అరుణ, ఉపాధ్యాయులు డి.కోమల్‌రెడ్డి, ఎస్.రమేష్, డి.వేణుగోపాల్, సి.అరుణ, సీహెచ్.కమల, పి.సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఎన్‌జీవో దువ్వ కిషన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధిక ధరలకు లేపనం విక్రయం

దాడుల్లో గుర్తించిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు



ట్యూబులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

వరంగల్ మెడికల్, జూన్ 6: ముపిరోసిన్ 2శాతం లేపనాన్ని అధిక ధరలకు విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణశాఖ అధికారులు పట్టుకున్నారు. గురువారం ఉదయం హనుమకొండ హనుమాన్ నగర్‌లోని ఏజెన్సీస్‌లో సీలింగ్ ధర కంటే ఎమ్మార్పీని ముద్రించి ముపిరోసిన్ 2శాతం లేపనాన్ని విక్రయానికి సిద్ధంగా ఉంచగా, అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రతీ ఐదు గ్రాముల ట్యూబ్‌పై రూ.130 ఎమ్మార్పీ ముద్రించారని, కానీ ఈ డ్రగ్ సీలింగ్ ధర కేవలం రూ.113.6 మాత్రమేనని స్పష్టం చేశారు. ఔషధ నియంత్రణ శాఖ నిర్ణయించిన ధరలకంటే అధిక ఎమ్మార్పీ ముద్రించిన 30 ట్యూబులను స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణశాఖ అధికారులు తెలిపారు. వీటిని కోర్టులో స్వాధీనపర్చనున్నట్లు వెల్లడించారు. ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మీ పర్యవేక్షణలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జన్ను కిరణ్ కుమార్, అరవింద్ కుమార్, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఐసెట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: ఐసెట్-2024 గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజులు సీబీటీ పద్ధతిలో జరుగుతున్న ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతగా ముగిసిందని ఐసెట్ కన్వీనర్ ఎస్. నర్సింహాచారి తెలిపారు. బుధ, గురువారాల్లో ఆంధ్ర, తెలంగాణలో జరిగిన పరీక్షకు 86,156 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 77,942 మంది (90.47 శాతం) విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో ఎంపిక చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 4,659 మందికి గాను 4,364 మంది హాజరయ్యారు. జూన్ 8న ఐసెట్ ప్రాథమిక కీ విడుదల చేస్తున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు. అభ్యంతరాలున్న విద్యార్థులు జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్-2024 పోర్టల్‌లో వారి అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

బాలసముద్రంలో సూచిక బోర్డుల ఏర్పాటు



బాలసముద్రంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

బాలసముద్రం, జూన్ 6: కాలనీ సూచిక బోర్డులను గురువారం బాలసముద్రం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నామిరెడ్డి సీతారాంరెడ్డి, గుర్రాల ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు రూ.లక్షా 50వేల సొంత నిధులతో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కాలనీలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, పార్కులను అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు జి. భిక్షపతి, పి. రాంమోహన్, ఆర్. కేశవరెడ్డి, పి. సత్యనారాయణ, వై. శ్యాంసుందర్, ఎం. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సఖీ' సేవలను ఉపయోగించుకోవాలి

న్యూశాయంపేట, జూన్ 6: సఖీ కేంద్రం సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సఖీ వన్‌స్టాప్ కేంద్రం లీగల్ కౌన్సిలర్ ఎ.శ్రీదేవి అన్నారు. కేంద్రం ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సఖీ వన్‌స్టాప్ కేంద్రం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఎలాంటి సమస్యలు ఉన్నా కేంద్రాన్ని సంప్రదిస్తే పరిష్కరిస్తామన్నారు. కేస్ వర్కల్ వినీలా మాట్లాడుతూ విడిపోయే భార్య భర్తలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటిగా కలపడం చేస్తున్నామని, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు లాంటి సమస్యలను సఖీ సెంటర్ పరిష్కరిస్తుందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, డీహెచ్ఈడబ్ల్యూ స్వర్ణలత పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ

వరంగల్ క్రైం, జూన్ 6: నూతన చట్టాలపై ప్రతీ పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ సూచించారు. జులై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై గురువారం హనుమకొండలోని ఎల్‌బీ కళాశాలలో పోలీసు అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీసీపీ బారీ మాట్లాడుతూ.. జులై 1 నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనికి అనుగుణంగా జులై 1 నుంచి కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. చట్టాలపై అధికారులకు సిబ్బందికి అవగాహన అవసరమన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు నందిరామ్‌నాయక్, దేవేందర్‌రెడ్డి, సీఐలు గోపి, శివకుమార్, మల్లయ్య, సంజీవ్, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బారీ

రైతు సమస్యలపై ఉద్యమించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య పిలుపు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 6: జిల్లాలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలపై అందరూ ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య అన్నారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్కయ్య మాట్లాడారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు గుర్తించి పరిష్కార మార్గం చూపాలన్నారు. రైతాంగ సమస్యలపై జూలై చివరి నాటికి అన్ని మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల, జిల్లా స్థాయి నాయకులు రైతాంగ సమస్యలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండి పర్వతాలు, ముమ్మిడి శ్రీకాంత్, శ్రీనివాస్, శంకర్‌రావు, మోహన్‌రావు, నారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మొగిళి వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6: విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కేయూలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్లో యూనివర్సిటి కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యా వ్యాపారానికి ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు తెరలేపుతున్నాయన్నారు. లక్షల రూపాయల్లో ఫీజులు వసూల్ చేస్తూ తల్లిదండ్రులపై మోయలేని భారాన్ని మోపుతున్నారన్నారు. ఇంటర్నేషనల్, పబ్లిక్, సీబీఎస్ఈ తదితర తోక పేర్లతో అక్రమంగా ఫీజులు వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలు, బ్యాడ్జీలు, యూనిఫామ్‌ల పేరుతో విద్యార్థుల నుంచి రూ.10నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారన్నారు.

ఇంత చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్, కేయూ ప్రధానకార్యదర్శి మర్రి మహేష్, వంశీకుమార్, గోవర్ధన్, దేవేందర్, సాయిచంద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బలగం మొగిలయ్యకు పరామర్శ

వరంగల్ మెడికల్, జూన్ 6: దీర్ఘ కాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతూ ఈ నెల 4న ఐదోదశ చికిత్స కోసం వరంగల్‌లోని సంరక్ష ఆసుపత్రిలో చేరిన 'బలగం' సినిమా ఫేం, జానపద కళాకారుడు మొగిలయ్యను వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పరామర్శించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో గురువారం ఉదయం వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రికి వచ్చిన డీఎంహెచ్‌వో మొగిలయ్యకు చికిత్స చేస్తున్న వైద్యులతో మాట్లాడారు. మొగిలయ్యకు ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందుతున్నారని, ప్రస్తుతం కిడ్నీ డయాలసిస్ చికిత్సను అందిస్తున్నామని సంరక్ష ఆసుపత్రి వైద్యులు డీఎంహెచ్‌వోకు వివరించారు. అనంతరం మొగిలయ్య భార్య కొమురమ్మ, కుమారుడు సుదర్శన్‌లకు ధైర్యం చెప్పిన డీఎంహెచ్‌వో మొగిలయ్య త్వరలోనే కోలుకుని డిశ్చార్జ్ అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో వెంట సంరక్ష ఆస్పత్రి యాజమాన్యంతోపాటు డిప్యూటీ డెమో అనిల్ కుమార్ తదితరులున్నారు.



బలగం మొగిలయ్యను పరామర్శిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కార్మికులతో ఒక్క పూటనే పని చేయించాలి

వడ్డెపల్లి, జూన్ 6: ఎండ తీవ్రత దృష్ట్యా మునిసిపల్ కార్మికులతో ఒక్క పూటనే పని చేయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ సమ్మయ్య నగర్‌లో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్క పూటనే పనిచేయించాలని సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినప్పటికీ అధికారులు మాత్రం రెండు పూటలా పనిచేయించడంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. సమావేశంలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, కార్యదర్శి ఉప్పలయ్య, కూన రాజేష్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్6: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌నగర్, సహకార్‌నగర్, పోస్టల్ కాలనీ, డీఈవో ఆఫీస్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా జరగదని, అదే విధంగా 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జూపార్కు వెనుక ప్రాంతమైన అడ్వకేట్ కాలనీ రోడ్డు నెంబర్ 8,9 లో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, జూన్6: నిబంధనలు ఉల్లఘించిన పలువురు వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడ్డ 16 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందికి రూ.10,900, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ నలుగురికి రూ.3,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

పిడుగుపడి రెండు ఎడ్ల మృత్యువాత

హసన్‌పర్తి, జూన్ 6: పిడుగుపడి రెండు ఎడ్లు మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం గంటూర్‌పల్లిలో జరిగింది. గం టూర్‌పల్లికి చెందిన పప్పు పాపిరెడ్డికి రెండు ఎడ్లు ఉన్నాయి. వాటిని ఇంటి ఎదుట వేప చెట్టు కింద బుధవారం కట్టేశాడు. అర్ధరాత్రి గాలి దుమారంతో వాటిపై పిడు గు పడి అవి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన రెండు ఎడ్లను ఇటీవల రూ 1.10 లక్షలకు కొనుగోలు చేసినట్లు బాధితుడు సమ్మిరెడ్డి తెలిపాడు. గురువా రం ఉదయం మండల పశువైద్యాధికారి క్రాంతికుమార్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజేశ్వర్‌రావుకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

బాలసముద్రం, జూన్ 6: కామ్రేడ్ చండ్ర రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. చండ్ర రాజేశ్వర్‌రావు 118వ జయంతిని గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప నేత రాజేశ్వర్‌రావు అని కొనియాడారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కర్రె లక్ష్మణ్, వెంకటరమణ, బాషబోయిన సంతోష్, వేల్పుల సారంగపాణి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఐనవోలు, జూన్ 6: ఐనవోలుకు చెందిన వడిచెర్ల కొమురమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సహజయోగ

ఏడు చక్రాల జాగృతితో... అనంతమైన ఆనందం



'భగవంతుడు అంటే ప్రేమ' అని మనం వింటూ ఉంటాం. ఎందరో దాని గురించి వర్ణించారు. కానీ స్వయంగా అనుభూతి చెందకుండా... భగవత్ స్వరూపమైన ప్రేమలోని ఆనందాన్ని అనుభవించలేం. దాన్ని ఆస్వాదించే యంత్రాంగాన్ని భగవంతుడే మనలో పొందుపరిచాడు. ఆ యంత్రాంగమే అంతర్గత సూక్ష్మవ్యవస్థ. అది మనలో ఏడు పొరలుగా పని చేస్తుంది. అవి మనలోని శక్తి కేంద్రాలు. వాటిని చక్రాలుగా యోగశాస్త్రం అభివర్ణించింది.

మూలాధార చక్రం: మొదటి శక్తి కేంద్రమైన మూలాధారచక్రం మనలోని విసర్జనావయాలమీద ప్రభావం చూపిస్తుంది. విసర్జన క్రియ తరువాత మనకు చాలా ఉపశమనం కలుగుతుంది. ఆ ఉపశమనం మనకు ఆనందాన్ని ఇస్తుంది. ఇది చాలా చిన్న విషయమే. కానీ ప్రధానమైనది. అయితే... మనలోని ఎన్నో లోతైన, సున్నితమైన విషయాలవల్ల కలిగే ఆనందాన్ని ఈ ఆనందం అధిగమించకుండా ఉండాలంటే... మనలో నిర్మలమైన మనస్తతత్వం ఉండాలి. అది శ్రీగణేశుని సహజ లక్షణం. సహజయోగ సాధనతో మూలాధార చక్రాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా ఈ గుణాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

స్వాధిష్ఠాన చక్రం: ఇది రెండవ పొర. సృజనాత్మకత వల్ల కలిగే ఆనందానికి సంబంధించినది. కొందరు రచన ద్వారా, కళల ద్వారా ఏదైనా సృష్టించడం ముఖ్యమనుకుంటారు. ఈ సృజనాత్మకతకు హేతుబద్ధమైన ఆలోచన తోడైతే... తాము అందరికన్నా గొప్పవారమని గర్వపడతారు. ఇది సరైన ఆలోచన కాదు. ఈ రెండవ పొరను అధిగమించాలంటే నిర్విచార స్థితిలోకి వెళ్ళాలి. మన అవగాహన ప్రకాశవంతమైనప్పుడే ఇది సాధ్యమవుతుంది. అప్పుడు మనం దేన్ని సృష్టించినా... దాన్ని ఆనందిస్తాం. మనలోని శ్రీబ్రహ్మదేవ సరస్వతీతత్త్వాన్ని జాగృతపరచడం వల్లనే ఇది సాధ్యమవుతుంది.



నాభి లేదా మణిపూర చక్రం: ఆకలితో ఉన్నప్పుడు ధ్యానంలో సరిగ్గా కూర్చోలేం. మంచి ఆహారం తిన్నప్పుడు ఆనందం కలుగుతుంది. అయితే ఈ ఆనందం తాత్కాలికమే. ఎందుకంటే దేన్నైనా సంపూర్ణంగా ఆనందించినప్పుడు... మళ్ళీ కావాలని కోరుకోకుండా ఉండాలంటే, ఆ ఆనందం శాశ్వతం కావాలనుకుంటే... సంతృప్తి ఒక్కటే మార్గం. రెండు ముద్దలు తిన్నా సంతృప్తి చెందాలి. మనలో వస్తు సంబంధమైన కోరికలకు అంతులేదు. ఇంకా ఇంకా కావాలనుకుంటాం. ఏదీ సంపూర్ణంగా ఆనందించలేం. దీనివల్ల నాభిచక్రం అలజడికి లోనవుతుంది. దాన్ని అరికట్టే మార్గం సంతృప్తే. అది పొందాలంటే ఆత్మసాక్షాత్కారం పొందాలి. నిత్య ధ్యాన సాధన ద్వారా మనలోని శ్రీలక్ష్మీనారాయణ శక్తిని జాగృతం చేసుకోవడం ద్వారా ఇది సాధ్యపడుతుంది.

అనాహత చక్రం: మనలో ఉండే చక్రాలలో చాలా ముఖ్యమైనది అనాహత లేదా హృదయ చక్రం. దీనిలోని విశిష్టత... భద్రత. మీలో భద్రతా భావాన్ని అనుభూతి చెందడం. అది ఆత్మసాక్షాత్కారం పొందితేనే జరుగుతుంది. మీకు సంబంధించి సంపూర్ణమైన భద్రతతో ఉండేది మీలోని ఆత్మ మాత్రమే. దాన్ని మీరు ఆస్వాదించినప్పుడు కలిగే ఆనందం... మిమ్మల్ని ఆధ్యాత్మికమైన లోతులకు తీసుకువెళ్తుంది. భగవంతుడి మీద విశ్వాసాన్ని మీ హృదయ చక్రంలో పదిలపరచుకోండి. ఆ విశ్వాసమే రక్షణలోని ఆనందాన్నిస్తుంది. అందుకోసం మన హృదయంలో జగదంబ అయిన దుర్గాదేవిని స్థిరపరుచుకోవాలి.

విశుద్ధి చక్రం: విశుద్ధ చక్రాన్ని... విశుద్ధి, హంస చక్రాలు అని రెండుగా విభజించవచ్చు. విశుద్ధి చక్రం అంటే విరాట్ స్వరూపమైన చక్రం. ప్రతివారిలోని ఆత్మను మనం అనుభూతి చెందాలి. అప్పుడే విశ్వవ్యాపితమైన మాధుర్యం, సంబంధ బాంధవ్యాల్లో ఉండే మాధుర్యం మనకు తెలుస్తాయి. ఈ సామూహిక చేతనను, విశ్వజనీతనను అనుభూతి చెందినప్పుడు... ఆ విరాట్ స్వరూపంలో అంతర్భాగం అవుతాం. అన్నిటికీ సాక్షిగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. దీన్ని పొందాలంటే... సహజయోగ సాధన ద్వారా... శ్రీకృష్ణుడి గుణగణాలను మనలో స్థిరపరచుకోవాలి. ఇక హంస చక్రం... విశుద్ధ చక్రంలో భాగం. హంస పాలను, నీటిని విడదీయగలిగినట్టు... ఈ చక్రం మనలో విచక్షణాభావాన్ని పెంపొందిస్తుంది.

ఆజ్ఞా చక్రం: కాంతి లేదా ప్రకాశం అనేవి ఈ చక్రం తాలూకు తత్త్వం. ఇది మన చిత్తాన్ని తేజోవంతం చేస్తుంది. ఆత్మసాక్షాత్కారం తరువాత... మనం ప్రతి దాన్నీ ఈ కాంతి ద్వారానే చూస్తాం. మనమే కాంతి అనీ, శాశ్వతమైన ప్రకాశం అనీ తెలుసుకుంటాం. ఈ విషయం అర్థమైనప్పుడు... మనలోని భయాలు, మనల్ని తమ ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నం చేసే శక్తులు క్షణంలో అదృశ్యమవుతాయి. ఆజ్ఞాచక్రం తాలూకు ఆనందాన్ని మనలోకి ఆహ్వానించినప్పుడు... మనలోని కాంతి నిశ్చలమవుతుంది. ఆత్మప్రకాశం కలిగినప్పుడు... ప్రపంచాన్నంతటినీ మనలోనే చూసుకోగలం. ఇది సహజయోగతో సాధ్యమవుతుంది.


సహస్రార చక్రం: మన శరీరంలోని సూక్ష్మనాడీ వ్యవస్థలో ఆఖరి చక్రం సహస్రారం. ఇది చాలా కీలకమైనది. మొత్తం ఏడు చక్రాలూ వాటి పీఠాలను అక్కడే కలిగి ఉన్నాయి. ఈ పీఠాలు ఆనందాన్ని స్వీకరించి, హృదయానికి అందిస్తాయి. మనం ధ్యానం ద్వారా సహస్రార చక్రాన్ని చేరుకోగలగాలి. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత సహస్రార చక్రం జాగృతం అవుతుంది. శ్రీలలితా

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



నక్సలిజం నుంచి ఐఏఎస్ వరకూ... హేతువాదం నుంచి అరుణగిరి వరకూ... **మాడభూషి మదన్ గోపాల్** జీవితంలో ఎన్నో మలుపులు. 'రెయిన్ బో ఇయర్స్' ద్వారా 1960ల్లో యువతపై వామపక్ష భావజాల ప్రభావాన్ని చర్చించినా...'కాంచన్‌జంగా డైరీస్'లో హిమాలయారోహణ విశేషాలను కళ్ళకు కట్టినట్టు వర్ణించినా... ప్రతిదీ తన జీవితంలోంచే వచ్చిందని చెబుతాయన. ఆధ్యాత్మికత వైపు తన పయనం గురించి 'నివేదన'తో ఆయన పంచుకున్న అనుభవాలివి.

'నువ్వు' లేవనేది తెలుసుకో...



మీరు మార్క్సిస్ట్ నుంచి బ్యూరోక్రాట్ అయ్యారు. నాస్తికత్వం నుంచి అరుణాచల రమణమహర్షి మార్గంలోకి వెళ్ళారు. ఇంత వైరుధ్యం ఎలా వచ్చింది.

నాస్తికత్వం అని చెప్పలేను. అగ్నాస్టిక్ అని చెప్పాలి. ప్రతిదాన్నీ ప్రశ్నించే తత్వం మొదటి నుంచీ ఉండేది. మా నాన్నగారు ప్రొఫెసర్ మాడభూషి వెంకటాచారి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మా ఇంట్లో మతపరమైన పూజల్లాంటివి మేము ఎప్పుడూ చెయ్యలేదు. ఎప్పుడో దీపావళి వస్తే నలుగురితోపాటు టపాకాయలు కాల్చడం, సంక్రాంతి వస్తే గాలిపటాలు ఎగరెయ్యడం... అంతే. ఇక చిన్నప్పటినుంచి కవితలు, కథలు రాసేవాణ్ణి. అభ్యుదయ రచయితల సంఘం తరఫున రాంభట్ల కృష్ణమూర్తిగారు మాలాంటి వారి రచనలతో పుస్తకాలు కూడా వేశారు. హేతువు పరిశీలించకుండా దేన్నీ నమ్మకపోవడం, మూఢనమ్మకాలను, అనవసరమైన కర్మకాండలను వ్యతిరేకించడం అనేది అప్పటి నుంచీ ఉండేది.

ఆధ్యాత్మికం, నక్సలిజం మిమ్మల్ని ఎలా ఆకర్షించాయి?

నేను సిద్దిపేట నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు ఉస్మానియా యూనివర్సిటీలో చాలామంది నాకు పరిచయం అయ్యారు. అప్పుడే మార్క్సిస్ట్- లెనినిస్ట్ (ఎంఎల్) రాజకీయాలపట్ల ఆకర్షితుణ్ణి అయ్యాను. ఒక పక్క చలం, మరో పక్క ఎంఎల్ మూవ్‌మెంట్... రెండూ సమాంతరంగా సాగాయి.

మరి అరుణాచలం ఎలా పరిచయమయింది?

చలంగారి సాహిత్యం ఎక్కువగా చదివేవాణ్ణి. విగ్రహారాధన, కర్మకాండలు, సమాజంలో ఉన్న వైరుధ్యాలను ఆయన తీవ్రంగా ఖండించేవారు. నేను 9-10 తరగతుల్లో ఉన్నప్పుడే... అరుణాచలంలో ఉన్న ఆయనకు ఉత్తరాలు రాసేవాణ్ణి. నా మనసులో ఉన్న ప్రశ్నలన్నీ ఆయనకు పంపేవాణ్ణి. ఆయన ఎప్పటికప్పుడు జవాబు ఇచ్చేవారు. "ఇన్ని ప్రశ్నలు వేస్తున్నావ్. ఇక్కడికి వస్తే ఇంకా తెలుసుకోవచ్చు" అని ఒకసారి ఆయన రాశారు. మర్నాడే అరుణాచలం వెళ్ళాను. అక్కడి వాతావరణం, కులమతాలకు అతీతంగా అందరినీ ఒకేలా చూసే తీరు... ఆ ఆత్మీయత నన్ను ఆకట్టుకున్నాయి. అప్పటివరకూ అక్కడొక కొండ ఉంది, ఒక గుడి ఉంది అని కూడా నాకు తెలీదు. చలంగారి ఇంటికి వెళ్ళేసరికి నా వయసు పంతొమ్మిది సంవత్సరాలు.

'దేవుడు లేడు' అనే స్థితి నుంచి 'ఉన్నాడ'నే నమ్మకానికి వచ్చారా?

దేవుడు అంటే... ఒక రూపం ఉంటుందని అప్పుడూ అనుకోలేదు. ఇప్పుడూ అనుకోవడం లేదు. ఆధ్యాత్మికత, మతం... ఈ రెండూ ఒకటి కావనే భావన నాలో మొదటినుంచీ స్థిరపడిపోయింది. రమణ మహర్షి రచనలు చదవడం మొదలుపెట్టిన తరువాత... 'నేను అనేది లేదు' అని ఆయన చెప్పిన మాట నన్ను ఆకర్షించింది. 'నేను' అనేది లేకపోతే... ఇక ఉండేది ఏమిటి? అనే ప్రశ్న మొదలయింది. 'నేను లేను' అనే భావనను అనుభూతి చెందిన తరువాత... ఏ రకమైన సిద్ధాంతాన్నీ నమ్మడానికి మనసు ఒప్పుకోదు. మరి నేను లేకపోతే... ఉన్నది ఏమిటి? అస్థిత్వం, ఉనికి... ఇవేవీ ఉండవు కదా! ఆ భావన ఏర్పడిన తరువాత... నిర్వికల్ప భావం వస్తుంది. ఒక పని చేస్తాం. దాని మీద శ్రద్ధ పెడతాం. దానితో అటాచ్‌మెంట్ మాత్రం ఉండదు. అలాగని కర్మ చెయ్యవద్దని రమణ మహర్షి ఎప్పుడూ చెప్పలేదు. నేను సన్యాసిద్దామనుకుంటున్నానని తన దగ్గరకు వచ్చినవాళ్ళు ఎవరినీ ప్రోత్సహించలేదు."నిన్నటిదాకా నువ్వు సంసారిని అన్నావు. ఇప్పుడు సన్యాసిని అంటున్నావు. ముందు నువ్వెవరివో తెలుసుకో" అని చెప్పేవారు. అది తెలుసుకోవడం కష్టం. మనం ఎవరినైనా మోసం చెయ్యవచ్చు కానీ మన ఆత్మను మోసం చెయ్యడం చాలా కష్టం.

> **అరుణాచలం వెళ్ళాక... మీకు ఎదురైన అనుభవాలేమిటి?**
>
> నేను నక్సల్ ఉద్యమంలో ఉంటూనే... చలంగారి దగ్గరకు వెళ్ళేవాణ్ణి. రమణ మహర్షి రచనలు చదివేవాణ్ణి. జిడ్డు కృష్ణమూర్తి లాంటివారిని కలిసేవాణ్ణి. ఈ క్రమంలోనే "నేను ఏం చేస్తున్నాను? ఎటు వెళ్తున్నాను? మనం చేసే పనికి ఏదైనా అర్థం ఉందా? జీవితానికి ప్రయోజనం ఏమిటి?" అనే ప్రశ్నలు నాలో మొదలయ్యాయి. ఎప్పుడైనా సమాధానాలు చాలానే వస్తాయి. కానీ ప్రశ్న రావడం కష్టం. ఎవరైనా సమాధానాల కోసం వెతుకుతారు కానీ ప్రశ్నల కోసం వెతకరు. నాలో నుంచి ప్రశ్న వచ్చినప్పుడు సమాధానం కూడా నాలోంచే వస్తుంది. రమణ మహర్షి చెప్పింది కూడా అదే... "నిన్ను నువ్వు తెలుసుకో" అని. అంటే "నువ్వు లేవనేది తెలుసుకో" అని. మనం ఎవరు? అనే ప్రశ్నలోంచే మనం ఎవరనే సమాధానం వస్తుంది. ఇక రమణాశ్రమ అనుభవాల విషయానికి వస్తే... అక్కడ ఆయన ఉనికిని మనం అనుభూతి చెందుతాం. ఒకసారి నేను చలంగారి ఇంటి గెస్ట్‌హౌస్‌లో నిద్రపోతున్నాను. అర్థరాత్రి సమయంలో... అరుణాచల శిఖరం మీదనుంచి ఒక అగ్నిగోళాన్ని ఎవరో నామీద విసిరేసినట్టు, అది నా గుండెను తాకినట్టు అనిపించింది. నేను లేచి అరవడం మొదలుపెట్టాను. అది కలో నిజమో తెలియని ఉద్వేగంలో ఉన్నాను. మిగిలినవాళ్ళందరూ లేచి... ఏమైందని అడిగారు. నా ఒళ్ళంతా వేడెక్కిపోయింది. చెమటలు పడుతున్నాయి. అది అనుభవమో, భ్రాంతో నాకూ తెలీదు. ఆ తరువాత నాకు తెలియకుండానే, నా ప్రయత్నం లేకుండానే నా జీవితంలో మార్పులు వచ్చాయి. అవి మంచా, చెడా అనేది పక్కన పెడితే... వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు... ఆ మార్పులు నాకే ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అరుణాచలం అనుభవాల తరువాత నాలో తలెత్తే ప్రశ్నల తీరే మారిపోయింది.

స్వానుభవం

ఆలయాలకు వెళ్తూ ఉంటారా?

ఆ అలవాటు లేదు. హిమాలయాలకు మాత్రం వెళ్తూ ఉంటాను. కైలాస మానస సరోవర్, నేపాల్‌లోని అన్నపూర్ణా శిఖరం... ఇలా చాలా చోట్లకు వెళ్ళాను. ఆ అనుభవాలతో 'కాంచన్‌జంగా డైరీస్' పుస్తకం రాశాను.

ఆ అనుభవాలు చెబుతారా?

2002లో అమర్‌నాథ్ వెళ్ళాను. చాలా చల్లగా ఉంది. పైకి ఎక్కుతున్నప్పుడు... సగం దూరం వెళ్ళేసరికి సొమ్మసిల్లే స్థితికి చేరుకున్నాను. పక్కన కూర్చున్నాను. కాషాయ దుస్తులు వేసుకున్న ఒక పెద్దాయన వచ్చి నా పక్కన కూర్చున్నాడు. "ఏమైంది?" అని అడిగాడు. "తల తిరుగుతోంది. మూర్ఛ వచ్చేలా ఉంది" అని చెప్పాను. జేబులోంచి ఏదో తీసి నాకు ఇచ్చాడు. అది మూలికో, కర్పూరమో... ఏమిటో నాకు తెలీదు. "ఇప్పుడు పడుకోవద్దు. పడుకుంటే చాలా సమస్య అవుతుంది. ఆక్సిజన్ అవసరం ఎక్కువవుతుంది. దీన్ని వాసన చూస్తూ ఉండు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆయన ఎవరో నాకు తెలీదు. ఇలాంటి అనుభవాలు నాకు చాలా ఉన్నాయి.

ఇప్పటికీ రమణాశ్రమం మీకు స్ఫూర్తిని ఇస్తూనే ఉందా?

తిరువణ్ణామలైలో నాకు ఇల్లు కూడా ఉంది. అయితే... ఎవరైనా వస్తామన్నప్పుడు ఒక్కటే చెబుతాను... "ఏదైనా కావాలని ఇక్కడికి రాకండి. దేన్నైనా పోగొట్టుకోవడానికి రండి" అని. నేను మొదటిసారి వెళ్ళినప్పుడు ఏదీ కోరుకోలేదు. ఆ ఆలోచన కూడా లేదు. చలంగారి కోసం వెళ్ళాను. తరువాత నాకు తెలియకుండానే నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. నేను ఎలాంటి ప్రయత్నం చెయ్యకుండానే... క్రమంగా నక్సలైట్ ఉద్యమానికి దూరమయ్యాను. అందరూ ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ కాలేజీలో స్ట్రైక్‌లు చేయించడం, గ్రూపులు కట్టడం లాంటి వ్యవహారాల్లో ఉండేవాణ్ణి. నాలాంటి బిలో యావరేజ్ స్టూడెంట్ సివిల్ సర్వీసెస్ రాయడం, సెలక్ట్ అవడం... ఇవన్నీ కూడా నాకు తెలియకుండానే జరిగిపోయాయి.


ఒక బ్యూరోక్రాట్‌గా వీటి ప్రభావం మీ వృత్తి మీద ఉందా?

చాలా పవర్ ఉందనుకున్న వాళ్ళతో కూడా 'నేను లేను' అనే ధోరణితోనే వ్యవహరించాను. 'ఎవరికైనా భయమైనా ఉంటుంది, ఆశైనా ఉంటుంది. ఇతనికి భయం లేదు, ఆశ లేదు' అనేది వాళ్ళకి అర్థమయింది. ఇక వాళ్ళు చేసేది ఏముంటుంది? ధైర్యంగా, నిష్పక్షపాతంగా పని చెయ్యడానికీ, నాకు సాధ్యమైనంతగా ప్రజలకు సేవ చెయ్యడానికీ ఇది దోహదపడింది.

సంభాషణ: కృష్ణశర్మ

సుభాషితం

అది అసాధ్యం



ప్రసహ్యమణి ముద్ధరే న్మకరవక్త్ర దంష్ట్రాన్తరాత్
సముద్ర మపి సంతరే త్ప్రచలదూర్మి మాలాకులమ్
భుజంగమపి కోపితం శిరసి పుష్పవద్ధారయేత్
న తు ప్రతినివిష్ట మూర్ఖ జన చిత్తమారాధయేత్

మూర్ఖమైన ఆలోచనలు ఉన్నవారిలో పరివర్తన తేవడం ఎంత కష్టమో తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు.

దాని అంతరార్థాన్ని... మకర ముఖాంతరస్థమగు మాణికమున్ బెకిలింపవచ్చు బా/యక చలదూర్మికా నికరమైన మహోదధి దాటవచ్చు మ/స్తకమున బూవుదండవలె సర్పమునైన భరింపవచ్చు మ/చ్చిక ఘటియించి మూర్ఖజన చిత్తము దెల్పనసాధ్య మేరికిన్... అనే పద్యంతో ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి సమర్పించాడు.

భావం: నేర్పు, ఓర్పు ఉంటే మొసలి నోట్లో ఉన్న మాణిక్యాన్ని సులభంగా తీయవచ్చు. ఎప్పుడూ భయంకరమైన అలలతో ఉధృతంగా ఉండే సముద్రాన్ని దాటవచ్చు. బుసలు కొడుతున్న విషసర్పాన్ని చాకచక్యంగా పట్టుకొని... మెడలో పూల దండలా ధరించవచ్చు. కానీ మూర్ఖుడి మనసు రంజింపజెయ్యడం కుదరని పని. అది ఎంతటి వారికైనా అసాధ్యం.



గీతాసారం

చైతన్య సాధన మార్గాలు

కర్ణుడు, అర్జునుడు... ఇద్దరూ కుంతికి జన్మించారు. కానీ వ్యతిరేక పక్షాల్లో నిలిచి పోరాడారు. కర్ణుడు శాపగ్రస్తుడు. ఆ కారణంగా... అర్జునుడితో సాగించిన కీలకమైన పోరాటంలో... కర్ణుడి జ్ఞానం, యుద్ధ అనుభవం అతనికి ఉపయోగపడలేదు. యుద్ధంలో ఓడిపోయాడు, హతుడయ్యాడు. ఈ పరిస్థితి మనకందరికీ వర్తిస్తుంది. మనమూ తరచుగా కర్ణుడిలాగానే ఉంటాం. జీవితంలో మనం చాలా నేర్చుకుంటాం. జ్ఞానాన్నీ, అనుభవాన్నీ పొందుతాం. కానీ కీలకమైన సమయాల్లో మనం అవగాహనకు బదులు మన ప్రవృత్తులను బట్టి ఆలోచిస్తాం. పని చేస్తాం. ఎందుకంటే మన అవగాహన అవసరమైన స్థాయికన్నా తక్కువగా ఉంటుంది.

శ్రీకృష్ణుడికి దీని గురించి పూర్తిగా తెలుసు. కాబట్టే వివిధ కోణాల నుంచి వాస్తవికతను, సత్యాన్నీ 'భగవద్గీత'లో పదేపదే వివరించాడు. తద్వారా లోతైన అవగాహనలో అవసరమైన స్థాయికి చేరుకోవాలన్నాడు. ఒక నదికి ఉండే రెండు తీరాల్లా... మనలో అంతరాత్మ, భౌతిక శరీరం అనే రెండు భాగాలున్నాయని 'భగవద్గీత' చెబుతుంది. సాధారణంగా మనం మన భౌతిక శరీరం, మన భావోద్వేగాలు, ఆలోచనలు మన చుట్టూ ఉన్న ప్రపంచంతో కూడిన బాహ్య భాగం ద్వారా గుర్తింపు పొందుతూ ఉంటాం. అలాకాకుండా అన్ని జీవుల్లో ఉన్నది, శాశ్వతమైనది, మార్పు లేనిది అయిన మన అంతరాత్మను గుర్తించమన్నాడు శ్రీకృష్ణుడు. ఆత్మజ్ఞాని అంతరాత్మ అనే ఒక ఒడ్డు చేరుకొని... ఇక్కడ ఉన్నది కేవలం ఒక్క ఒడ్డు మాత్రమేననీ, అవతలి ఒడ్డు అనేది తాడును పాముగా భ్రమించడం... అంటే 'రజ్జు సర్ప భ్రాంతి' అనీ తెలుసుకుంటాడు.

ద్వంద్వాలను అధిగమించడం (ద్వంద్వాతీత), గుణాలను అధిగమించడం (గుణాతీత), సమానత్వం, 'మనం కర్తలం కాదు, సాక్షులం' అని గ్రహించడం, కర్మ నుంచి కర్మ ఫలాలు స్వతంత్రమైనవనే అవగాహన అనేవి చైతన్య సాధన మార్గాలు. వంద పుస్తకాలు చదవడం కన్నా భగవద్గీతను (ముఖ్యంగా రెండవ అధ్యాయాన్ని) చాలాసార్లు చదవడం మంచిది. ఎందుకంటే ప్రతిసారీ గీతాపఠనం మనలో విభిన్నమైన రుచిని, భావనను, మెరుగైన సాక్షాత్కారాన్నీ కలిగిస్తుంది. ఆనందాన్ని ప్రవహింపజేస్తుంది.



కె. శివప్రసాద్
ఐఏఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/McusKb6లో చదవండి.







ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో వినయంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలోచనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.







బిజినెస్

2 రోజుల్లో రూ.21 లక్షల కోట్లు

భారీగా పెరిగిన మార్కెట్ సంపద .. మరో 692 పాయింట్ల లాభంతో 75,000 ఎగువకు సెన్సెక్స్

- 201 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అదానీ షేర్లలో కొనసాగిన ర్యాలీ



హెరిటేజ్ షేరు మరో 10% అప్

ముంబై: కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుపై రాజకీయ అనిశ్చితి తొలగిపోవడంతో పాటు నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో రోజూ ర్యాలీ కొనసాగింది. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 915.49 పాయింట్ల వరకు పెరిగి 75,297.73 వద్దకు చేరుకున్నప్పటికీ, చివర్లో 692.27 పాయింట్ల లాభంతో 75,074.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 290 పాయింట్ల మేర బలపడినప్పటికీ, 201.05 పాయింట్ల లాభంతో 22,821.40 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్ల కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రెండు రోజుల్లో రూ.21.05 లక్షల కోట్లు పెరిగి రూ.415.89 లక్షల కోట్లకు చేరుకుంది. ఎన్‌డీఏలోనే కొనసాగడంతో పాటు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో బుధవారం సెన్సెక్స్ 2,303.19 పాయింట్లు, నిఫ్టీ 735.85 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 4.07 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 4.04 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కాగా, హిందుస్థాన్ యూనిలీవర్ 2.04 శాతం క్షీణించింది.
- బ్లూచిప్‌లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.06 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.28 శాతం పెరిగింది. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలూ పాజిటివ్‌గా ముగిశాయి. రియల్టీ 4.85 శాతం ఎగబాకగా.. ఇండస్ట్రియల్స్ సూచీ 3.69 శాతం పుంజుకుంది. పవర్, ఐటీ, యుటిలిటీస్, ఎనర్జీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి.
- వరుసగా రెండో రోజూ అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 9 లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 5.10 శాతం వృద్ధి చెందగా.. అదానీ టోటల్ గ్యాస్ 3.97 శాతం, ఎన్‌డీటీవీ 3.70 శాతం, అదానీ పవర్ 3.17 శాతం, అదానీ విల్మర్ 3.05 శాతం, ఏసీసీ 2.56 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.13 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 1.99 శాతం, అంబుజా సిమెంట్స్ 1.77 శాతం పెరిగాయి. అదానీ పోర్ట్స్ మాత్రం 0.18 శాతం నష్టపోయింది. దాంతో అదానీ గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14.08 లక్షల కోట్లుగా నమోదైంది.
- రాయ్‌పూర్‌లో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి అదానీ పవర్ నుంచి రూ.3,500 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకున్న నేపథ్యంలో బీహెచ్ఈఎల్ షేరు ఒక దశలో 15 శాతం వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 8.97 శాతం లాభంతో రూ.278.15 వద్ద ముగిసింది.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు క్షీణించి 83.49 వద్ద ముగియగా.. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.09 శాతం పెరిగి 78.43 డాలర్ల వద్ద ట్రేడైంది.
- దేశీయంగా విలువైన లోహాల ధరలు మళ్లీ పెరిగాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రూ.680 పెరుగుదలతో రూ.73,500కు చేరుకుంది. కిలో వెండి రూ.1,400 పెరిగి రూ.93,300 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 30.30 డాలర్ల వద్ద ట్రేడైంది.

మోదీ మూడో టర్మ్‌లో సెన్సెక్స్ @1,00,000

భారత స్టాక్ మార్కెట్లో ప్రస్తుతం కొనసాగుతున్న బుల్ ర్యాలీకి ఢోకా లేదని ప్రముఖ అంతర్జాతీయ ఈక్విటీ ఇన్వెస్టర్ మార్క్ మొబియస్ అన్నారు. ఎన్‌డీఏకు భారీ మెజారిటీ లభించకపోయినప్పటికీ, మోదీ మూడో టర్మ్ ముగియక ముందే సెన్సెక్స్ 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. వచ్చే పదేళ్లపాటు సెన్సెక్స్ 14-15 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని మొబియస్ అభిప్రాయపడ్డారు.

ఆంధ్రా షేర్లు జిగేల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో హెరిటేజ్ ఫుడ్స్ షేరు వరుసగా నాలుగో రోజూ లాభపడింది. బీఎస్ఈలో కంపెనీ షేరు మరో 10 శాతం పెరిగి సరికొత్త ఏడాది గరిష్ఠ స్థాయి రూ.601.60 వద్ద ముగిసింది. అలాగే, టీడీపీ మాజీ ఎంపీ జయదేవ్ గల్లాకు చెందిన అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో మరో 10 శాతం ఎగబాకి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,332.75 వద్దకు చేరుకుంది. చివరికి 4.91 శాతం లాభంతో రూ.1,275.65 వద్ద క్లోజైంది. ఏపీలో సిమెంట్ ప్లాంట్ కలిగిన కేసీపీ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో 19 శాతం వరకు పెరిగి రూ.238.70 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 8.82 శాతం లాభంతో రూ.219.60 వద్ద స్థిరపడింది. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు లిస్టెడ్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. అవంతీ ఫీడ్స్ 7.99 శాతం, ఆంధ్రా సిమెంట్స్ 3.23 శాతం, ఆంధ్రా పెట్రోకెమికల్స్ 6.89 శాతం, ఆంధ్రా షుగర్స్ 2.72 శాతం, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 3.89 శాతం పెరిగాయి.

వచ్చే జూన్ నాటికి 82,000కు సెన్సెక్స్!

భారత స్టాక్ మార్కెట్లో అత్యంత సుదీర్ఘ, బలమైన బుల్ ర్యాలీ కొనసాగుతోందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదికలో పేర్కొంది. 2025 జూన్ నాటికి సెన్సెక్స్ 82,000 మైలురాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. భారత స్థూల ఆర్థికాంశాలు అత్యంత సానుకూలంగా ఉన్న నేపథ్యంలో చాలా కంపెనీల షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్నాయంది. బీజేపీ నేతృత్వ ఎన్‌డీఏ మెజారిటీ దక్కించుకోవడంతో పాటు మూడోసారి అధికారంలోకి రానుండటం విధానపరమైన స్థిరత్వానికి భరోసా కల్పించనుందని, ఇది ఈక్విటీ మార్కెట్లకు సానుకులంగా పరిణమించనుందని అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలకు బాటలు వేయనున్నాయని, వచ్చే ఐదేళ్ల పాటు 20 శాతం చొప్పున ఆదాయ వృద్ధి నమోదు కావచ్చన్న మా అంచనాలకు మద్దతివ్వనున్నాయని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

డబ్ల్యూఈఎఫ్ టెక్ పయనీర్ జాబితాలో నెక్స్ట్‌వేవ్

మరో 10 స్టార్టప్‌లకు చోటు

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన 10 స్టార్టప్‌లకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) టెక్నాలజీ పయనీర్ 2024 జాబితాలో చోటు లభించింది. ఇందులో టెక్నాలజీ, ఎడ్యుకేషన్ రంగాల్లో కృషి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన నెక్స్ట్‌వేవ్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అరుదైన గౌరవం పొందిన తొలి ఎడ్‌టెక్ స్టార్టప్ ఇదే. కృత్రిమ మేధ (ఏఐ) నుంచి స్వచ్ఛ ఇంధన సొల్యూషన్లు, హెల్త్‌కేర్ ఇన్నోవేషన్, అంతరిక్షం, బయో టెక్నాలజీ, న్యూరో టెక్నాలజీ వరకు విభిన్న టెక్ రంగాల్లో పని చేస్తున్న 100 అగ్రగామి స్టార్టప్‌లతో డబ్ల్యూఈఎఫ్ ఈ జాబితా ప్రకటించింది. ఈ జాబితాలో ఉన్న ఇతర భారతీయ స్టార్టప్‌లలో పిక్సెల్, నిరామయ్, సర్వం ఏఐ, యాంపియెర్‌అవర్, క్రాపిన్, ఎంట్రీ, హెల్త్‌పిక్స్, ఇంటర్నేషనల్ బ్యాటరీ కంపెనీ, స్ట్రింగ్ బయో ఉన్నాయి.

వడ్డీ రేట్లు తగ్గించిన ఈసీబీ

ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరోపియన్ కేంద్ర బ్యాంక్ (ఈసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. కీలక వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.75 శాతానికి తగ్గించింది. 2019 తర్వాత ఈసీబీ వడ్డీ రేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి. వడ్డీ రేట్లు తగ్గించాలా? వద్దా? అని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్‌తో సహా అనేక దేశాల కేంద్ర బ్యాంకులు తర్జనభర్జనలు పడుతున్న సమయంలో ఈసీబీ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. కాగా శుక్రవారం నాడు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష వివరాలను వెల్లడించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▲	67,300 ▲	98,000 ▲
ముంబై	72,757 ▲	66,645 ▲	90,407 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	450
వరంగల్	432	గోదావరి	445
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	149
విశాఖపట్నం	135		

ప్రత్యేక కంపెనీగా ఐటీసీ హోటల్స్

- విభజనకు ఐటీసీ వాటాదారుల ఆమోదం

న్యూఢిల్లీ: ఐటీసీ హోటల్స్‌ను ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగా వేరు చేసేందుకు ఐటీసీ వాటాదారులు ఆమోదం తెలిపారు. వీడియో కాన్ఫరెన్సింగ్/ఇతర ఆడియో విజువల్ పద్ధతిలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన తీర్మానానికి 99.6 శాతం మంది వాటాదారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఐటీసీ హోటల్స్‌ను ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగా వేరు చేయాలని గత ఏడాది జూలైలో ఐటీసీ బోర్డు నిర్ణయించింది. గురువారం నాటి వాటాదారుల ఆమోదంతో ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఈ తీర్మానంతో ఐటీసీ హోటల్స్ ఈక్విటీలో 40 శాతం ఐటీసీ వద్ద, మిగిలిన 60 శాతం వాటా మదుపరుల వద్ద ఉంటుంది. ఈ డీమెర్జర్ కింద ప్రతి 10 ఐటీసీ షేర్లకు ఒక ఐటీసీ హోటల్స్ షేరు లభిస్తుందని సమాచారం.

6 లిస్టెడ్ కంపెనీలుగా వేదాంత

అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ ఆరు లిస్టెడ్ కంపెనీలుగా మారనుంది. ఎస్‌బీఐతో సహా 52 శాతానికి పైగా రుణదాతలు ఇందుకు ఆమోదం తెలిపినట్లు కంపెనీ తెలిపింది. మరో వారం పది రోజుల్లో మిగిలిన రుణదాతలూ ఇందుకు ఆమోదం తెలుపుతారని కంపెనీ భావిస్తోంది. ఆ తర్వాత కంపెనీకి చెందిన అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, స్టీల్ అండ్ ఫెర్రస్ లోహాలు, బేస్ మెటల్స్ వ్యాపారాలను ప్రత్యేక లిస్టెడ్ కంపెనీలుగా విభజిస్తారు. జింక్, కొత్తగా చేపట్టే వ్యాపారాలు మాత్రం వేదాంత లిమిటెడ్ పరిధిలోనే ఉంటాయి.

అనుమానాస్పద లావాదేవీల ‘పర్యవేక్షణ’పై జర జాగ్రత్త : సెబీ

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో రిటైల్ మదుపరుల ప్రయోజనాల కోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక చర్య తీసుకుంది. అసాధారణ లేదా అనుమానాస్పద లావాదేవీలను వెంటనే పసిగట్టడం, పర్యవేక్షించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్టాక్ ఎక్స్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్‌లు, డిపాజిటరీల వంటి మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థల (ఎంఐఐ)ను కోరింది. ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించింది. ఈ జరిమానాలు ఆయా సంస్థల వార్షిక ఆదాయం ఆధారంగా నిర్ణయిస్తామని తెలిపింది. వచ్చే నెల 1 నుంచే ఈ మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి.

కేఆర్ఏలకూ కొత్త నిబంధనలు: నో యువర్ కస్టమర్ (కేవైసీ) వ్యవస్థను సెబీ మరింత పటిష్ఠం చేస్తోంది. ఇందుకోసం ఈ పని చేసే కేవైసీ రిజిస్ట్రేషన్ సంస్థలు (కేఆర్ఏ)లు తమ వ్యవస్థలను సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ (సీకేవైసీఆర్ఆర్)తో అనుసంధానం చేసుకోవాలని కోరింది. ఖాతాదారులకు సంబంధించిన అన్ని విషయాలు నిర్ధారించుకున్న తరువాతే కేవైసీ వివరాలు నమోదు చేసే సంస్థలు ఆ వివరాలను కేఆర్ఏలు, సీకేవైసీఆర్ఆర్‌ల వెబ్‌సైట్లలోకి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచే ఈ నిబంధన అమల్లోకి రానుంది.

వివో ఎక్స్ ఫోల్డ్ 3 ప్రో స్మార్ట్‌ఫోన్



ధర రూ.1,59,999

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో.. మార్కెట్లోకి మేడిన్ ఇండియా ఎక్స్ ఫోల్డ్ 3 ప్రో విడుదల చేసింది. ఇది అత్యంత సన్నటి, తేలికైన, ఫోల్డబుల్ డిస్‌ప్లేతో కూడిన స్మార్ట్‌ఫోన్ అని వివో తెలిపింది. స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ 3 మొబైల్ ప్లాట్‌ఫామ్, 3 డీ అల్ట్రాసోనిక్ డ్యూయల్ స్క్రీన్ ఫింగర్‌ప్రింట్ స్కానింగ్, హెచ్‌డీఆర్ 10ప్లస్, డాల్బీ విజన్, ఎక్స్‌డీఆర్ ఇంజన్, వివో జెడ్ఈఐఎస్ఎస్ కో-ఇంజనీర్డ్ ఇమేజింగ్ సిస్టమ్, అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఈ ఫోన్ ప్రత్యేకతలు. 16 జీబీ ప్లస్ 512 జీబీ మెమొరీతో సెలెస్టియల్ బ్లాక్ కలర్‌తో అందుబాటులో ఉండనున్న ఈ ఫోన్ ధర రూ.1,59,999.

చదలవాడ ఇన్ఫ్రాటెక్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): బ్యాంకును మోసం చేసిన కేసులో చదలవాడ ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, ఒంగోలులో ఏకకాలంలో 8 ప్రాంతాల్లో ఈడీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. ఎస్‌బీఐ నుంచి రూ.166.93 కోట్లు రుణం తీసుకుని మోసం చేశారంటూ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చదలవాడ ఇన్ఫ్రాటెక్ సంస్థ డైరెక్టర్ చదలవాడ రవీంద్రబాబుతో పాటు మరికొందరిపై హైదరాబాద్ సీబీఐ గతంలో కేసు నమోదు చేసింది. దారి మళ్లించిన నిధులతో డైరెక్టర్లు, కుటుంబ సభ్యుల పేరిట ఆస్తులు కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. కేసు విచారణలో భాగంగా ఈడీ అధికారులు హైదరాబాద్ సహా ఒంగోలులోని ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో సాంకేతిక పరికరాలు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకును మోసం చేసిన కేసులో దర్యాప్తు జరుగుతోందని, అందులో భాగంగానే సోదాలు నిర్వహించినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు.

స్పోర్ట్స్

మెరుపు వీరుడి వీడ్కోలు



ఆఖరాట ఆడేసిన ఛెత్రి

భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి (39) తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 2005లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో బైచుంగ్ భూటియాకు గాయం కావడంతో ఆడే అవకాశం దక్కించుకొన్న ఛెత్రి మళ్లీ వెనుదిరిగి చూడలేదు. ఆకట్టుకొనే విన్యాసాలు చేయకపోయినా.. మెరుపు వేగం, కచ్చితమైన ఫినిషింగ్‌తో గోల్స్ చేయడం ఛెత్రి స్టైల్. సుదీర్ఘ కెరీర్‌లో 151 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన క్రిస్టియానో రొనాల్డో (128), ఇరాన్ ప్లేయర్ అలీ దై (108), లియోనెల్ మెస్సీ (106) తర్వాత సునీల్ (94) నాలుగో స్థానంలో నిలిచాడు.

క్రీడాకారుల కుటుంబం నుంచి..

1984, ఆగస్టు 3న సికింద్రాబాద్‌లో క్రీడాకారుల కుటుంబంలో ఛెత్రి జన్మించాడు. ఆర్మీలో పని చేసిన సునీల్ తండ్రి కేబీ ఛెత్రి కూడా ఫుట్‌బాలర్ కాగా.. తల్లి సుశీల నేపాల్ మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. సునీల్ బాల్యం మొత్తం డార్జిలింగ్‌లో గడిచింది. చిన్ననాటి నుంచి అనేక టోర్నీల్లో పాల్గొంటూ అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఇంగ్లిష్, హిందీ, నేపాలీ, బెంగాలీ, కన్నడ భాషలను అనర్గళంగా మాట్లాడగలడు. తెలుగు, కొంకణీ, మరాఠీ భాషలను అర్థం చేసుకోగలడు. ప్రముఖ ఫుట్‌బాలర్ సుబ్రతో భట్టాచార్య కుమార్తె సోనమ్‌ను 2017లో వివాహం చేసుకొన్నాడు.

వేగంగా ఎదిగి..

2004లో భారత అండర్-20 జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఛెత్రి.. వేగంగా సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2007, 2009, 2012లో భారత్ నెహ్రూ కప్ నెగ్గడంలో సునీల్‌ది కీలకపాత్ర. అంతేకాకుండా 2011, 2015, 2021, 2023ల్లో శాఫ్ చాంపిన్‌షిప్స్ అందుకొన్నాడు. 2008 ఏఎఫ్‌సీ చాలెంజర్స్ కప్‌లో ఛెత్రి మ్యాజిక్‌తో నెగ్గిన భారత్.. 27 ఏళ్ల తర్వాత ఏఎఫ్‌సీ ఆసియాకప్‌నకు అర్హత సాధించింది. కానీ, ఫిఫా వరల్డ్ కప్‌నకు అర్హత సాధించాలనుకొన్న అతడి కల మాత్రం నెరవేరలేదు. ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ తదితర క్లబ్‌లతోపాటు ఐఎస్ఎల్‌లో ముంబై సిటీ, బెంగళూరుకు ప్రాతినిధ్యం వహించాడు. స్పెయిన్ మాజీ ఆటగాడు డేవిడ్ విల్లాతో కలసి ఆడాలనే కోరిక ఉందని ఒక సమయంలో సునీల్ తెలిపాడు. కాగా, ఇంగ్లండ్‌లోని క్లబ్ తరఫున ఆడే అవకాశం దక్కినా.. వర్క్ పర్మిట్ రాకపోవడంతో వెళ్లలేకపోయాడు. 2011లో అర్జున అవార్డుకు ఎంపికైన సునీల్‌ను 2019లో ప్రభుత్వం ‘పద్మ శ్రీ’తో సత్కరించింది. 2021లో ఖేల్‌రత్న అవార్డు దక్కించుకొన్నాడు.

భారత్, కువైట్ మ్యాచ్ డ్రా

కోల్‌కతా: విజయంతో కెప్టెన్ సునీల్ ఛెత్రికి గ్రాండ్‌గా వీడ్కోలు పలకాలనుకొన్న భారత జట్టుకు నిరాశే ఎదురైంది. ఫిఫా వరల్డ్ కప్-2026 క్వాలిఫయర్స్‌లో భాగంగా గురువారం గ్రూప్-ఎ రెండో రౌండ్‌లో భారత్-కువైట్ మధ్య జరిగిన మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది. దీంతో మూడో రౌండ్‌కు చేరుకోవడం టీమిండియాకు మరింత సంక్లిష్టంగా మారింది. ఈ డ్రాతో 5 పాయింట్లు సాధించిన భారత్.. ఈనెల 11న జరిగే చివరి మ్యాచ్‌లో ఖతార్‌తో తలపడనుంది. కాగా ఛెత్రి కువైట్‌తో మ్యాచే తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని కొద్ది రోజుల ముందే ప్రకటించడంతో.. 68 వేల మంది కెపాసిటీ కలిగిన సాల్ట్ లేక్ స్టేడియం అభిమానులతో కిటకిటలాడిపోయింది. మ్యాచ్ ముగిసిన అనంతరం సునీల్ అభివాదం చేస్తూ వెళ్తుంటే.. ఫ్యాన్స్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.



నేటి మ్యాచ్

కెనడా x ఐర్లాండ్ (రా.8. గం.)

పాక్‌కు సూపర్ షాక్

యూఎస్ఏ రెండో విజయం



డాలస్: ఆతిథ్య యూఎస్ఏ జట్టు అంచనాలకు మించి అదరగొడుతోంది. తాజాగా మాజీ చాంపియన్ పాకిస్థాన్‌కే దిమ్మతిరిగేలా ‘సూపర్’ షాక్ ఇచ్చింది. గురువారం జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో 160 పరుగుల లక్ష్య ఛేదనను యూఎస్ జట్టు టైగా ముగించగా.. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. ఇందులో ఆమిర్ బౌలింగ్‌లో యూఎస్ బ్యాటర్లు జోన్స్, హర్‌ప్రీత్ కలిసి 19 రన్స్ చేయగా.. పేసర్ నేత్రావల్కర్ అద్భుత బౌలింగ్‌తో పాక్ వికెట్ నష్టానికి 13 పరుగులే చేసి ఓడింది. యూఎస్‌కిది రెండో విజయం. అంతకుముందు గ్రూప్ ‘ఎ’లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్ (44), షాదాబ్ ఖాన్ (40) రాణించడంతో పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. చివర్లో షహీన్ (23 నాటౌట్) వేగంగా ఆడాడు. ఆరంభంలో యూఎస్ బౌలర్ల ధాటికి పాక్ 26 పరుగులకే రిజ్వాన్ (9), ఉస్మాన్ ఖాన్ (3), ఫఖర్ (11) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో బాబర్-షాదాబ్ జోడీ నాలుగో వికెట్‌కు 72 పరుగులు జత చేశారు. అనంతరం ఛేదనలో యూఎస్ఏ 20 ఓవర్లలో వికెట్ నష్టానికి పరుగులు చేసింది. ఓపెనర్ మోనంక్ పటేల్ (50) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, గౌస్ (35)తో కలిసి రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించాడు. డెత్ ఓవర్లలో పాక్ బౌలర్లు పుంజుకోవడంతో చివరి 6 బంతుల్లో 15 రన్స్ అవసరమయ్యాయి. జోన్స్ (36 నాటౌట్) ఓ సిక్సర్ బాదగా ఆఖరి బంతికి నితీశ్ (14 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్ టైగా ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 159/7 (రిజ్వాన్ 44, షాదాబ్ 40, షహీన్ షా 23 నాటౌట్, నేత్రావల్కర్ 2/18)

అమెరికా: 20 ఓవర్లలో 159/3 (మోనంక్ పటేల్ 50, జోన్స్ నాటౌట్ 36, గౌస్ 35, నితీష్ కుమార్ నాటౌట్ 14, ఆమిర్ 1/25, నసీమ్ 1/26, హారిస్ 1/37).

స్టొయినిస్ ఆల్‌రౌండ్‌షో

- ఒమన్‌పై ఆసీస్ విక్టరీ
- టీ20 వరల్డ్‌కప్

బ్రిడ్జిటౌన్: మార్కస్ స్టొయినిస్ (36 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 67 నాటౌట్; 3/19) ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించడంతో టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా ఘనంగా బోణీ చేసింది. గురువారం ఒమన్‌తో జరిగిన గ్రూప్ ‘బి’ మ్యాచ్‌లో 39 పరుగుల తేడాతో కంగారూలు ఘనవిజయం సాధించారు. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 164 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (56) అర్ధసెంచరీ సాధించాడు. అయితే ఒమన్ బౌలర్ల ధాటికి ఆరంభంలో హెడ్ (12), మార్ష్ (14), మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చగా, ఆసీస్ 50/3 స్కోరుతో ఇబ్బంది పడింది. ఈ దశలో స్టొయినిస్ స్వేచ్ఛగా ఆడేస్తూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 15వ ఓవర్‌లోనైతే నాలుగు సిక్సర్లతో 26 రన్స్ రాబట్టాడు. అలాగే వార్నర్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేయడం విశేషం. ఆ తర్వాత ఛేదనలో ఒమన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేయగలిగింది. అయాన్ ఖాన్ (36) టాప్ స్కోరర్.స్టార్క్, జంపా, ఎల్లిస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా : 20 ఓవర్లలో 164/5 (స్టొయినిస్ 67 నాటౌట్, వార్నర్ 56; మెహ్రాన్ 2/38); ఒమన్: 20 ఓవర్లలో 125/9 (అయాన్ 36, మెహ్రాన్ 27; స్టొయినిస్ 3/19, స్టార్క్ 2/20, జంపా 2/24, ఎల్లిస్ 2/28).

క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్

జకార్తా: స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. లక్ష్యసేన్ తప్ప గురువారం బరిలో దిగిన ఇతర భారత ఆటగాళ్లంతా పరాజయంతో టోర్నీ నుంచి వైదొలిగారు. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ 21-9, 21-15తో కెంటా నిషిమోటో (జపాన్)ను చిత్తు చేశాడు. ఇక ప్రియాన్షు రజావత్ 10-21, 17-21తో విటిడ్‌శర్న్ చేతిలో పోరాడి ఓడాడు. మహిళల డబుల్స్ రౌండ్-16 పోరులో గాయత్రి/ట్రీసా ద్వయం 21-19, 19-21, 19-21తో మట్సుమోటో/నగహారా (జపాన్) జంట చేతిలో ఓటమి చవిచూసింది. అశ్వినీ పొన్నప్ప/తనీషా క్రాస్టో 13-21, 19-21తో హ నా బేక్/సొ హీ లీ (దక్షిణ కొరియా) చేతిలో పరాజయం పాలైంది. ఇక మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో సుమిత్/సిక్కిరెడ్డి 9-21, 11-21తో సిపీ జెంగ్/యోంగ్ (చైనా) చేతిలో ఓటమి పాలైంది.

స్వియటెక్ x పౌలిని



సెమీస్‌లో గాఫ్ ఓటమి
ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియటెక్ ఫ్రెంచ్ ఓపెన్‌లో హ్యాట్రిక్ కొట్టేందుకు మరో మ్యాచ్ దూరంలో నిలిచింది. శనివారం జరిగే మహిళ సింగిల్స్ ఫైనల్లో 12వ సీడ్ జాస్మిన్ పౌలినితో స్వియటెక్ అమీతుమీ తేల్చుకోనుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో పోలెండ్‌కు చెందిన టాప్ సీడ్ స్వియటెక్ 6-2, 6-4తో మూడో సీడ్ కొకా గాఫ్ (అమెరికా)ను చిత్తు చేసింది. మరో సెమీస్‌లో 12వ సీడ్ జాస్మిన్ పౌలిని (ఇటలీ) 6-3, 6-1తో అన్‌సీడెడ్ రష్యన్ టీనేజ్ సంచలనం మిరా ఆండ్రీవాపై సునాయాసంగా విజయం సాధించింది. 28 ఏళ్ల పౌలినికిది మొదటి గ్రాండ్‌స్లామ్ ఫైనల్. 2022, 2023లో చాంపియన్‌గా నిలిచిన ఇగా..ఈసారీ టైటిల్ సాధిస్తే హ్యాట్రిక్‌తో రికార్డు సృష్టిస్తుంది. ఈ విజయం రొలాండ్ గారోస్‌లో పోలెండ్ భామకు వరుసగా 20వది కావడం విశేషం. మరో వైపు గాఫ్‌పై తన రికార్డును 11-1కి స్వియటెక్ మెరుగుపరుచుకుంది. పురుషుల సింగిల్స్ రెండో సెమీఫైనల్లో ఏడో సీడ్ రూడ్ (నార్వే)తో జ్వెరెవ్ (రష్యా)తలపడతాడు. చివరి క్వార్టర్‌ఫైనల్లో జ్వెరెవ్ 6-4, 7-6 (5), 6-4తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)ని ఓడించాడు.

బోపన్న జోరుకు తెర..: భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం జోరుకు తెరపడింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ఇటలీకి చెందిన 11వ సీడ్ సిమోన్/ఆండ్రియా ద్వయం 7-5, 2-6, 6-2తో రెండో సీడ్ బోపన్న జోడీపై గెలుపొందింది.



ఉగాండా థ్రిల్లింగ్ విన్

3 వికెట్లతో పపువాపై గెలుపు ● ఎన్‌సుబుగా రికార్డు ఫీట్

ప్రావిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌లో ఉగాండా తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-సిలో గురువారం జరిగిన థ్రిల్లింగ్ ఫైట్‌లో ఉగాండా 3 వికెట్ల తేడాతో పపువా న్యూ గినీ (పీఎన్‌జీ)పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పీఎన్‌జీ 19.1 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలింది. హిరి హిరి (15), లెగా స్లకా (12), కిప్లిన్ డోంగా (12) మాత్రమే రెండంకెల స్కోరును అందుకొన్నారు. రంజాని, కీవుటా, మియాగి తలో రెండు వికెట్లు పడగొట్టారు. కానీ, 43 ఏళ్ల స్పిన్నర్ ఫ్రాంక్ ఎన్‌సుబుగా (4-2-4-2) పొట్టి కప్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. అనంతరం ఛేదనలో ఉగాండా 18.2 ఓవర్లలో 78/7 స్కోరు చేసి గెలిచింది. రియాజత్ అలీ (33) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అలీ నవో, నార్మన్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.

కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ

చంద్రబాబు గ్రీన్ సిగ్నల్.. నేటి ఎన్డీయే ఎంపీల భేటీ కోసం ఢిల్లీ పయనం



- రాష్ట్రపతిని కలిశాక రాత్రికి అమరావతికి
- మళ్లీ 9వ తేదీన హస్తినకు
- మోదీ ప్రమాణ స్వీకారానికి హాజరు
- అదే రోజు తిరిగి రాష్ట్రానికి పయనం
- 12న సీఎంగా పదవీ ప్రమాణం

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి వర్గంలో టీడీపీ చేరనుంది. మోదీ 9వ తేదీన మూడో సారి ప్రధానమంత్రిగా పదవీప్రమాణం చేయను న్నారు. ఆయనతో పాటు ఎన్డీయేలోని వివిధ భాగ స్వామ్య పక్షాలకు చెందిన కొందరు నేతలు మంత్రు లుగా ప్రమాణం చేస్తారు. లోక్‌సభలో విశ్వాస పరీక్ష నెగ్గాక కేబినెట్ విస్తరణ జరుగుతుందని.. ఆ సంద ర్భంగా ఇంకొందరికి మంత్రి పదవులు ఇస్తారని తెలు స్తోంది. కేబినెట్‌లో టీడీపీ చేరుతుందని ఆ పార్టీ అధి నేత చంద్రబాబు బుధవారమే ఢిల్లీలో వెల్లడించారు. లోక్‌సభ స్పీకర్ పదవి ఆ పార్టీకి దక్కే అవకాశం ఉందని కొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నా.. ఆ పద విని తామే ఉంచుకోవాలని బీజేపీ నాయకత్వం భావి స్తున్నట్లు సమాచారం. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో స్పీకర్ పదవిని మరొకరికి ఇవ్వరాదని ఆ పార్టీ అనుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే బెర్తులు, శాఖలపై ఇంకా పై స్థాయిలో చర్చలేవీ జరు గలేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఎన్డీయే ఎంపీల సమావేశం శుక్రవారం ఢిల్లీలో జరుగనుంది. ఆ సంద ర్భంగా వారు మోదీని తమ కూటమి పార్లమెంటరీ నేతగా ఎన్నుకుంటారు. తర్వాత ఎన్డీయే అగ్ర నేతలు, ఎంపీలంతా కలిసి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమవుతారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా అభ్యర్థిస్తారు. ఆమె పిలుపు అందగానే ఆదివారం సాయంత్రం మోదీ, కొందరు కేబినెట్ మంత్రులు ప్రమాణం చేస్తారు. కాగా.. ఎన్డీయే ఎంపీల సమావేశంలో పాల్గొనేందుకు చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. రాష్ట్రపతిని కలిసిన తర్వాత రాత్రికి అమరావతికి తిరిగి వస్తారు. శనివారం ఇక్కడే ఉండి పాలనా వ్యవ హారాల్లో పాల్గొంటారు. ఆదివారం మళ్లీ ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు. అదే రోజు రాత్రికి అమరావతి వచ్చేస్తారు. శుక్రవారం ఢిల్లీలో ఉన్న సమయంలో మంత్రివర్గ కూర్పుపై ఆయన బీజేపీ నాయకత్వంతో చర్చలు జరిపే అవకాశం ఉంది. వాస్తవానికి శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లా లని ఆయన మొదట అనుకున్నారు. తర్వాత మనసు మార్చుకుని గురువారం రాత్రే బయల్దేరారు. అక్కడ ఏవైనా మాట్లాడాలంటే సమయం చాలినంత ఉంటుం దన్న ఉద్దేశంతో ముందే వెళ్లారు.

బాబు ప్రమాణ స్వీకారానికి మోదీ

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సీఎంగా ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. టీడీపీ వర్గాలు దీనిని ధ్రువీకరించాయి. తన ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ప్రధానికి చంద్ర బాబు విజ్ఞప్తి చేయగా.. ఆయన అంగీకరించారు. ప్రధాని రాకను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని గురువారమిక్కడ తనను కలిసిన డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమానికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమం త్రులు కూడా హాజరు కానున్నారు. వారికి చంద్రబాబు స్వయంగా ఫోన్లు చేసి ఆహ్వా నిస్తున్నారు. హాజరయ్యే సీఎంల పేర్లు ఒకట్రెండు రోజుల్లో ఖరారవుతాయి. 12వ తేదీ ఉదయం పూటే ప్రమాణ స్వీకారం నిర్వహించాలని టీడీపీ వర్గాలు నిర్ణయించాయి. వేసవి వేడిమి ఇంకా తగ్గకపోవడంతో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉదయం 11 గంటలకు అటూ ఇటూగా జరపాలని అనుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి స్థలాన్వే షణ జరుగుతోంది. రాజధాని అమరావతి లోపల ఒక చోట, గుంటూరు-విజయవాడ రహదారి పక్కన మరోచోట పరిశీలించారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఒక ట్రెండు రోజుల్లో ఖరారయ్యే అవకాశం ఉంది.



సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీ బలరాం నాయక్, మంత్రి సీతక్క, తదితరులు

చంద్రబాబుకు రేవంత్ ఫోన్!

- కాబోయే ఏపీ ముఖ్యమంత్రికి అభినందనలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను సుహృద్భావ వాతావరణంలో పరస్పరం సహకరించుకుంటూ కలిసికట్టుగా పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం జూబ్లీహి ల్స్‌లోని తన నివాసంలో ఆయన మహబూబాబాద్ నియోజకవర్గ ఫలితాలపై మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, వి ప్ రామచంద్ర నాయక్, నియోజకవర్గ ఎమ్మెల్యేలతో రేవంత్ సమీక్షించారు. ఆ సమీక్ష సమావేశం నుంచే చంద్రబాబుకు ఫోన్ చేసి రేవంత్ మాట్లాడారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ(పెద్దపల్లి), బలరాం నాయక్(మహబూబాబాద్)లు గురువారం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎంపీలుగా ఎన్నికైన వారిని ఆయన అభినందించారు.

మీ సేవలు చాలు... దయచేయండి!

- ఒక్క ఆర్డర్‌తో 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఉద్వాసన

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'ఇక మీ సేవలు చాలు. దయ చేయండి. ప్రభుత్వానికి మీ సలహాలు అవసరం లేదు' అంటూ వైసీపీ ప్రభుత్వం నియమించిన సలహాదారులందరిని సాధారణ పరిపాలన శాఖ తొలగించింది. కేవలం ఒక్క ఆర్డర్‌తో 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఉద్వాసన పలికింది. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్‌కల్లాం, సీఎం నవరత్నాల సలహాదారు ఎం.శామ్యూల్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృ ష్ణారెడ్డి, దేవులపల్లిఅమర్, జీవీడీ కృష్ణమోహన్, నేమాని భాస్కర్, తదితరులు ఆ జాబితాలో ఉన్నారు. సజ్జల, జాతీయ మీడియా సలహాదారులు దేవులపల్లి అమర్ ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, మంత్రుల పేషీలో పనిచేస్తున్న సిబ్బందిని వారివారి మాతృ శాఖల్లో రిపోర్టు చేయాలని జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేశ్ కుమార్ ఆదే శాలు జారీ చేశారు. మంత్రుల వద్ద ఉన్న ఫైళ్లు, కంప్యూటర్లు, ఫర్నీచర్, స్టేషన రీలను ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అప్పచెప్పాలని సూచించారు.

కొత్త సీఎస్ నీరబ్‌కుమారా? విజయానందా?

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువు తీరు తున్న వేళ, అధికార యంత్రాంగాన్ని నడిపించే సీఎస్ పదవిలోకి ఎవరు రాబోతున్నారు? కొత్త సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారులు నీరబ్‌కుమార్, విజయానంద్‌ల్లో ఎవరిని చంద్రబాబు ఎంచుకోబోతున్నారు?.. ప్రభుత్వ ఉన్నత వర్గాల్లో ఇప్పుడు ఇదే చర్చ! సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి గురు వారం సెలవుపై వెళ్లిపోయారు. దీంతో కొత్త సీఎస్ ఎంపిక ప్రక్రియ వేగ వంతం అయింది. సీనియారిటీ ప్రకారం అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ముందువరసలో ఉంటారు. కాబట్టి, ఆయనకే చాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అయితే, ఆయన మరో 23 రోజుల్లో రిటైర్ కాబోతున్నారు. నీరబ్‌ను ఈ కొద్దికాలానికి సీఎస్‌గా నియమి ంచి, నెలాఖరున మళ్లీ మరొకరిని ఆ బాధ్యతల్లోకి తీసుకురావడం ఎందుకని చంద్రబాబు యోచిస్తున్నట్లు సమాచారం. అలాచూస్తే.. నీరబ్ ఆయన తర్వాత సీనియారిటీలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ముందు ఉన్నారు. ఒకవేళ నీరబ్‌ను కాదనుకుంటే విజయానంద్‌కే చాన్స్ ఉండొచ్చునని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. జగన్ ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవి చంద్రకు కొత్త ప్రభుత్వంలో సముచిత స్థానం లభించింది. ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శిగా నియమించారు. గురువారం సాయంత్రం చంద్రబాబును ఆయన నివాసంలో ముద్దాడ రవిచంద్ర కలిశారు. శని లేదా ఆదివారం ఆయన కొత్త బాధ్యతలు తీసుకోనున్నారు.

జనాలు జగన్‌ను నమ్మలేదు: బొత్స

విజయనగరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జనాలు జగన్‌ను నమ్మలేదని, చంద్రబాబునే నమ్మారని, అందుకే తాము ఓడిపోయామని తాజా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అంగీకరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించినా.. ప్రజలు మాత్రం అల్టిమేట్‌గా చంద్రబాబునే నమ్మారని, అందుకే ఇంతటి పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. ప్రజా తీర్పు ఏదైనా అందరూ గౌరవించాలని స్పష్టం చేశారు.

గెలుపోటములకు జగన్‌దే బాధ్యత: త్రిమూర్తులు

మండపేట, జూన్ 6: వైసీపీ గెలుపు, ఓటములకు బాధ్యత పార్టీ అధ్య క్షుడు జగన్‌దేనని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇందులో ఎవరినీ తప్పుపట్టాల్సిన అవసరం లేదన్నారు. సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినా ఫలితాలు వ్యతిరేకంగా రావడంపై సమీక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఘనవిజయం కూటమి ప్రభుత్వానికి అభినంద నలు తెలిపారు.

భలే చెప్పారు!

నిజమైన 'ఆంధ్రజ్యోతి' పాఠకుల పోల్స్

- కూటమికి 164... వైసీపీకి 11
- కచ్చితమైన అంచనా వేసిన 13 మంది
- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీకి భారీ స్పందన
- త్వరలో 'డ్రా' తీసి విజేతల ప్రకటన

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వాళ్లేం సెఫాలజిస్టులు కాదు! జ్యోతి ష్యులు అసలే కాదు. అయినా, జనం నాడి ఇదే అని తేల్చి చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమి గెలిచే, వైసీపీకి దక్కే సీట్లను వందశాతం కచ్చితత్వంతో అంచనా వేశారు. ఒకరూ ఇద్దరూ కాదు.. ఏకంగా 13 మంది 'ఆంధ్రజ్యోతి' పాఠకులు ఈ ఘనత సాధించారు. కూటమికి 164 సీట్లు వస్తాయని, వైసీపీ 11 స్థానాలతో సరి పెట్టుకుంటుందని ఎగ్జిట్ పోల్స్‌కంటే ముందే అంచనా వేశారు. ఈ ఎన్నికల్లో జనం నాడిని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ఒక వి నూత్నమైన ప్రయోగం చేసింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో అంచనా వేసి చెప్పాలంటూ పాఠకులను కోరింది. దీనికి పాఠకుల నుంచి భారీ స్పందన లభించింది. 13 మంది పాఠకులు కూటమికి 164, వైసీపీకి 11 స్థానాలు వస్తాయని కచ్చితత్వంతో అంచనా వేశారు. ఎగ్జిట్ పోల్స్‌కంటే ముందే వెలు వడిన 'పాఠకుల పోల్స్' ఇది! మొత్తం 13 మంది 'విజేత'లుగా నిలిచిన నేప థ్యంలో 'డ్రా' తీసి బహుమతులను అందించడం జరుగుతుంది.

వైసీపీ ఐపీఎస్‌లకు భంగపాటు

బాబు దర్శనమే దొరకని పీఎస్ఆర్, సంజయ్.. గేటు కూడా దాటనీయని సెక్యూరిటీ సిబ్బంది

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమం త్రిగా ముప్పైఏళ్లు ఉంటానన్న జగన్ అండ చూసు కుని మిడిసిపడిన ఆ అధికారులకు ఇప్పుడు పగలే చుక్కలు కనిపించడం మొదలైంది. ఓటరు దెబ్బకు అంచనాలన్నీ తలకిందులవడంతో ఇప్పుడు భూమిపై అడుగులేసేందుకు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. చంద్రబాబును ఆయన నివాసంలో కలిసేందుకు ప్రయత్నించిన 'ఏకపక్ష ఖాకీ'లకు భంగపాటు ఎదు రైంది. అపాయింట్మెంట్ లేకుండా వస్తే అనుమతించ బోమని సెక్యూరిటీ సిబ్బంది వారిని వెనక్కి పంపింది. వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామై వ్యవహరించారు పీఎస్ఆర్ ఆంజనేయులు. తప్పుడు కేసులు పెట్ట డంలో కీలక పాత్ర పోషించి ఢిల్లీ వరకూ చంద్ర బాబు పరువు తీసేందుకు యత్నించిన సీఐడీ ఏడీజీ సంజయ్, ఎందుకు అరెస్టు చేస్తున్నారో కనీసం నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి 74ఏళ్ల వయసులో చంద్రబాబును అరెస్టు చేసిన కొల్లి రఘురామిరెడ్డికి షాక్ తగిలింది. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు కొత్త ప్రభుత్వ అధినేత చంద్రబా బును కలిసేందుకు చేసిన ప్రయత్నం అవమానాలకు గురిచేసింది. చంద్రబాబును కలిసేందుకు ముందుగా అపాయింట్మెంట్ తీసుకోవాలన్న విషయం కూడా గ్రహించకుండా నేరుగా ఆయన నివాసానికి వచ్చారు. కరకట్టపైన సెక్యూరిటీ ఆయన వాహనాన్ని చూసి సీనియర్ ఐపీఎస్ అనే గౌరవంతో అనుమతిం చారు. అయితే రెండో గేటు వద్ద అనుమతి లేనిదే పంపలేమంటూ అడ్డుకున్నారు. లోపల కనుక్కోండి అంటూ పీఎస్ఆర్ సూచించడంతో, చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ అధికారిని వారు సంప్రదించారు. ఆ తర్వాత.. 'అపాయింట్మెంట్ ఉంటేనే అనుమతించమ న్నారు సర్' అంటూ ఆయనను సిబ్బంది వెనక్కి పంపించివేశారు. పీఎస్ఆర్ విజయవాడ పోలీస్ కమి షనర్‌గా ఉండగా మహిళలకు ఫోన్లు చేసి వివా దంలో చిక్కుకుని రాష్ట్రాన్ని వదిలి కేంద్ర సర్వీసులకు వెళ్లారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రా



పీఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్

నికి తిరిగొచ్చారు. వచ్చిన వెంటనే రవాణా శాఖ కమి షనర్‌గా బాధ్యతల్లోకి వచ్చారు. జేసీ, కోడెల కుటుం బాలను తీవ్ర వేధింపులకు గురిచేశారు. అనంతరం ఏసీబీ డీజీగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యుడు, విపక్ష ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను భయా నక పద్ధతుల్లో అరెస్టు చేసి టెర్రరైజ్ చేయాలని ప్రయత్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నంత వరకూ సరే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా జగన్ గెలుపుకోసం శక్తివంచన లేకుండా తెర చాటు ప్రయత్నాలు చేశారు. పసిగట్టిన ఎన్నికల కమి షన్ ఈడ్చి అవతల పడేయడంతో ఎలాంటి పోస్టింగ్ లేకుండా పోయింది. కాగా, ఆయన వలంటరీ ఉద్యోగ విరమణకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. అయితే, అందుకు అవకాశం లేకపోవడంతో శాశ్వతంగా ఉద్యో గాన్ని వదిలేయనున్నారని సమాచారం. దీంతో రెండే ళ్లకు పైగా సర్వీసు ఉన్న డీజీపీ ర్యాంక్ అధికారి శకం ఏపీ పోలీసు శాఖలో ముగిసిపోయినట్టేనని తెలు స్తోంది.

సంజయ్‌కి కరకట్ట వద్దే అడ్డుకట్ట..

వైసీపీ ప్రభుత్వంలో ముందూ వెనుకా చూసుకో కుండా చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించ డంలో కీలక పాత్ర పోషించిన సీఐడీ ఏడీజీ సంజయ్ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విదేశాలకు వెళ్లిపోయేందుకు సెలవు పెట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే కొందరు ఐపీఎస్, ఐఏఎస్‌లు సర్దు కొంటున్నారని వార్తలు రావడంతో....సంజయ్ సెలవు రద్దయింది. దీంతో చేసేది లేక గురువారం చంద్ర బాబు నివాసానికి నేరుగా వచ్చేశారు. అయితే, మొదటి గేటైన కరకట్ట గేటు వద్దే సెక్యూరిటీ సిబ్బంది ఆయనను ఆపేసింది. మర్యాద పూర్వకంగా కలిసేం దుకు వచ్చానని చెప్పినా, తమకు అందిన జాబితాలో పేర్లున్న వారినే అనుమతిస్తామని సెక్యూరిటీ స్పష్టంగా చెప్పేశారు. అయినా పక్కకు కదలకుండా ఆగి చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ అధికారితో మాట్లా డేందుకు ప్రయత్నిస్తూ అక్కడే అడ్డంగా కారు ఆపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందంటూ కానిస్టేబుళ్లు సంజయ్ వాహనాన్ని బలవంతంగా పక్కకు తీయించారు. .

కొల్లి విలవిల..

'చంద్రబాబు ఏ తప్పూ చేయకపోయినా ఏదో ఒకటి చూపించి కేసు పెడతా... ముందస్తు నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్టు చేస్తా...' అంటూ జగన్ ప్రభుత్వంలో విర్రవీగిన కొల్లి రఘురామి రెడ్డి విలవి ల్లాడుతున్నారు. జగన్ ప్రభుత్వంలో వైసీపీ అధ్యక్షుడి మనసులో ద్వేషాన్ని పసిగట్టి అందుకు అనుగుణంగా పనిచేసిన రఘురామిరెడ్డికి వైసీపీ ప్రభుత్వం ఏకంగా మూడు పోస్టులు ఇచ్చింది. ఐజీ ర్యాంకులో ఉన్న ఆయనకు డీజీ ర్యాంకు అధికారి పోస్టు అయిన విజి లెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఇచ్చారు. సీఐడీలో ఆర్థిక నేరాల విభాగం పరిధిలో ఏర్పాటు చేసిన సిట్‌కు అధిపతిని చేశారు. డ్రగ్ కంట్రోల్ విభాగం డీజీగా మరో పోస్టు కట్టబెట్టారు. అన్నీ వదిలి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చేయ్ అంటూ డీజీపీ గుప్తా బుధవారం పిలిపించడంతో విలవిలలాడిపోయారు. చంద్రబాబును కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తు న్నారు. కాగా, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి కూడా చంద్రబాబు అపాయింట్మెంట్ దొరక లేదు.

సెలవుపై సీఎస్ జవహర్‌రెడ్డి!

- సీఎస్‌గా కొనసాగేందుకు చివరిదాకా ప్రయత్నం
- సెలవుపై వెళ్లాలని ముందుగానే సంకేతాలు

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఎట్టకేలకు సెలవుపై వెళ్లారు. సెలవుపై వెళ్లాలని ముందే సంకేతాలు వెళ్లినా, కలవడానికి వెళ్లినప్పుడు చంద్రబాబు పట్టించుకోకపో యినా 'కొత్త ప్రభుత్వంలోనూ నేనే కొనసాగుతాను' అనే ధోరణిని జవహర్‌రెడ్డి ప్రదర్శించారు. చివరకు తత్వం బోధపడినట్టుంది. తనకు తానుగానే గురువారం సచివా లయం నుంచి నిష్క్రమించారు. ఆ వెంటనే...ఆయన పెట్టుకున్న సెలవుకు ఆమోదం లభించింది. జవహర్‌రె డ్డిని వైసీపీ ప్రభుత్వం 2022 డిసెంబరు 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ, ఇష్టారాజ్యంగా అధి కార యంత్రాంగాన్ని నడిపించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఆయన నేతృత్వంలోనే జరిగింది. ప్రస్తుతం ఎన్నికలు పూర్తి అయ్యాయి. జగన్‌ను దించేసి, కొత్త ప్రభుత్వానికి ప్రజలు జై కొట్టారు. సాధారణంగా ఎన్ని కల ఫలితాలు రాగానే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఇద్దరూ.. గెలిచిన పార్టీ అధినేతను కలవాల్సి ఉంటుంది. "మీరు అనుమతిస్తే కొనసాగుతాం. మీకు కొత్త ప్రయార్టీస్ ఉంటాయి కాదా" అని మర్యాదపూర్వ కంగా అడగాలి. ఇదీ పాలనా సంప్రదాయం. కౌంటింగ్ తర్వాత సీఎస్, డీజీపీ ఇద్దరూ చంద్రబాబును కలిశారు. కానీ, సీఎస్ జవహర్ రెడ్డి ఈ ఆఫర్ చేయలేదు. చంద్ర బాబు కూడా ఏమీ మాట్లాడలేదు. ప్రభుత్వం తననే సీఎస్‌గా కొనసాగిస్తుందన్న భావనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, చంద్రబాబు ఆయనతో మాట్లాడేం దుకు కూడా సుముఖత చూపలేదు. చంద్రబాబు ఇంటి దగ్గర నుంచి సచివాలయానికి జవహర్‌రెడ్డి వెళ్లారు. చంద్రబాబు కొత్త టీమ్‌లో ఉంటారని చెబుతున్న కొందరు అధికారులు... సీఎస్‌గా తప్పుకోవాలని జవహర్ రెడ్డికి అప్పుడే సంకేతాలు ఇచ్చారు. సెలవుపై వెళ్లాలని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఆయన మాత్రం తాను కుర్చీని వదిలేదే లేదన్నట్లు ప్రవర్తించారు. పైగా 'నేను మాట్లాడుకుంటాను' అని వారితో చెప్పినట్లు సమాచారం. కానీ చివరికి చంద్రబాబు ఉద్దేశాన్ని అర్థం చేసుకుని ఆయనే సెలవు పెట్టి వెళ్లిపోయారు.

కదలడానికి వీల్లేదు..

- వైసీపీ అధికారులకు స్పష్టీకరణ
- వెనక్కి వెళ్లాలనుకునే డిప్యుటేషన్ అధికారులకు చెక్
- విజయ్‌కుమార్ వినతికి నో
- వైసీపీ కార్యకర్తలాగే పనిచేసిన ఐ అండ్ పీఆర్ కమిషనర్
- కొత్త ప్రభుత్వం ఏర్పడే దాకా ఆగాల్సిందే...
- ఆయనకు తేల్చిచెప్పిన సీఎస్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి... ప్రభుత్వం మారగానే వెనక్కి వెళ్లాలని చూస్తున్న డిప్యుటేషన్ అధి కారులకు కళ్లెం పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు ఢిల్లీకి తిరిగి వెళ్లేందుకు సాధ్యం కాదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ మేరకు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి వినతిని తిరస్కరించారు. జగన్ ప్రభుత్వంలో ఆయన వైసీపీ కార్యకర్తలాగే పనిచేశారు. వైసీపీ సోషల్ మీడియా సిబ్బందికి తన శాఖ నుంచి జీతాలు చెల్లిం చారు. భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలకు తన శాఖలో కాంట్రాక్టు ఉద్యోగాలు వేయించారు. తిరిగి జగన్ ప్రభు త్వమే వస్తుందన్న అంచనాతో విజయ్‌కుమార్.. తన డిప్యుటేషన్ రెండేళ్ల పొడిగింపు కోరుతూ గత నెలలోనే సీఎస్ ద్వారా కేంద్రానికి విన్నవించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వెళ్లిపోతా అంటూ సీఎస్ వద్దకెళ్లి రిలీవ్ అడిగారు. అయితే, రిలీవ్, డిప్యుటేషన్‌కు పెట్టు కునే విజ్ఞప్తులను ఆమోదించరాదని సాధారణ పరిపా లన విభాగం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అందు లోనూ విజయ్‌కుమార్ నిర్వహించిన శాఖపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో తిరిగి వెనక్కి వెళ్లేందుకు విజయ్‌కుమార్ చేసిన విజ్ఞప్తిని సీఎస్ తిరస్కరించారు. 'కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా తిరిగి వెళ్లడం సాధ్యం కాదు.. అంత వరకూ ఆగాల్సిందే..' అని తేల్చిచెప్పారు.

మారిన చంద్రబాబును చూస్తారు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో కొందరు నా గురించి అభిప్రాయప డుతుంటారు. ఈసారి మారిన చంద్రబాబును చూస్తారు. అధికారులు తమ అభిప్రాయం చెబుతారు. ప్రజలు, పార్టీ నుంచి వచ్చిన అభి ప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నేను నిర్ణయం తీసుకొంటాను. చంద్రబాబు మారరు అని కూడా మీరు వింటుంటారు. ఇక ముందు అలా ఉండదు. మార్పు మీరే చూస్తారు. ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, పార్టీ నేతలు ఈ ఐదేళ్లలో ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్నారు. వేధింపు లకు గురయ్యారు. గొంతు మీద కత్తి పెట్టినా జై టీడీపీ అని మాట్లాడి ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తలు ఉన్నారు. అధికార పార్టీ ఎంత బల ప్రయోగం చేసినా పార్టీ మారకుండా నిలబ డ్డారు. ఇవన్నీ నా మనసులో నిలిచిపోయాయి. వారందరి పోరాటం, కృషి వల్లే ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చింది. అన్యాయం జరిగిన వారికి న్యాయం జరిగేలా చూస్తాను. బాధితుల గోడు, పార్టీ నేతల అభిప్రాయాలు ఇకపై నేనే వింటాను. ఏం చేయాలో నేనే చూస్తాను. పాల నలో రాజకీయ కోణం ఆవిష్కరిస్తాను' అని చంద్రబాబు అన్నారు. పార్టీ తరఫున గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు గీతలు గీసుకోకుండా కలిసి పనిచేయాలని కోరారు. ఎవరి పరిధులు ఏమిటో తాను నిర్ణయిస్తానని, ఆ ప్రకారం పని చేసి కార్యకర్తలకు, ఓట్లు వేసిన ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు కార్యాలయాలు ఏర్పాటు చేయిస్తా నని, అందులో ఉండి పనిచేయాలని చెప్పారు.

ఢిల్లీ టీమ్ బాగా పనిచేయాలి

ఈసారి ఎంపీల బృందం ఢిల్లీలో బాగా



ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

పనిచేయాలని, ప్రభావవంతంగా పనిచేసి ఫలితాలు సాధించాలని చంద్రబాబు కోరారు. 'ఈసారి గెలిచిన ఎంపీల పనితీ రుపై నాకు బాగా నమ్మకం ఉంది. గతంలో ఎర్రన్నాయుడు టీమ్ ఢిల్లీలో బాగా పనిచే సింది. ఇప్పుడు ఎన్నికైన టీమ్ కూడా అదే స్థాయిలో పనిచేసి చూపించాలి. రాష్ట్రానికి న్యాయం చేయాలి' అని ఎంపీలకు చంద్ర బాబు సూచించారు. గురువారం నాటికే కొందరు టీడీపీ ఎంపీలు ఢిల్లీ చేరుకోవ డంతో వారు జూమ్ ద్వారా ఈ సమావే శంలో పాల్గొన్నారు. ఢిల్లీలో ఈసారి చంద్ర బాబు పట్ల వ్యక్తమైన ఆదరణ చూసి తమ కళ్లను తామే నమ్మలేకపోయామని ఒక ఎంపీ వ్యాఖ్యానించినప్పుడు చంద్రబాబు నవ్వేశారు. పాత రోజుల్లోనూ ఇలాగే ఉండే దని ఆయన వ్యాఖ్యానించారు.

ఢిల్లీకి విమానంలో రావాలి

కొత్తగా గెలిచిన కొందరు ఎంపీల గురించి సమావేశంలో చంద్ర బాబు ప్రస్తావించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తనకు టికెటు వస్తుందా లేదా అన్నదానిని పట్టించుకోకుండా మనసు పెట్టి పనిచేశాడని, మంచి ఫలితం సాధించాడని ప్రశంసించారు. పార్టీలో సామాన్య కార్యకర్తలకు కూడా అవకాశాలు వస్తాయని నిరూపించడానికే విజయనగరం ఎంపీ సీటు మామూలు కింది స్థాయి నాయకుడైన కలిశెట్టి అప్పలనాయుడుకు ఇచ్చానన్నారు. ఆర్థికంగా ఆయన ఎంపీకి పోటీ చేసే పరిస్థితిలో లేకపోయినా నిల బెట్టి గెలిపించామని చెప్పారు. 'ఏం కలిశెట్టి... రాత్రికి ఢిల్లీకి విమా నంలో రావాలి. టికెటు కొనగలవా? నీకు ఇబ్బంది ఉంటే పార్టీ నుంచి టికెటు తెప్పిస్తా. నువ్వు పార్టీవాడివి. నీకు ఏ ఇబ్బంది ఉన్నా నీకు అండగా పార్టీ ఉంటుంది' అని చంద్రబాబు అన్నారు. ఎంపీలు బయటకు వచ్చిన తర్వాత కూడా కలిశెట్టి పట్ల చంద్ర బాబు చూపించిన ఆప్యాయత గురించి మాట్లాడుకొన్నారు.

కల్యాణ్ బాబు హ్యాట్సాఫ్

ఎన్నికల్లో గెలిచాక తొలిసారి చిరంజీవి ఇంటికి పవన్

- కుటుంబ సభ్యులందరి నుంచి అపూర్వ రీతిలో స్వాగతం
- ఎదురెళ్లిన చరణ్, హారతిచ్చిన సురేఖ
- తల్లి, అన్నా, వదినలకు జనసేనాని పాదాభివందనం

అచ్చమైన ఆప్యాయత పూల వర్షమై కురు స్తుండగా.. స్వచ్ఛమైన ప్రేమానురాగాలు నిండిన గుండెల నడుమ.. గౌరవాభిమానాలు పాదాభి వందనాలుగా మారిపోయాయి..! హర్షాతిరేకంతో ఆలింగనాలు వెల్లువెత్తగా.. భావోద్వేగాలతో కళ్లు చెమర్చాయి..! ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘన వి జయం అందుకున్న జన సేనాని పవన్ కల్యా ణ్‌కు సొంత కుటుంబ సభ్యుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సాగిన ఎన్డీఏ సమావేశంలో పాల్గొన్న అనంతరం పవన్ కల్యాణ్ తొలి సారిగా హైదరాబాద్‌లోని తన అన్నయ్య మెగా స్టార్ చిరంజీవి ఇంటికి వచ్చారు. దీంతో యావ త్ మెగా కుటుంబం ఆనందంలో మునిగిపో యింది. భార్య అన్నా లెజినెవా, కుమారుడు అకీరా నందన్‌తో కలిసి వచ్చిన పవన్‌ను కారు దిగిన వెంటనే అన్న కుమారులు, హీరోలు రాంచరణ్, వరుణ్‌తేజ్ కౌగిలించుకుని ఆహ్వానిం చారు. వదిన సురేఖ చేయి పట్టుకుని ఇంట్లోకి తీసుకువచ్చి వీరతిలకం దిద్దారు. అమ్మ అంజనా దేవి గుమ్మడికాయతో దిష్టి తీశారు. అక్కచెల్లెలు హారతిచ్చిన అనంతరం.. బయటకు వచ్చిన చిరంజీవికి పవన్ చెప్పులు విడిచి మరీ పాదాభి వందనం చేశారు. చిన్న తమ్ముడిని గట్టిగా హత్తుకుని చిరు ముద్దాడి.. భారీ పూలమాలను మెడలో వేశారు. ఈ దృశ్యం చూసి సోదరుడు నాగబాబు భావోద్వేగంతో కంటతడి పెట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో బాబాయ్ పవన్‌కు పుష్పగుచ్ఛం అందించిన రాంచరణ్ పాదాభివం దనం చేశారు. ఇంతలో ఆయన భార్య ఉపాసన రావడంతో అందరూ కలిసి గ్రూప్ ఫొటోకు పోజి చ్చారు. నాగబాబు, ఆయన భార్య, కుమారుడు వరుణ్‌తేజ్, ఆయన భార్య లావణ్య త్రిపాఠిలూ పవన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి అభి నందనలు తెలిపారు. అనంతరం "డియర్ కల్యాణ్ బాబు హ్యాట్సాఫ్" అని రాసి ఉన్న కేక్‌ను అమ్మ, వదినలతో కలిసి పవన్ కట్ చేశారు. పవన్-లెజినోవాలకు చిరంజీవి దంపతులు కొత్త దుస్తులు పెట్టారు. ఈ కార్యక్రమం అనంతరం పవన్ అమ్మ అంజనాదేవి, వదిన సురేఖకు పాదాభివందనం చేశారు. వేడుకలో మెగా ఫ్యామి లీ అంతా భాగమైనప్పటికీ.. నిర్మాత అల్లు అర వింద్, ఆయన కుమారుడు, హీరో అల్లు అర్జున్ మాత్రం కనిపించలేదు. మరోవైపు అకీరా నంద న్ తండ్రిపై రూపొందించిన ఓ వీడియోను రేణూదేశాయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. పవన్ నటించిన చిత్రాల్లోని పవర్‌ఫుల్ డైలా గ్‌లు, యాక్షన్ స్టిల్స్‌ను వాడుతూ.. మైకేల్ జాక్స న్ పాట 'దే డోంట్ కేర్ అబౌట్ అజ్'ను బ్యాక్ గ్రౌండ్‌లో ఉపయోగించారు. ఈ వీడియోను పవన్ అభిమానులు షేర్ చేస్తున్నారు. ఫలితా లకు ముందే దీనిని అకీరా ఎడిట్ చేశారని రేణూదేశాయ్ తెలిపారు.



పవన్‌తో కేక్ కట్ చేయిస్తున్న అంజనాదేవి, చిరంజీవి, సురేఖ

18,565 ఓట్ల ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వీడని ఉత్కంఠ
- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని కోటా ఓటు
- ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాసనమండలి నల్లగొండ-వరంగల్- ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయినా ఫలితం తేలలేదు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్)కు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడో స్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697 మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగో స్థానంలోకి వచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. మొత్తం 3,36,013 ఓట్లు పోలవగా.. గతానికి భిన్నంగా ఈ సారి అత్యధికంగా 25,824 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. చెల్లిన ఓట్లు 3,10,189 ఉండగా.. 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. అయితే, గెలిచేందుకు అవసరమైన కోటా ఓటు మొదటి ప్రాధాన్యం పరిధిలో ఎవరికీ రాకపోవడంతో గురువారం రాత్రి 9.30 నుంచి ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు మొదలైంది. ప్రక్రియంతా పూర్తయి ఫలితం వెలువడే సరికి శుక్రవారం రాత్రి అయ్యే అవకాశం ఉంది. ఆధిక్యంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ద్వితీయ ప్రాధాన్యంలో ఆయనకు 32,282 ఓట్లు, రాకేశ్‌రెడ్డి గెలవాలంటే 50,847ఓట్లు రావాల్సి ఉంటుంది.

బ్యాలెట్లపై సంతకాలు.. నినాదాలు!

బ్యాలెట్ పేపర్లపై జై కేసీఆర్, జై మల్లన్న, జై రాకేశ్ అని నినాదాలు రాయడం, అంకెలకు బదులు ఎక్స్ గుర్తు పెట్టడం, కొట్టివేయడం వంటి కారణాల వల్లే చెల్లని ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయని పార్టీల ఏజెంట్లు చెబుతున్నారు. కొన్నింటిపై లవ్‌యూ అని రాతలు రాశారని, కొందరు ఫోన్ నంబర్లు వేస్తే, కొన్ని బ్యాలెట్లపై సంతకాలు చేశారని పేర్కొంటున్నారు. కొందరైతే ఏకంగా ఫోన్ పే నంబర్లు రాసి డబ్బులు పంపించాలని కోరినట్లు వెల్లడించారు. చెల్లని ఓ కారణంగానే చివరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లు లెక్కించాల్సిన పరిస్థితి వచ్చింది.

మూడో రౌండ్ రీకౌంటింగ్ చేపట్టాలి: రాకేశ్‌రెడ్డి

"ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బ్యాలెట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నాయి. మా సందేహాలను రిటర్నింగ్ అధికారి పరిశీలించడం లేదు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు" అని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. మూడో రౌండ్ రీ కౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఎన్నికల అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆరోపించారు. తనపై ఆరోపణలు చేసే వారు వాటిని నిరూపించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన సూచించారు. పారదర్శకంగా కౌంటింగ్ సాగుతోందని తెలిపారు. చెల్లని ఓట్లతోపాటు అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్లే కౌంటింగ్ ఆలస్యమైందని వివరించారు. కాగా, లెక్కింపులో అవకతవకలు జరిగాయంటూ సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. మూడో రౌండ్‌లో రాకేశ్‌రెడ్డికి 533, నాలుగో రౌండ్‌లో 170 ఓట్ల మెజారిటీ వస్తే.. కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చినట్టుగా చూపించారని ఆరోపించారు. కాగా, కౌంటింగ్ సందర్భంగా బుధవారం రాత్రి తమ విధులకు ఆటంకం కలిగించారంటూ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఏఆర్‌వో కె.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

రెండు దశల్లో 'కొడంగల్' ఎత్తిపోతల

- రూ.4350 కోట్లతో నిర్మాణం.. త్వరలోనే టెండర్లు
- చెరువుల నిల్వ సామర్థ్యం 4 టీఎంసీలకు పెంపు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రెండు దశల్లో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలను తీర్చడానికి వీలుగా ఈ పథకాన్ని నిర్మించనుంది. తొలుత ఈ పథకం కింద ఉన్న చెరువుల నిల్వ సామర్థ్యాన్ని 0.9 టీఎంసీలతో ప్రతిపాదించగా.. తాజాగా 4 టీఎంసీలకు పెంచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. తాజా ప్రతిపాదనల ప్రకారం భూత్పూరు జలాశయం నుంచి ఊట్కూరు చెరువు దాకా నీటిని ఎత్తి పోస్తారు. అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువు దాకా నీటిని పంపింగ్ చేస్తారు. ఈ క్రమంలో ఊట్కూరు, జయమ్మ, కనుకుర్తి చెరువుల ఆధునీకీకరణ, నీటి నిల్వ పెంచడానికి వీలుగా మొదటి దశ పనులకు రూ.2945 కోట్లు వెచ్చించనున్నారు. ఇక రెండో దశలో జాజాపూర్, దౌలతాబాద్, బొమ్మరాసిపేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హుస్నాబాద్, కొడంగల్ చెరువుల సామర్థ్యాన్ని పెంచుతారు. గ్రావిటీ, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం చేపడతారు. ఈ పనులకు రూ.1404.50 కోట్లు కావాలని అంచనా వేశారు. మక్తల్‌లో 25,783, నారాయణపేటలో 20,472, కొడంగల్‌లో 53,745 ఎకరాలకు నీటిని అందించాలని ప్రతిపాదించారు. దాంతో పాటు 0.38 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించనున్నారు. మొత్తం నిర్మాణ వ్యయం రూ.4350కోట్లుగా అంచనా వేశారు. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రాజెక్టుకు అవసరమైన 38 కిలోమీటర్ల మేర సొరంగాల తవ్వకాలకు కనీసం 4-5ఏళ్లు పడుతుంది. అందుకే సొరంగాలకు బదులు ప్రెషర్ మెయిన్‌ల ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'గొర్రెల' కాంట్రాక్టర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న కాంట్రాక్టర్ మొహిదొద్దీన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనపై అక్రమంగా పెట్టిన కేసును కొట్టేయాలని పేర్కొంటూ అతడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు గురువారం తిరస్కరించింది. గొర్రెల పథకంలో భారీ కుంభకోణం జరిగినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కళ్యాణ్‌కుమార్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో రాంచందర్‌నాయక్ సహా ఆరుగురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన మొహిదొద్దీన్ దుబాయి పారిపోయాడు. తాజాగా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

నీట్(యూజీ)-2024 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విజయపరంపర



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించిన నీట్(యూజీ)-2024 ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. 720కి 720 మార్కులతో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 8 ఫస్ట్ ర్యాంకులు సాధించి నారాయణ విద్యాసంస్థలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించాయి. ఓపెన్ కేటగిరీలో సామ్ శ్రేయాస్ జోసెఫ్ ఆల్ ఇండియా 1వ ర్యాంకుతో సంచలన విజయం నమోదు చేసుకున్నారు. కె. సందీప్ చౌదరి, షాహ్, పి. ఆదిత్య కుమార్, శశాంక్ శర్మ, ఈషా కొఠారి, ప్రాచిత, దర్శ్ పగ్‌దార్ మొత్తం 8 మంది తమ విద్యార్థులు ఫస్ట్ ర్యాంకులతో ఆల్‌టైమ్ రికార్డు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా. పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ తెలిపారు. అలాగే 715 మార్కులు సాధించిన వారిలో 26 మంది నారాయణ విద్యార్థులు ఉడగా.. 710 ఆపైన మార్కులు సాధించిన వారిలో 45 మంది విద్యార్థులు ఉన్నారని వారు పేర్కొన్నారు. 700 ఆపైన మార్కులు సాధించిన వారు 105 మంది ఉన్నారన్నారు. నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన, రోజువారీ టెస్టులు నిర్వహించి ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు వారు తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌తో టచ్‌లో 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

(మొదటిపేజీ తరువాయి)

సీట్లలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ లాంటి పార్టీలో కొనసాగే విషయమై 'ఆత్మప్రబోధానుసారం' నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కాగా.. 'మరికొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చేది నేనే' అంటూ ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పుకొంటున్నారు. ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తారని అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇలాంటివారు 10 మందిపైగా కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని తెలిసింది. కాగా, ఎవరిని తీసుకోవాలి? ఎవరిని తీసుకోవద్దు? అనే అంశంపై సీఎం రేవంత్ స్పష్టతతో ఉన్నారు. అందరినీ చేర్చుకుంటూ పోతే, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి గురించి సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని, తద్వారా చెడ్డ పేరు వస్తుందని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారే యోచనలో ఉన్న ఎమ్మెల్యేల్లో ఎక్కువమంది జీహెచ్ఎంసీకి చెందినవారే. టీడీపీలో ఉండగా రేవంత్‌తో కలిసి పనిచేసి, టీఆర్ఎస్‌లోకి వెళ్లినవారు, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి మారినవారు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39 సీట్లు నెగ్గగా అందులో 16 జీహెచ్ఎంసీ పరిధివే. వీరిలోనే కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నెలాఖారుకల్లా వీరు పార్టీ మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఇప్పటికే ముగ్గురు జంప్!

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం) కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌ను కలిసినా.. ఆ తర్వాత వెనక్కుతగ్గారు. ఇదే సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక), సునీతాలక్ష్మారెడ్డి (నర్సాపూర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), కె.మాణిక్‌రావు (జహీరాబాద్) కూడా సీఎంను కలిశారు. వీరు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, వారు ఖండించారు. అభివృద్ధి పనుల కోసమే సీఎం వద్దకు వెళ్లినట్లు చెప్పారు. కాగా, పార్లమెంటు ఎన్నికలు రావడంతో దాదాపు మూడు నెలలుగా ఫిరాయింపులు ఆగాయి. ఎమ్మెల్యేలు చడీ చప్పుడు చేయలేదు. ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా కూడా ఉన్న సీఎం రేవంత్ నుంచి అనుమతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, దీనిపై వేం నరేందర్‌రెడ్డి కాస్త చొరవ తీసుకుంటున్నారు. కాంగ్రెస్‌లో చేరే యోచన ఉన్న ఎమ్మెల్యేలు వీరిద్దరితో పాటు ఇతర కీలక నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. బీఆర్ఎస్‌లో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి పెద్దగా నిధులు అందవని భావిస్తున్నారు. దీని బదులు అధికార పార్టీలో చేరి సౌకర్యంగా ఉండొచ్చన్న ఆలోచన చేస్తున్నారు.

కోడ్ ముగిసింది

ప్రభుత్వ పాలనకు తొలగిన అడ్డంకి

త్వరలోనే భారీగా అధికార్ల బదిలీలు.. పాలనలో కాంగ్రెస్ ముద్రకు రేవంత్ కసరత్తు



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికల క్రతువు పూర్తయి పాలనకు వేళయింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు దాదాపు ఏడు నెలల్లో మూడు నెలల పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండటంతో పెద్దగా ప్రభుత్వ కార్యకలాపాలు సాగలేదు. సంక్షేమ పథకాలూ ఆశించిన స్థాయిలో అమలు కాలేదు. గురువారంతో కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించారు. ముందు క్షేత్రస్థాయి ఉద్యోగులు మొదలు ఐఏఎస్‌ల వరకు పెద్ద ఎత్తున బదిలీలు చేయనున్నారు. బదిలీల అనంతరం అధికారులందరికీ ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల అమలుకు తీసుకోబోయే చర్యలపై దిశా నిర్దేశం చేస్తారు. ఉమ్మడి రాష్ట్ర ఆస్తుల పంపకం వివాదాలపైనా అధికారులతో చర్చించనున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో కాంగ్రెస్ మార్క్ పాలన కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

అధికారుల బదిలీలు

డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. మార్చిలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో శాసనసభ ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి అవకాశం లేకపోయింది. ఇదే విషయాన్ని సీఎం రేవంత్, మంత్రులు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. గురువారంతో ఎన్నికల కోడ్ ముగియడంతో సీఎం బదిలీలపై దృష్టి సారించారు. ఆర్నెల్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పెద్దగా అధికారులు బదిలీలు చేయలేదు. ఈసారి భారీగానే బదిలీలు ఉంటాయని భావిస్తున్నారు. సీఎంవోలోనూ మార్పులు ఉండవచ్చని సమాచారం. వివిధ ప్రాంతాలు, పలు విభాగాల్లో ఒక్కొక్కరినీ తీసుకొచ్చి సీఎంవోలో ఓఎస్డీలు, సెక్రటరీలుగా నియమించి, పలు శాఖల బాధ్యతలను అప్పగించారు. సీఎం ఆశించిన స్థాయిలో వారి పనితీరు లేదని, ముఖ్యమంత్రి చెబితే తప్ప ఫైలు కదలని పరిస్థితి ఉందనే ప్రచారం సచివాలయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. ముఖ్యమంత్రి ప్రజా సంబంధాలను పర్యవేక్షించే విభాగంలోనూ కీలక మార్పులు ఉండే అవకాశం ఉన్నదని సమాచారం. కేంద్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం జూన్ చివరివారంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అందులో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, నిధులు పరిశీలించిన తర్వాత జూలై రెండు లేదా మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహించి పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలనే యోచనలో రేవంత్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు "ప్రజాపాలన"లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అర్హులైన వారికి పథకాలు అందించాలని భావిస్తున్నారు. ధరణి పోర్టల్‌లో తలెత్తిన సమస్యలనూ త్వరితగతిన పరిష్కరించాలని సీఎం భావిస్తున్నారు. మూసీ నది సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించేలా అధికారులకు సీఎం సూచనలిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, పలు ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన బడ్జెట్ పైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఆగస్టు 15 లోగా రూ.2 లక్షల మేర రుణ మాఫీ చేస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో నిధుల సమీకరణపై దృష్టి సారించారు.

ఉమ్మడి ఆస్తులు, భూములపై నిర్ణయం

పదేళ్లుగా ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ జూన్ 2 నుంచి కేవలం తెలంగాణ రాజధానిగా మారిపోయింది. ఉమ్మడి ఆస్తుల విభజన మాత్రం పూర్తి కాలేదు. విభజన చట్టం షెడ్యూల్ 9, 10లో చేర్చిన ఆస్తులు, భూముల పంపకాలపై ఇరు రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ పరిధిలోని విలువైన భూములు షెడ్యూల్ 9, 10లో ఉన్నాయి. వీటిపైనా ఒక నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి నిధులపరంగా వెసులుబాటు వస్తుంది.

వికాస్‌రాజ్‌కు ఆర్థిక శాఖ?

కేంద్ర ఎన్నికల సంఘం ఆధీనంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈఓ) కార్యాలయంలో పని చేస్తున్న ముగ్గురు రాష్ట్ర కేడర్ ఐఏఎస్‌లలో కనీసం ఇద్దరిని తిరిగి ప్రభుత్వంలోకి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. ముగ్గురికీ సిన్సియర్ అధికారులుగా పేరు ఉండడమే కాకుండా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలాంటి మచ్చ పడకపోవడంతో వారిని ప్రభుత్వంలోకి తీసుకుని, కీలక బాధ్యతలు అప్పగించాలని యోచిస్తోంది. పార్లమెంటు ఎన్నికలు ముగియడం, ఇప్పట్లో కీలక ఎన్నికలు లేకపోవడంతో ఆ ఐఏఎస్‌లను తిరిగి ప్రధాన స్రవంతిలోకి తీసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం కూడా అనుమతిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సీఈవో వికాస్‌రాజ్‌ను మళ్లీ ప్రభుత్వంలోకి తీసుకొని, ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించవచ్చన్న చర్చ జరుగుతోంది. సీఈఓ కార్యాలయంలో 2003 బ్యాచ్‌కు చెందిన డీఎస్ లోకేష్‌కుమార్ అదనపు సీఈఓగా, 2009 బ్యాచ్‌కు చెందిన సర్ఫరాజ్ అహ్మద్ జాయింట్ సీఈఓగా పని చేస్తున్నారు. వీరిద్దరినీ తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. లూప్ లైన్‌లో ఉన్న అధికారుల్లో ఒకరిని సీఈవోగా నియమించే అవకాశం ఉంది.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా జరిగేలా చూడండి

- పాఠశాలలు ప్రారంభించేనాటికి విద్యార్థులకు యూనిఫాం అందాలి
- ఎరువులు సక్రమంగా అందేలా చూడాలి
- కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ప్రిలిమినరీ పరీక్షతోపాటు విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై గురువారం సచివాలయం నుంచి ఆమె జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు హాజరకానున్నారన్నారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతోపాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామని చెప్పారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కో-ఆర్డినేటరును నియమించామన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్లకు కూడా పరీక్షల ఏర్పాట్లపై తగిన ఆదేశాలు జారీ చేశామని, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందన్నారు. బ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో తగు చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను అభినందించారు. రాబోయే మూడు వారాలు ఇదే నిఘాను కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీజన్ ముగిసే వరకు విత్తనాలు కొన్న బిల్లులను రైతులు భద్రపర్చుకునేలా చూడాలని చెప్పారు. ఎరువుల తరలింపును పర్యవేక్షించి, సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే దానిపై నిర్ణీత గడువు లోగా సర్వే చేయాలన్నారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభించేనాటికి ఒక జత స్కూల్ యూనిఫాం చొప్పున విద్యార్థులకు అందేలా చూడాలని చెప్పారు.

వడ్ల నిల్వ, మార్కెటింగ్ సమస్యలతోనే వ్యవసాయ సంక్షోభం

- దిగుబడి పెరిగినా ఎగుమతుల్లో వెనుబడ్డాం
- ఎగుమతులు పెరిగితే రైతాంగానికి సరైన ధర
- నేడు హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు
- అధునాతన మిల్లులు వాడితే మరింత నాణ్యత
- సదస్సులో మిల్లర్లకు అవగాహన: తుమ్మల



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో ధాన్యం ఉత్పత్తి 8 రెట్లు పెరిగి, 14 కోట్ల టన్నులకు చేరుకున్నదని, వడ్ల ఉత్పత్తికి కావాల్సిన అన్ని వనరులు సాంకేతికత రైతుకి అందుబాటులోకొచ్చినా సాగు పరంగా సంక్షోభం ఇవాళ్టికీ పెద్ద సవాలుగానే విగిలిపోయిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయం పరంగా రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఉత్పత్తుల నిల్వ, మార్కెటింగే ప్రధాన కారణాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం 'ప్రపంచ వరి సదస్సు' ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. దేశం నుంచి 5కోట్ల టన్నుల మేర ధాన్యం దాదాపు 100 దేశాలకు ఎగుమతి అవుతుందని, ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా 45శాతంగా ఉందని చెప్పారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు, కొన్ని ఐరోపా దేశాలు సహా అమెరికా, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ధాన్యం కోసం భారత్‌వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాలను వినియోగించుకుంటే రైతులకు సరైన ధర లభిస్తుందని, మార్కెట్ నిల్వల పరంగా నెలకొన్న సమస్యనూ పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. "అంతర్జాతీయ కామోడిటీ సంస్థ వారు 22 ఏళ్లుగా ఏటా ఒక్కోదేశంలో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నారు. వరి ఎగుమతి, దిగుమతిదారులతో పాటు ప్రముఖ వరి శాస్త్రవేత్తలు, వరి పరిశ్రమకు సంబంధించిన ప్రముఖులను ఒక గొడుగు కిందకి తీసుకొచ్చి వరి అభివృద్ధికి కావాలసిన విధానపరమైన అంశాలను సదస్సు చర్చిస్తుంది" అని తెలిపారు. సదస్సుకు వివిధ దేశాలకు చెందిన 150 మంది ధాన్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులతో పాటు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిఫ్పైన్స్) నుంచి శాస్త్రవేత్తలు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయని, మన దేశీయ వరి ఎగుమతిదారులు, ఇతర దేశాల నుండి వచ్చే ధాన్యం దిగుమతిదారులతో నేరుగా సంప్రదింపులు జరిపుకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అధునాతనమైన రైస్ మిల్లుల ద్వారా ఎగుమతికి కావాల్సిన నాణ్యతను ఎలా పాటించవచ్చనేది మిల్లర్లకు అవగాహన కలుగుతుందన్నారు. నాగార్జునసాగర్ పరీవాహక ప్రాంతంలో సాగయ్యే హెచ్ఎంటీ, సూర్యాపేట, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో పండించే 1010 బాయిల్డ్ రకం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో పండే జై శ్రీరాం రకం, మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి ఇక్కడ ప్రాసెసింగ్ చేసే ఐఆర్64 (స్టీమ్ రైస్)కు బయటి బయటి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని, వీటి ఎగుమతుల అవకాశాలను కంపెనీల మధ్య జరిగే వాణిజ్య ఒప్పందాల ద్వారా పెంచడానికి అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. సదస్సుకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ హాజరవుతారని వెల్లడించారు.

వేల కోట్ల సర్కారీ భూములు హాంఫట్!

- ధరణి ఆపరేటర్ల మాయాజాలం
- ప్రభుత్వ భూములకు పాస్‌బుక్‌ల జారీ
- ధరణి ఆపరేటర్లతోపాటు ఒకరి అరెస్ట్
- పరారీలో రియల్టర్ సహా అయిదుగురు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగరంలో శాసనసభ ఎన్నికల ముందు వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు రికార్డుల్లో ప్రయివేటు వ్యక్తుల పరమైనట్లు తెలుస్తోంది. రంగారెడ్డి కలెక్టరేట్ కేంద్రంగా ఈ వ్యవహారం జరిగింది. కలెక్టరేట్‌లోని ధరణి ఆపరేటర్లను ఆకట్టుకొని, కోట్ల రూపాయలు ముట్టజెప్పి రియల్టర్లు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తుల పేర రాయించినట్లు ఆర్థిక నేరాల విభాగం పోలీసుల దర్యాప్తులో బయటకు వస్తోంది. గత ప్రభుత్వంలోని బడా నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు కలిసి సర్కార్ భూములను చెరబట్టిన వైనంపై ఇంతకు ముందు 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించిన సంగతి తెలిసిందే. గండిపేట మండలం పొక్కల్‌వాడ సర్వే నంబరు 4 లోని రూ.500 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమికి శాసనసభ ఎన్నికల సమయంలో ఎలాంటి పత్రాలు లేకుండా పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఇటీవల వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి రాయదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ భూకుంభకోణంపై విచారణ చేపట్టిన సైబరాబాద్ పోలీసులు ఇద్దరు ధరణి ఆపరేటర్లతో పాటు మరొకరిని అరెస్ట్ చేసి విచారిస్తే అనేక విస్తుబోయే విషయాలు బయటకు వచ్చాయి. నగర, శివారు ప్రాంతాల్లో రూ. వేల కోట్ల విలువైన ప్రభుత్వ, కాందిశీకుల భూములకు పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు బయటపడింది. ఈ వ్యవహారాలన్నీ ఇపుడు పోలీసులు తవ్వుతున్నారు. అరెస్టయిన వారిని రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారితో పాటు మరో ఆరుగురి కోసం గాలిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీలో భాగంగా ఉండే పొక్కల్‌వాడలో 5 ఎకరాల సర్కార్ భూమికి పాస్‌బుక్‌ల జారీ కోసం ధరణి ఆపరేటర్లు ప్రైవేటు వ్యక్తులతో కోటి రూపాయలకు డీల్ కుదుర్చుకుని దశల వారీగా ఈ మొత్తాన్ని తీసుకున్నారు. వీటికి సంబంధించిన అన్ని సాక్ష్యాలను పోలీసులు సేకరించారు. వీళ్లే నగరంలో మరిన్ని భూములను ఇదే విధంగా ప్రయివేటు వ్యక్తులపరం చేశారని పోలీసులు తవ్వుతుంటే తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు తనకు తెలియకుండా ధరణి పోర్టల్‌లో 98 దరఖాస్తులు క్లియర్ అయ్యాయని, దీనిపై విచారణ జరపాలని అప్పటి కలెక్టర్ భారతి హొళికెరి ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఆదిభట్ల పోలీసులు ఎలాంటి పురోగతి సాధించలేదు. తాజాగా పొక్కల్‌వాడ కేసు విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం తీగ అంతా లాగడంతో పాత విషయాలన్నీ బయటకు వస్తున్నాయి. భారతీ హొళికెరి ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన 67 కేసుల్లో కూడా ఈ ధరణి ఆపరేటర్ల పాత్ర ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పొక్కల్‌వాడ కేసులో గతంలో కలెక్టర్‌గా పనిచేసిన హరీశ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, ప్రొసీడింగ్స్ సృష్టించి ఆ తరువాత వచ్చిన భారతీ హొళికెరి హయంలో వీటిని ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించి, ఆమె కనుగప్పి వీటిని ఆమోదించి రెండు విడతలుగా పాస్‌బుక్‌లు జారీ చేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలతో అంటకాగిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

పొక్కల్‌వాడ కేసులో ఎవరెవరు?

పొక్కల్‌వాడ భూకుంభకోణంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ తెర వెనుక కథ నడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందరూ ఎన్నికల హడావిడిలో ఉన్న సమయంలో ఈ భూమిపై గతంలో కేసులు వేసి ఓడిపోయిన పూస లక్ష్మయ్య కుమారులు పూస రవీందర్, పూస ప్రహ్లాద్‌తో కలిసి అప్పటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు, ధరణి ఆపరేటర్ల సహకారంతో ఈ అయిదెకరాల పాస్‌బుక్ సంపాదించారు. ఈ పాస్‌బుక్‌లు జారీకాగానే వీరు ఈ భూమిని ఆధీనంలోకి తీసుకుని అందులో షెడ్లు వేసి కొందరిని కాపలా పెట్టారు. పొక్కల్‌వాడ సర్వే నంబరు 4 లోని ఐదు ఎకరాల భూమికి గుట్టుచప్పుడు కాకుండా పాస్‌బుక్ జారీ కావడంపై స్థానికంగా ఉన్న కొందరు ప్రభుత్వం మారిన వెంటనే రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ శశాంకకు సమాచారం వెళ్లడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. పాస్‌బుక్‌ల జారీలో అవకతవకలు జరిగాయని ఆయన నివేదిక ఇచ్చారు. దీంతో పట్టాదారు పాస్‌బుక్ యాక్టు 2020, సెక్షన్ 8 కింద పాస్‌బుక్‌లు రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గండిపేట తహసీల్దారు బుధవారం తన సిబ్బందితో వెళ్లి అక్కడ పాగా వేసిన ప్రైవేటు వ్యక్తులను వెళ్లగొట్టి, షెడ్లు కూల్చివేసి, క్రిమినల్ కేసు పెట్టారు. ఈ కేసులో ఎ-1గా పూస ప్లహాద్ ఎ-2గా పూస రవీందర్, ఎ-3గా జంగ రవీందర్ యాదవ్(రియల్టర్), ఎ-4గా దీపావత్ నరేష్ నాయక్, ఎ-5గా రాఘవేందర్‌రెడ్డి, ఎ-9గా బీమ్‌రావు ఉన్నారు. వీరంతా పరారీలో ఉన్నారు. ఎ-6 దీపావత్ శ్రీనివాస్ (ధరణి ఆపరేటర్ కలెక్టరేట్ హెల్ప్ డెస్క్), ఎ-7 సోంపల్లి మోహన్‌బాబు, ఎ-8 కుక్కల శివరామ్ కుమార్, ఎ-10 అంజనేయులు అరెస్ట్ అయ్యారు.

వెలుగులోకి మరికొన్ని కేసులు

సరూర్‌నగర్, గండిపేట, బాలాపూర్ మండలాల్లో వీరు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఇక్కడ ప్రభుత్వ భూములకు పట్టాదార్ పాస్ బుక్‌లు జారీ చేసినట్లు విచారణలో బయటపడ్డాయి. వీటిపై లోతుగా విచారణ కొనసాగుతోంది. రాజేంద్రనగర్‌లోని సర్వే నంబరు 277 నుంచి 326తో పాటు సర్వేనంబరు 328 నుంచి 337, 339, 340, 341, 342, 345, 368 వరకు గల కాందిశీకుల భూముల్లో అక్రమాలు జరిగాయి. అలాగే మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడ వద్ద సర్వే నంబరు 331, 339లోని కాందిశీకుల భూముల్లోనూ పాస్‌బుక్‌లు జారీ అయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఇప్పటివరకు పుప్పాలగూడలో రూ.1000కోట్లపైగా విలువ చేసే 21ఎకరాల భూములకు దొడ్డిదారిన పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు అధికారులు తేల్చారు.

పనులెలా జరుగుతున్నాయి!

- నేడు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మహదేవపూర్ రూరల్, మంథని/మంథనిరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక ప్రకారం మరమ్మతు పనులు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి శుక్రవారం ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 11.40 గంటలకు హెలికాప్టర్‌లో సుందిళ్లకు చేరుకొని, బ్యారేజీ మరమ్మతు/పునరుద్ధరణ పనులను పరిశీలిస్తారు. నిర్మాణ సంస్థ నవయుగతో పనులపై చర్చిస్తారు. అనంతరం అన్నారం బ్యారేజీని పరిశీలిస్తారు. తర్వాత మేడిగడ్డకు వెళతారు. బ్యారేజీని పరిశీలించి, మరమ్మతులపై నిర్మాణ సంస్థతో చర్చిస్తారు. మేడిగడ్డలో ప్రస్తుతం గ్రౌటింగ్‌తో పాటు గేట్లను ఎత్తే ప్రక్రియ చేపడుతున్నారు. గురువారం అధికారులు మేడిగడ్డ 16, 17వ నంబర్ గేట్లను విజయవంతంగా పైకి లేపారు. ఈ గేట్లను 100.50 మీటర్ల ఎత్తుకు లేపారు. దీంతో మరో ఐదు గేట్లను ఎత్తే ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కాగా, 7వ బ్లాకులో చేపట్టిన భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలు కొనసాగుతున్నాయి. సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల బృందం ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రతి పిల్లరు, గేట్ల ముందున్న బే ప్రాంతాల్లో ఈ బృందం పరీక్షలు చేస్తున్నట్టు ఓ అధికారి వివరించారు. మరోవైపు సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులు వారం రోజులుగా వేగంగా కొనసాగుతున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు బ్యారేజీ ఎగువ, దిగువన సీసీ బ్లాక్‌ల మరమ్మతులను నవయుగ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 2022లో వరదల వల్ల బ్యారేజీ ఎగువ ప్రాంతంలో కట్టకు ఒకవైపు పడిన గండిని పూర్తి స్థాయిలో పూడ్చివేస్తున్నారు. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం అన్నారం, శనివారం సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి, మరమ్మతు పనులను పరిశీలిస్తారు. తర్వాత హైదరాబాద్ చేరుకుని సోమవారం నుంచి శనివారం వరకు విచారణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. ఈ నెల 16న తిరిగి కోల్‌కతా వెళతారు.



ఏడో బ్లాక్‌లో ఎత్తిన 17వ నెంబరు గేటు

కొడుకు వదిలేసిపోతే.. కుక్కలు పీక్కుతిన్నాయ్!

- ఇంటి వద్ద 80 ఏళ్ల వృద్ధుడి మృతి.. 5రోజుల క్రితం ఘటన?
- పురుగులు పట్టి ఉబ్బిన మృతదేహం.. పీక్కుతిన్న శునకాలు
- కొడుకు, నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు.. భార్య మృతి
- 20 రోజుల క్రితం తండ్రిని ఒంటరిగా వదిలేసిన కొడుకు భార్యా పిల్లలతో వేరే ఇంటికి మకాం
- దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూడగా వెలుగులోకి
- మంచిర్యాల జిల్లా దొరగారిపల్లె గ్రామంలో ఘోరం

ఏసీసీ, జూన్ 6: కనీపెంచి పెద్దచేసిన తండ్రి వృద్ధాప్యంలో కదల్లేనిస్థితికి చేరుకోగానే వదిలేశాడా కొడుకు! ఆ వృద్ధుడికి భార్య బతికున్నా బాగోగులు చూసేదేమో! తండ్రి అవసానదశలో ఉన్నాడని గానీ, తాను వదిలేసి వెళితే ఆయన పరిస్థితి ఏమిటి అని గానీ ఆ కుమారుడు ఆలోచించలేదు. తండ్రిని వదిలేసి.. తన భార్యతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయి మరో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. పాపం.. ఆ పెద్దాయన, కుమారుడు వెళ్లిన మూడు వారాల్లోపే ప్రాణాలొదిలాడు. చనిపోయి ఎన్ని రోజులైందో ఏమో.. ఆ మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు వెళ్లగా కుక్కల మధ్య ఛిద్రమైన మృతదేహాన్ని చూసి హతాశులయ్యారు. మానవతావాదులను కన్నీరు పెట్టించే ఈ ఘోరం మంచిర్యాల జిల్లా దొరగారిపల్లె గ్రామంలో జరిగింది. మృతుడు అదే గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుడు బోరె గంగయ్య. స్థానికుల వివరాల ప్రకారం.. నలుగురు కూతుళ్లు, కుమారుడు మల్లేశ్ ఉన్నారు. అందరికీ తానే పెళ్లిళ్లు చేశాడు. నలుగురిలో ఇద్దరు కూతుళ్లను ఊర్లోనే ఇచ్చాడు. గంగయ్య భార్య 2014లో చనిపోయింది. అప్పటికి నుంచి గంగయ్య, కుమారుడు మల్లేశ్, కోడలితో కలిసి నివసిస్తున్నాడు. ఇరవై రోజుల క్రితం కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్లు ఇంట్లోంచి వెళ్లిపోయి తమదారి తాము చూసుకోవడంతో గంగయ్య ఇంట్లో ఒంటరిగా మిగిలిపోయాడు. ఈ నెల 1న పెరుగు ప్యాకెట్ కోసం దగ్గర్లోని కిరాణ షాపుగా వెళుతుండగా గంగయ్యను చివరిసారిగా చూసినట్లు స్థానికులు చెప్పారు. ఆ తర్వాత.. అంటే ఐదు రోజుల నుంచి గంగయ్య బయటకు రాలేదు. గంగయ్య ఇంటి ప్రాంగణం నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు వెళ్లిచూడగా ఆరుబయట పురుగులు పట్టేసి ఉబ్బిపోయిన స్థితిలో మృతదేహం.. దాన్ని కుక్కలు పీక్కు తింటుండం కనిపించింది. ఈ సంగతి స్థానికులు చెబితేనే ఊర్లో ఉంటున్న కొడుకు, కోడలికి.. ఇద్దరు కూతుళ్లకు తెలిసింది. మృతదేహాన్ని కదిలించే స్థితి లేకపోవడంతో మునిసిపల్ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

వాట్సాప్ గ్రూపు నుంచి తన బర్త్‌డే ఫొటోలు, తనను తీసేశారని...

ఇద్దరు యువకుల దారుణ హత్య

వారిద్దర్నీ మాట్లాడేందుకు విల్లాకు పిలిచి కత్తులతో పొడిచి చంపారు

- రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఘోరం
- పోలీసుల అదుపులో నిందితులు
- ప్రధాన నిందితుడు స్థానిక బీజేపీ నాయకుడు
- బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన


గుండమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్ (ఫైల్)

కడ్తాల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూప్‌లో తన పుట్టినరోజు వేడుకల ఫొటోలతో పాటు గ్రూప్ నుంచి తనను తొలగించడంతో కోపంతో రగిలిపోయిన ఓ వ్యక్తి అతని స్నేహితుడితో కలిసి ఇద్దరు యువకులను కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశాడు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బట్లర్‌ఫై సిటీలో ఈ ఘోరం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరూ పోలీసులకు లొంగిపోగా మరో ఐదుగుర్ని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడు స్థానిక బీజేపీ నాయకుడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బట్లర్‌ఫై సిటీలోని ఓ విల్లాను గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు జల్కం రవి ఇటీవల అద్దెకు తీసుకొన్నాడు. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అందులో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నెల 4న సాయంత్రం రవి తన పుట్టినరోజు వేడుకలను పలువురు బీజేపీ నాయకులు, స్నేహితులతో కలిసి జరుపుకున్నాడు. ఆ ఫొటోలను గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. పెద్దఎత్తున ఫొటోలను పోస్టు చేయడంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. గ్రూప్ అడ్మిన్‌గా ఉన్న గ్రామానికి చెందిన శేషగారి శివగౌడ్ వాట్సాప్ నుంచి రవి ఫొటోలతో పాటు గ్రూప్ నుంచి అతడిని తొలగించాడు. ఆ తర్వాత గుండమోని శివగౌడ్ కూడా అడ్మిన్‌గా ఉండడంతో రవిని మళ్లీ గ్రూప్‌లో చేర్చాడు. ఈ నేపథ్యంలో రవి బుధవారం సాయంత్రం ఇద్దరు శివగౌడ్‌లను తన ఆఫీసుకు పిలిపించుకున్నట్లు సమాచారం. రవితో సన్నిహితంగా ఉండే వారిద్దరూ ఆఫీసుకు వెళ్లారు. అప్పటికే అక్కడ రవితో అతని స్నేహితుడు జంగారెడ్డిపల్లికి చెందిన ఆమనగల్లు పట్టణ బీజేవైఎం నాయకుడు పల్లె రాజుగౌడ్ ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత నలుగురూ కలిసి మద్యం తాగుతున్న తరుణంలో రవి వాట్సాప్ గ్రూపుల్లో తన ఫొటోలు ఎందుకు డిలీట్ చేశావని శేషగారి శివగౌడ్‌ను ప్రశ్నించాడు. వారి మధ్య మాటామాటా పెరిగిన క్రమంలో రవి, రాజు గౌడ్ కత్తులతో దాడి చేసి గుండమోని శివగౌడ్ (25) శేషగారి శివగౌడ్ (27)లను హత్య చేశారు. ఆ తర్వాత విల్లాకు తాళం వేసి వెళ్లిపోయిన రవి, రాజుగౌడ్‌లు గురువారం ఉదయం పోలీసులకు, స్థానికులకు జంటహత్యల గురించి సమాచారం ఇచ్చి లొంగిపోయారు. పోలీసులు ఆ విల్లా వద్దకు వెళ్లి.. తాళం వేసి ఉండటంతో పైభాగం నుంచి చూసి ఇద్దరు హత్యకు గురైనట్లు గుర్తించారు. క్లూస్‌టీం సమక్షంలో తాళాలు పగలగొట్టి సాక్ష్యాధారాలు సేకరించారు. ఇద్దరు యువకుల మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శేషగారి శివగౌడ్ హైదరాబాద్‌లో డ్రైవర్‌గా, గుండమోని శివగౌడ్ హైదరాబాద్ హైటెక్ సిటీలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. జంట హత్యలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ వివాదాలు, వ్యక్తిగత కక్షలు కూడా హత్యకు కారణంగా పలువురు అనుమానిస్తున్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

హతుల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కడ్తాల్‌లో ఆందోళనకు దిగారు. పోలీసు స్టేషన్ ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించి హంతకులను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని రాస్తారోకో చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని విచారణ జరుపుతున్నామని, బాధితులకు న్యాయం చేస్తామని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పి ఆందోళన విరమింపజేశారు. అయితే సాయంత్రం వందలమంది మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కడ్తాల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వారితో, పోలీసులతో మాట్లాడారు. హత్యలకు గల కారణాలు తెలుసుకున్నారు.

డ్రగ్స్‌కు బానిసై మైనర్ పైశాచికత్వం

- కత్తితో మెడ, చెయ్యి మీద కోసుకున్నాడు
- ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన వైనం


రక్తమోడుతున్న చెయ్యి

బంజారాహిల్స్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు ఓ మనిషి మానసిక ఆరోగ్యాన్ని, జీవితాన్ని ఎంత నాశనం చేస్తాయో చెప్పే ఘటన ఒకటి వెలుగు చూసింది. డ్రగ్స్‌కు బానిసైన ఓ మైనర్ బాలుడు.. తాను ఏం చేస్తున్నానో గ్రహించలేని స్థితిలో తన శరీరాన్ని తీవ్రంగా గాయపరుచుకున్నాడు. రక్తం చిందేలా కత్తితో తన మెడ మీద తానే కోసుకున్నాడు. ఆపై, చేతి మీద బలంగా కోసుకుని రక్తాన్ని రహదారిపై చిందిస్తూ వికృతానందం పొందాడు. మరో వ్యక్తి ఈ వికృతాన్ని వీడియో తీయగా దానిని సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చెయ్యమని ఆ బాలుడు చెప్పడం మరింత శోచనీయం. హైదరాబాద్, బోరబండ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బయటకొచ్చింది. బోరబండ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు(16) కత్తితో తన మెడను కోసుకుని వీధుల్లో పది నిమిషాల పాటు తిరిగాడు. అనంతరం మూసి ఉన్న ఓ దుకాణం వద్ద కూర్చొని చెయ్యిని కోసుకుని రక్తాన్ని బయట విరజిమ్మాడు. ఇందుకు సంబంధించిన వీడియోను చూసిన నెటిజన్లు ఇదేం శాడిజం అనుకుంటూ నివ్వెరపోయారు. డ్రగ్స్‌కు బానిసై తన కుమారుడు ఇలా ప్రవర్తిస్తున్నాడని సదరు బాలుడి తల్లి సోషల్ మీడియాలో వివరణ ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు.. యువత జీవితాలను నాశనం చేస్తోన్న డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేటి నుంచి 'ప్రజావాణి'

- ఎన్నికల కోడ్ ముగియడంతో పునఃప్రారంభం

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం(నేడు) నుంచి పునఃప్రారంభం కానుంది. ఎన్నికల కోడ్ ముగియడంతో కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి తెలిపారు. ఇకపై, ప్రతి మంగళ, శుక్రవారాల్లో మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని ప్రకటించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామర్స్ వైపు మొగ్గు

- 'దోస్త్'లో 38శాతం విద్యార్థుల ప్రాధాన్యత దీనికే..
- తర్వాతి స్థానాల్లో లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు
- తొలి విడతలో 76,290 మందికి ప్రవేశాలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దోస్త్ మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. ఇందులో భాగంగా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 76,290 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. వీరిలో 58,920 (77.23 శాతం) మంది కామర్స్, లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులనే ఎంపిక చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 28,655 (37.56 శాతం) మంది కామర్స్ గ్రూపులో ప్రవేశాలు పొందారు. లైఫ్ సైన్స్‌లో 15,301 (20.03 శాతం), ఫిజికల్ సైన్స్‌లో 14,964 (19.61శాతం) మంది చేరారు. ఆర్ట్స్‌లో 7,766 (10.18%), డేటా సైన్స్/ఏఐ/ఎంఎల్‌లో 2,502 (3.28%), డీఫార్మసీలో 90 (0.12%), ఇతర కోర్సుల్లో 7,012 (9.19%) మంది ప్రవేశాలు పొందారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మొదటి విడత ప్రవేశాల భర్తీ ప్రక్రియ ముగియడంతో ఇందుకు సంబంధించిన వివరాలను విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, దోస్త్ కన్వీనర్ ఆచార్య లింబాద్రి, ఇతర ఉన్నతాధికారులు గురువారం విడుదల చేశారు. తొలి విడతలో 1,04,784 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 81,769 మంది వెబ్ ఆప్షన్లను పొందారు. 76,290 మందికి ప్రవేశాలను కేటాయించారు. 55,124 మంది తొలి ప్రాధాన్యతలోనే సీట్లు పొందగా.. 21,166 మంది రెండో ప్రాధాన్యతలో పొందినట్లు అధికారులు తెలిపారు. మొత్తం ప్రవేశాలు పొందిన వారిలో 72,431 ఇంగ్లిష్ మాధ్యమ విద్యార్థులుండగా.. తెలుగు మాధ్యమం 3,314, ఉర్దూ మాధ్యమం 540, హిందీ మాధ్యమం ఐదుగురున్నారు. దోస్త్ ప్రకటించిన ర్యాంకుల్లో మొదటి ర్యాంక్‌ను తమ్మ అలేఖ్య (99.40%) సాధించారు. ఈమె తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం (కోఠి మహిళా కాలేజీ)లో లైఫ్ సైన్స్‌లో ప్రవేశం పొందారు. కడం అంకిత (99.30%), బానోతు అంజలి (99.30%) రెండు, మూడు ర్యాంకులు సాధించగా వీరు నిజాం కాలేజీ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఫిజికల్ సైన్స్‌లో ప్రవేశం పొందారు. టాప్-10 ర్యాంకుల్లో 9 మంది బాలికలే ఉండటం విశేషం. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 886 డిగ్రీ కాలేజీల్లో 546 కోర్సులు, 3,84,748 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి విడతలో 70 కాలేజీల్లో ఒక్క ప్రవేశం కూడా జరగలేదు. మొదటి విడతలో ప్రవేశాలు పొందినవారు ఈనెల 12లోపు రూ.500 లేదా రూ.1,000 ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ రుసుము చెల్లించి సీటును ఖరారు చేసుకోవాలని దోస్త్ కన్వీనర్ ఆచార్య లింబాద్రి తెలిపారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దు చేస్తామన్నారు. రెండో విడత రిజిస్ట్రేషన్ గురువారం నుంచి ప్రారంభమైందని, ఇది ఈ నెల 14వరకు కొనసాగుతుందని.. 18న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

థ్యాంక్యూ సార్.!



మంత్రి కోమటిరెడ్డికి క్రీడాకారిణి తేజావత్ సుకన్య ధన్యవాదాలు

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సుకన్య ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన ఆమె ఈ మేరకు గురువారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల టెక్సాస్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో ఆమె టాప్ 8వ ర్యాంకు సాధించారు. అయితే ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు సుకన్యకు తన కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా మంత్రి సహకారం అందించారు. అలాగే జూలైలో దక్షిణాఫ్రికాలో జరగనున్న ఏషియా, ఆఫ్రికా, పసిఫిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లేందుకు కూడా సంపూర్ణ సహకారం అందిస్తానని కోమటిరెడ్డి ఆమెకు హామీ ఇచ్చారు. తనలాంటి ఎందరో క్రీడాకారులకు మంత్రి అండగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

317 జీవో ఉద్యోగుల వినతుల కోసం ప్రభుత్వ వెబ్ పోర్టల్

కొత్త జిల్లాలకు సర్దుబాటు చేస్తూ 317 జీవో కింద బదిలీ చేసిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక వెబ్ పోర్టల్ go317and46issues.telangana.gov.inను ఏర్పాటు చేసింది. ఇందులో తమ వినతులను పోస్టు చేయాలని ఉద్యోగులకు సూచిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పోర్టల్ ఏర్పాటు చేసింది. ఉద్యోగులు ఈ పోర్టల్‌లో తమ సమస్యలను పోస్టు చేయాలని తెలిపింది. ఈ విషయాన్ని ఉద్యోగులందరికీ తెలియజేయాలని అన్ని శాఖల కార్యదర్శులను ప్రభుత్వం ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 7 జూన్ 2024



కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ముంబైలో నిర్వహిస్తున్న అలీ యావర్ జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజెబిలిటీస్ (ఏవైజే ఎన్ఐఎస్‌హెచ్‌డి)- డిప్లొమా, డిగ్రీ, పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్దేశించిన మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సంస్థ ప్రధాన కేంద్రం ముంబై సహా సికింద్రాబాద్, నోయిడా, కోల్‌కతా, జాన్లా, భోపాల్, అహ్మదాబాద్ ప్రాంతీయ కేంద్రాల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అలీ యావర్ జంగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్పీచ్, హియరింగ్ కోర్సులు

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ(బీఏఎస్ఎల్‌పీ): కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ముంబై సెంటర్లో 40, కోల్‌కతాలో 31, నోయిడాలో 25, సికింద్రాబాద్‌లో 34 సీట్లు ఉన్నాయి. నోయిడా క్యాంపస్‌లో ప్రవేశానికి గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ నిర్వహించే ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్-హియరింగ్ ఇంపెయిర్‌మెంట్(బీఈడీ స్పెషల్ ఈడీ-హెచ్ఐ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబైలో 30, కోల్‌కతాలో 23, జాన్లాలో 30, సికింద్రాబాద్‌లో 33 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: మొదటి కోర్సుకు కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/ కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/ సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. బీఈడీ కోర్సుకు కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు

పీజీ డిప్లొమా ఇన్ ఆడిటరీ వెర్బల్ థెరపీ: కోర్సు వ్యవధి ఏడాది. ముంబై సెంటర్లో 20 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రీహాబిలిటేషన్ సైకాలజీ: కోర్సు వ్యవధి ఏడాది. భోపాల్‌లో 20 సీట్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పోర్టల్ ద్వారా ఈ కోర్సులో అడ్మిషన్ ఇస్తారు.

అర్హత వివరాలు: మొదటి కోర్సుకు డిగ్రీ(ఆడియాలజీ/స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/స్పీచ్ అండ్ హియరింగ్/స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులై ఉండాలి. రెండో కోర్సుకు డిగ్రీ(జనరల్ సైకాలజీ)/పీజీ(సైకాలజీ/కౌన్సెలింగ్ సైకాలజీ) పూర్తిచేసి ఉండాలి. డిసైన్స్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎమ్మెస్సీ ఆడియాలజీ: ఇది రెండేళ్ల ప్రోగ్రామ్. ముంబై సెంటర్లో 12, సికింద్రాబాద్ సెంటర్లో 13 సీట్లు ఉన్నాయి.

ఎమ్మెస్సీ(స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. కోల్‌కతా సెంటర్లో 15 సీట్లు ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు.

ఎంఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్-హియరింగ్ ఇంపెయిర్‌మెంట్): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబై సెంటర్లో 23 సీట్లు ఉన్నాయి.

అర్హత: మొదటి రెండు కోర్సులకు కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జూలై 31 నాటికి రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తికావాలి. ఎంఈడీ కోర్సుకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈడీ(హెచ్ఐ/డెఫ్/హెచ్‌హెచ్/స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్ఐ) పూర్తిచేసి ఉండాలి. బీఈడీ (జనరల్ ఎడ్యుకేషన్)తోపాటు డిప్లొమా(స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్ఐ) పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (డీఐఎస్ఎల్ఐసీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబై, కోల్‌కతా కేంద్రాల్లో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఆర్‌సీఐ(ఏఐఓఏటీ) ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ఈ ప్రోగ్రాములో ప్రవేశాలు కల్పిస్తారు.

ఏవైజేఎన్ఐఎస్‌హెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్

బీఏఎస్ఎల్‌పీ కోర్సుకు నిర్వహించే పరీక్ష ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఆధారంగా ఉంటుంది. బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్, జనరల్ ఎబిలిటీ, ఆప్టిట్యూడ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంఈడీ కోర్సుకు నిర్వహించే పరీక్షలో మెంటల్ ఆప్టిట్యూడ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ/ ఐసీటీ, ఇంగ్లీష్ కాంపిటెన్స్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ అండ్ డిజెబిలిటీస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పీజీడీఏవీటీ ప్రోగ్రామ్‌నకు నిర్వహించే ఎగ్జామ్‌లో బీఏఎస్ఎల్‌పీ, బీఈడీ(హెచ్ఐ) సిలబస్‌ల ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఎమ్మెస్సీ (ఆడియాలజీ)లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో బీఏఎస్ఎల్‌పీ సిలబస్‌లోని ఆడియాలజీ పోర్షన్ నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు జూలై 13న; ఎమ్మెస్సీ (ఆడియాలజీ) ప్రోగ్రామ్‌నకు జూలై 20న; బీఈడీ, ఎంఈడీ, పీజీడీఏవీటీ ప్రోగ్రామ్‌లకు జూలై 27న
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** సికింద్రాబాద్
- **వెబ్‌సైట్:** ayjnihh.nic.in, www.osmania.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్సెస్(ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్సెస్) 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు చొప్పున మొత్తం 34 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 28
- **పరీక్ష కేంద్రం:** యూఓహెచ్ క్యాంపస్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ తేదీ:** జూలై 7
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in


ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూలై 2
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 9
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/



హెచ్‌పీసీఎల్‌లో ఇంజనీర్లు

ముంబయిలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 247

పోస్టుల వారీగా ఖాళీలు

1. మెకానికల్ ఇంజనీర్: 93
2. ఎలక్ట్రికల్ ఇంజనీర్: 43
3. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: 5
4. సివిల్ ఇంజనీర్: 10
5. కెమికల్ ఇంజనీర్: 7
6. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్: 6
7. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్ట్స్: 4
8. సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్ - నాన్ - ఫ్యూయల్ బిజినెస్: 12
9. సీనియర్ ఆఫీసర్ - నాన్ ఫ్యూయల్ బిజినెస్: 2
10. మేనేజర్ - టెక్నికల్: 2
11. మేనేజర్ - సేల్స్ ఆర్అండ్‌డి ప్రొడక్ట్ కమర్షియలైజేషన్: 2
12. డిప్యూటీ జనరల్ మేనేజర్ క్యాటలిస్ట్ బిజినెస్ డెవలప్‌మెంట్: 1
13. చార్టర్డ్ అకౌంటెంట్స్: 29
14. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్: 9
15. ఐఎస్ ఆఫీసర్: 15
16. ఐఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ - సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్: 1
17. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్: 6

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీఈ, బీటెక్, సీఏ, ఎంసీఏ, ఎంబీఏ, పీజీడీఎం, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: యూఆర్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1180. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: https://www.hindustanpetroleum.com/

జాబ్ కార్నర్

బీఎస్ఎఫ్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్... ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ (గ్రూప్-బి, సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 162

1. ఎస్ఐ(మాస్టర్): 7 పోస్టులు
2. ఎస్ఐ(ఇంజన్ డ్రైవర్): 4 పోస్టులు
3. హెడ్ కానిస్టేబుల్(మాస్టర్): 35 పోస్టులు
4. హెడ్ కానిస్టేబుల్(ఇంజన్ డ్రైవర్): 57 పోస్టులు
5. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెకానిక్)(డీజిల్/పెట్రోల్ ఇంజన్): 3 పోస్టులు
6. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఎలక్ట్రీషియన్): 2 పోస్టులు
7. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఏసీ టెక్నీషియన్): 1 పోస్టు
8. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఎలక్ట్రానిక్స్): 1 పోస్టు
9. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెషినిస్ట్): 1 పోస్టు
10. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(కార్పెంటర్): 3 పోస్టులు
11. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ప్లంబర్): 2 పోస్టులు
12. కానిస్టేబుల్(క్రూ): 46 పోస్టులు



అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, ఇంజన్ డ్రైవర్ సర్టిఫికెట్ ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 1

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ఐజీసీఏఆర్‌లో వివిధ ఖాళీలు

కల్పక్కం(తమిళనాడు)లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలోని వివిధ యూనిట్లలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. సైంటిఫిక్ ఆఫీసర్- ఇ/డి/సి: 34 పోస్టులు
2. టెక్నికల్ ఆఫీస్-బి: 1 పోస్టు
3. సైంటిఫిక్ అసిస్టెంట్-సి/బి: 12 పోస్టులు
4. నర్స్-ఎ: 27 పోస్టులు
5. ఫార్మసిస్ట్-బి: 14 పోస్టులు
6. టెక్నీషియన్-బి: 3 పోస్టులు

విభాగాలు: జనరల్ సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, డెంటల్ ప్రొస్టోడోంటిక్స్, అనస్థీషియా, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, రేడియాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, న్యూక్లియర్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హ్యూమన్/మెడికల్ జెనెటిస్ట్, జనరల్ డ్యూటీ/క్యాజువాలిటీ వర్కర్, ఫిజియోథెరపీ, మెడికల్ సోషల్ వర్కర్, పాథాలజీ, రేడియోగ్రఫీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్, ఆర్థోపెడిక్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్.

వయసు: సైంటిఫిక్ ఆఫీసర్/ఇ పోస్టుకు 50 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/డి-40 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/సి-35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్/సైంటిఫిక్ అసిస్టెంట్/నర్స్/సైంటిఫిక్ 30 ఏళ్లు, ఫార్మసిస్ట్/టెక్నీషియన్ 25 ఏళ్లు మించకూడదు.

అర్హత: సంబంధిత విభాగంలో 10+2/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్స్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: https://www.igcar.gov.in/


చిట్టి కథ




తగిన శాస్తి


ఒక ఊరిలో వీరయ్య అనే వ్యాపారికి ఒక గాడిద ఉండేది. వీరయ్య రోజూ ఆ గాడిద మీద సరుకుల బస్తాలు, సంచులు వేసి అంగడికి తీసుకెళ్లి అమ్మి డబ్బు సంపాదించేవాడు. ఒక రోజు వీరయ్య గాడిద మీద కొన్ని ఉప్పుసంచులు వేసి సంతకు తీసుకుని పోతుంటే, దారిలో ఒక చిన్న నీటి మడుగు అడ్డం వచ్చి, ప్రమాదవశాత్తూ గాడిద అందులో పడిపోయింది. ఉప్పు బస్తాలు కూడా నీటిలో మునగడంతో ఉప్పునీటిలో కరిగిపోయి గాడిద పైకి లేచేసరికి వీపు మీద బరువు తగ్గిపోయి చాలా తేలికగా హాయిగా అనిపించింది గాడిదకు. ఆ మర్నాడు కూడా వీరయ్య గాడిద వీపు మీద ఉప్పు సంచులు వేసి సంతకు తీసుకెళుతూ ఉంటే ఆ రోజు వీపు మీది బరువు తగ్గించుకోవాలని గాడిద ఈసారి కావాలనే నీటి మడుగులో పడిపోయింది. ఉప్పు కరిగి పోవడం వల్ల వీరయ్యకు నష్టం వచ్చింది. గాడిద కావాలనే నీటిలో పడిన విషయం గమనించిన వీరయ్య ఆ మర్నాడు గాడిదకు బుద్ధి చెప్పాలనుకున్నాడు. సంతకు వెళ్లే దారిలో ఉన్న నీటి మడుగులో ఆ రోజు కూడా గాడిద తాను మోస్తున్నది ఉప్పు సంచులే కదా అనుకుని నీళ్లలో పడింది. కానీ సులువుగా పైకి లేవలేకపోయింది. ఎంతో కష్ట పడి పైకి లేచాక చూస్తే దాని వీపు మీద ఉన్నవి దూది సంచులు. అవి నీటిలో తడవగానే ఇంకా బరువెక్కి పోయి. గాడిదకు నడవడం కూడా కష్టంగా మారింది. మనం చేయాల్సిన పనిని, బాధ్యతను తప్పించుకోవాలి అని చూస్తే పర్యవసానం ఇలాగే అవుతుంది కాబోలు నాకు తగిన శాస్తి చేశాడు నా యజమాని అనుకున్న గాడిద మరెప్పుడూ తను చేయాల్సిన పనిని తప్పించుకోలేదు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి









డైలీ సుడోకు - 326

5					4
	8	4		1	7
7					
4		8			
	5	2		3	

సుడోకు - 325 సమాధానం

8	7	1	9	6	4
4	6	5	2	8	3
2	3	9	7	5	1
3	9	2	6	1	7
5	1	6	8	4	2
7	4	8	5	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.